ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



తిరుపతిచందనపు బొమ్మలు


1. కాళీయమర్దనము
2. శ్రీ వేంకటేశ్వర
3. గోపాలకృష్ణ

19-11-1947 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

వార్తలు - విశేషాలు



శ్రీనగర్‌లో భారతసైన్య యుద్ధగతులను పర్యవేక్షించటానికి వెళ్లిన సర్దార్ బలదేవసింగ్, సంస్థానశాఖా కార్యదర్శి వి. పి. మీనన్, ప్రభుత్వ రక్షణశాఖామంత్రి ఖులాంబక్షీ మహమ్మద్ గారలు.




భారతసైన్యాలు శ్రీనగర్ విమానాశ్రయంలో దిగి వెంటనే రణరంగానికి పోతున్న దృశ్యం



ఢిల్లీలో ఆహారమంత్రుల సమావేశంలో, నెహ్రూ, ముఖర్జీ, షణ్ముఖం ప్రభృతులతో రాజేంద్రప్రసాద్ చర్చలు నడిపారు. సమావేశంలో రాజేంద్రప్రసాద్ ఉపన్యసిస్తూ యావద్భారతదేశానికి ఆహార విషయంలో సమ్యగ్విధాన మవలంబించి, స్వయంపోషకమవటం చాలా అవసరమని చెప్పారు.



ఇండియాహౌసులో పండిట్ నెహ్రూ, చిత్రపటావిష్కరణ లార్డ్ మౌంట్ బాటన్ చే జరుపబడినది.



పాకిస్థాన్ ప్రభుత్వ హైకమిషనర్, ఐ. యల్. ఓ. సమావేశ ప్రతినిధులకిచ్చిన విందులో, మౌంట్ బాటన్ దంపతులు, నెహ్రూ.



లక్ష్మణస్వామి మొదలియారు, (మద్రాసు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలరు) జాన్ సార్జెంటుగారలు. విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థుల సమావేశములో సార్జంటు గా రుపన్యసించారు.



ఇంగ్లండు బోర్డు ఆఫ్ ట్రేడ్ కార్యాలయ నూతన అధ్యక్షుడు జేమ్సు హెరాల్డు-విల్సన్ మంత్రులలో కెల్ల పిన్న. వయస్సు 31.

ఆంధ్రపత్రిక


సంవత్సర చందా రు. 12-0-0 విడిప్రతిక అణాలు 0-4-0	ప్రతి బుధవారమున ప్రకటింపబడును ఒగు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)	సంపుటము **40** సంచిక **10**

Founder: K. NAGESWARA RAO.

సర్వజిత్తు సంవత్సర కార్తిక శుద్ధ సప్తమి బుధవారము



ఇత్తడితో చేసిన దేవతా ప్రతిమలు



ఆంధ్రపత్రిక

1947 వ సం॥ నవంబరు నెల 19-వ తేది బుధవారము

కృపలానీ రాజీనామా

కాంగ్రెసు అధ్యక్షుడు రాజీనామా నిచ్చుట అనునది అసాధారణ సంఘటన అయినప్పటికీ, శ్రీ ఆచార్య కృపలానీగారి రాజీనామా ఏమాత్రము ఆశ్చర్యము కలిగించదు. ఆయన ఎప్పుడో రాజీనామా నిచ్చినట్లునూ, తన సహచరుల కోరిక ననుసరించి వాయిదా వేసినట్లునూ అందరికి తెలియుటే అందుకు కారణము. మొన్న ఢిల్లీలో జరిగిన అ. భా. కాంగ్రెసు సమావేశమునకు తన రాజీనామాను సమర్పించుచూ ఈపర్యాయము ఉపసంహరణ అనునది అసంభవమని తెలిపెను. దేశబంధు చిత్తరంజన్ దాస్ సుభాసుచంద్ర బోసులు తప్ప పూర్వము కూడ కాంగ్రెసు అధ్యక్షపదవికి ఎవరూ రాజీనామా నిచ్చినట్లులేదు.

కాంగ్రెసుకార్యవర్గమునకు, కేంద్ర ప్రభుత్వమునకు తగిన సహకారము, సామరస్యము లేకపోవుటవల్లనే తాను రాజీనామా నివ్వవలసి వచ్చినదని శ్రీ కృపలానీగారు తమ ఉపన్యాసమునందు తెలిపిరి. అలాంటి సహకారము అనవసరమని కేంద్ర ప్రభుత్వములోని కాంగ్రెసుసభ్యులు అభిప్రాయ పడుచున్నారా అనిన లేదని శ్రీ కృపలానీగారే అనిరి. "సహకార ఆవశ్యకతను సిద్ధాంత రీత్యా అందరూ అంగీకరించిరి. కాని ఆచరణలో మాత్రము అది కనుబడుట లేదు. ప్రధాన విధానములందు అందరికీ ఏకాభిప్రాయము లేకపోవుటే ఇందుకు కారణ మనవచ్చును. లేదా కేంద్ర ప్రభుత్వములో నున్న నా సహచరులకు కాంగ్రెసు అధ్యక్షుడుగా ఉన్న నాయందు విశ్వాసము లేకపోవుట ఇందుకు కారణమై యుండవచ్చును. నేనే కారణమైనట్లయితే జాతి శ్రేయస్సుకు అత్యవసరమైన ఈ సహకారమునకు నేను అడ్డముగా నుండను. నేను తొలగి పోవడంవల్ల నా తరువాత ఈ అధ్యక్ష స్థానాన్ని ఆక్రమించే వారికి, కేంద్ర ప్రభుత్వమునకు ఈ సహకారభావము ఏర్పడిన నాకంటె సంతోషించెడి వారుండరు."

కాంగ్రెసు, కేంద్ర ప్రభుత్వములకు అన్యోన్య సహకారము ఉండవలెనన్నది నిర్వివాదాంశము. కాంగ్రెసు ఆదేశము ననుసరించి, దాని పేరున ప్రభుత్వపదవులను ఆమోదించిరి కాబట్టి వారి భక్తిశ్రద్ధలు ప్రధానముగా కాంగ్రెసుపట్లనే యుండవలెను. ప్రజా సముదాయములో వారికున్న ప్రతిష్ఠ, పలుకుబడులు కాంగ్రెసు మూలముననే ప్రాప్తించినవి. అందువల్ల కృపలానీగారు తెలిపిన అభిప్రాయముతో ఏకీభవించని వారుండరు. కేంద్ర ప్రభుత్వమునకు, కార్యవర్గమునకు ఏర్పడిన దూరమే రాష్ట్ర కాంగ్రెసునకు, రాష్ట్ర మంత్రులకుకూడ అనేకచోట్ల ఏర్పడినది. ఈ విభేదములకు, మంత్రివర్గ విధానములు మూలమా, కేవలము వ్యక్తిగతమైన పోటీలు మూలమా అను ఆలోచనకు ఆస్కారము లేకపోలేదు. బహుశః రెండూ అని చెప్పవచ్చును. శ్రీ కృపలానీగారు చెప్పిన పరిస్థితికి కార్యవర్గ కేంద్ర ప్రభుత్వ నిర్మాణములు కారణ మనవచ్చును. అంతేకాక కేంద్రప్రభుత్వమునకు కాంగ్రెసు పక్షమున పంపిన ప్రతినిధుల ప్రతిష్ఠకూడ ఇందుకు మూలము. వారు కార్యవర్గములో అధిక సంఖ్యాకులుగ నుండుటేగాక, ఇన్నాళ్లు కాంగ్రెసుకు అష్ట దిగ్గజములవలె నుండిన వారు. వారందరూ ప్రభుత్వములో మంత్రి పదవులను అంగీకరించుటతో కార్యవర్గమునకున్న ప్రతిష్ఠ వారి వెంటనే నడచినది. సంస్థా విషయికముగా కార్యవర్గమునకు, కేంద్రప్రభుత్వమునకు భేదమున్నప్పటికీ ప్రజలుమాత్రము కేంద్ర మంత్రులను కాంగ్రెసు అధిష్ఠాన వర్గముగనే ఎంచుతూ వచ్చిరి. మంత్రి పదవులను ఆమోదించుటతో వారి కాస్థానము పోలేదు. గాంధిజీ కాంగ్రెసులో నాలుగణాల సభ్యుడు కూడకాదు. కాని ఆయనకు ఏ కాంగ్రెసుఅధ్యక్షునికి లేని అధికారమున్నది. కేంద్రప్రభుత్వసభ్యులు కాంగ్రెసు కార్యవర్గము యెడ ఉదాసీనభావము చూపించిరనిననూ, ప్రతి అంశమునందు ఆయనను సంప్రతించుట మానలేదు. దేశమునందు ఆయనకున్న పలుకుబడే అందుకు కారణము.

అయినా కార్యవర్గములో అధిక సంఖ్యాకులు ప్రభుత్వసభ్యులైనపుడు శ్రీ కృపలానిగారు విమర్శించినట్టి లోపములు వాస్తవమునకు రానవసరము లేదు. ప్రభుత్వములో చేసిననిర్ణయములనే కార్యవర్గములోకూడ చేసెదరు. అధ్యక్షునికి తగిన గౌరవము చూపకపోయిన అది ఆ స్థానము నలంకరించిన వారిని జట్టి యుండగలదు. కేంద్రప్రభుత్వము కార్యవర్గమును శ్రద్ధతో చూడకపోయిన అ. భా. కాంగ్రెసు సంఘమును చూడలేదుకదా?

ప్రధాన విధానములపైనికూడ కేంద్రప్రభుత్వమునకు, తమకు ఏకాభిప్రాయము లేనట్లుకూడ శ్రీ కృపలాని గారు సూచించిరి. ఆ విధానములేవో సూచించిన బాగుండెడిది. నెహ్రూ ప్రభుత్వము కాంగ్రెసు ప్రాథమిక సూత్రములకు భిన్నముగ వ్యవహరించుచున్నదని ఎవరునూ అన సాహసింపజాలరు. అసలు అధికారమునకు వచ్చిన అనంతరము, అల్లరులను అణచుటకు తప్ప మరితర విషయములందు శ్రద్ధవహించుటకు వీలే లేకపోయినది. ఇక కాకపోయిన పాకిస్థాన్ యెడల ముస్లిములఎడ ఇప్పటికన్న ఘట్టిగా వ్యవహరించి యుండవలసినదని యుండవచ్చును. కేంద్రప్రభుత్వ నిర్మాణములోనూ, కొన్ని నియామకములందు నెహ్రూ నిర్ణయములగురించి విమర్శకు అవకాశము లేకపోలేదు. ఇపుడు అధినివేశ శాసనసభగా మారిన రాజ్యాంగ పరిషత్తులో కాంగ్రెసుకు అధిక బలమున్నది. అటువంటప్పుడు కాంగ్రెసుపక్ష నాయకుడైన నెహ్రూ తన మంత్రివర్గములో కాంగ్రెసువారికి ఇంకనూ ఎక్కువ ప్రాతినిధ్యము నిచ్చి యుండవలసినదను అభిప్రాయము లేకపోలేదు. కాంగ్రెసు యెడల అభిమానమనునది లేకపోవుటే కాక మొన్నటివరకు కాంగ్రెసుపైని కత్తికట్టిన వారిని తీసికొనుట అనేకులకు ఆశ్చర్యము కలుగచేసినది. హిందూమహాసభ ఇప్పుడుకూడ కాంగ్రెసుకు వ్యతిరేకముగ ఎన్నికలందు పోటీ చేయుచున్నది. పశ్చిమ బెంగాలు ప్రధానికి పోటీగా హిందూ మహాసభ తప్ప మరెవ్వరూ అభ్యర్థిని నిలుపలేదు. విదేశ రాయబారులను నియమించుటలో నెహ్రూ తగిన విచక్షణ చూపలేదను నింద లేకపోలేదు. అంతేకాక, తన సహచరుల నెవరినీ సంప్రతించలేదను వాదుకూడ నున్నది. ముస్లిములను రాయబారులుగా వేయుట భారతప్రభుత్వ నిష్పాక్షిక దృక్పథమునకు నిదర్శనమైననూ, వ్యావహారిక దృష్ట్యా అదెంతవరకు వాంఛనీయము అని సందేహము తెలిపిన కాంగ్రెసు ప్రముఖులు లేకపోలేదు. శ్రీ కృపలానీ రాజీనామా ఒక విధముగా నెహ్రూ అవలంబించిన ఈ విధానముపట్ల నిరసన మనవలసియుండును. గాంధీజీ ఆయన రాజీనామా నిచ్చుటకు అంగీకరించిన ఆయన అభిప్రాయములతో ఏకీభవించినట్లు ఎంచకూడదు. కృపలానీగారిని తమ అసహజస్థితి నుండి తప్పించుటకే ఆమోదమును తెలిపెను.

అయితే ఒక సంగతి గమనించుట అవసరము. కాంగ్రెసు అధ్యక్షుడు, భారత ప్రధానమంత్రి ఒకే వ్యక్తి అయిన తప్ప అధ్యక్షునికి పూర్వ ప్రతిష్ఠ యుండదు. ప్రధాన మంత్రిని అతని చెప్పుచేతలందు ఉండమనుట కూడ న్యాయముకాదు.

పటేల్ హెచ్చరిక

ప్రజాభిప్రాయమును ధిక్కరించి వ్యవహరించిన నైజాము ప్రభుత్వమునకు జునాఘడ్‌కు పట్టినగతే పట్టునని సర్దార్ పటేల్ చెప్పినందుకు వారికి కోపము వచ్చినది. భారత ప్రభుత్వముతో రాయబారములు నడుపుచున్న హైదరాబాద్ ప్రతినిధి వర్గ నాయకుడు సర్దార్ ప్రకటనను విమర్శించెను.

అయినప్పటికీ హైదరాబాద్ జరుపుచున్న రాయబారముల సరళి ఆ ప్రభుత్వ అంతశ్శుద్ధికి నిదర్శనముగ లేవు. ఆంతర్యమున ఏదోనుంచుకొని, కాలయాపనకు రాయబారములను సాగించుచున్నట్లు బోధపడుచున్నది. తమ మాన ప్రాణ రక్షణార్థము, దినదినమూ, ఆ సంస్థానమునుండి భారత ప్రభుత్వ ప్రాంతములకు కట్టగుడ్డంతో వచ్చుచున్న కాందిశీకులను చూచి భారతప్రభుత్వము ఏమని ఊహింపవలసియుండునో సంస్థానాధికారులకు తెలియదా? దక్షిణ భారతములో ముస్లిము రాజ్యస్థాపన చేయుటే వారి ఆశయమని దానంతట అది వ్యక్తమగుచున్నది. దీనికి తోడుగ సంస్థానము వెలుపలి ముస్లిములతో గలసంబంధములు అనుమానాస్పదముగ నున్నవి ఈ మధ్య వెలువడిన అంశములు హైదరాబాద్ సత్యసంధతయెడ విశ్వాసమును కలుగ చేయుట లేదు. రాష్ట్రమంత్రులు సరిహద్దులను తనిఖీచేసి గట్టి ఏర్పాటులను చేయవలసి వచ్చినది. ఇట్టి సంఘటనలు జరుగుచున్నప్పటికీ సర్దార్ పటేలు తొందరపడి మాట్లాడెననుట కేవలము సాహసము. భారత ప్రభుత్వముతో స్నేహపూర్వకమైన ఒప్పందము చేసికొన హైదరాబాద్ ప్రభుత్వము ఆకాంక్షించుచున్నదనుట, ఆ ప్రభుత్వము మైత్రితో ఉన్న ప్రభుత్వమనుట నమ్మశక్యముకాని మాటలు. సర్దార్ పటేల్ హెచ్చరిక భావము అంతకుమించి వేరుకాదు. కాల నిర్ణయమనునది లేక రాయబారములు సాగింప భారతప్రభుత్వము ఇక అంగీకరింపజాలదు. భారత అధినివేశములో తమకుతామే చేరుటో లేక, సమస్యను ప్రజానిర్ణయమునకు వదలుటో నైజాం తేల్చుకొనవలసిన సమయము వచ్చినది. దానినింకనూ వాయిదా వేయతలపెట్టిన ప్రమాద పరిస్థితులకు దారి తీయకతప్పదు.

ప్రపంచసమస్యల పరిష్కారాలు

లూయీ ఫిషర్

భారత దేశంనుంచి, అపరిచితవ్యక్తి ఒకరు, నా కొక ప్రచారకర పత్రము పంపారు. బహుశా ఆయన స్వంత ఖర్చు మీదే అది అచ్చు వేయించి పంపినట్లుంది. అందులో కొన్ని వాక్యాలు నినాదాలు నాకు చాలా మోదం కల్గించాయి. "స్వాతంత్ర్యం వచ్చింది కాబట్టి, ఇక మనదేశ గౌరవం మన వ్యక్తి ప్రవర్తనల మీదే ఆధారపడి ఉంటుంది." అని ఒక చక్కని వాక్యం అందులో దొరికింది. సైన్యాలు, ఆయుధాల మీదకాదు; పరదేశాక్రమణల మీదకాదు; మీ దైనందిన ప్రవర్తనల మీదే మీ దేశ గౌరవా గౌరవాలు ఆధారపడి ఉంటాయి.

మరొక నినాదము. "ఇదిగో స్వాతంత్ర్యము. దీని కర్తృత సంపాదించు కొందాము." ఇదిగో శాంతి. ఇదో జీవితము. వీటి కర్తృతలు సంపాదిద్దాము. ఇదంతా వ్యక్తులమీదే ఆధారపడిఉంది.

నేడు ప్రపంచము అంతా ఒక చిన్న మానవకూటం మాదిరిగా తయారయింది. ఆ కూటములో ప్రతివాడికీ, గతరాత్రి జాగరణలతో శిరోవ్యథలు పట్టుకొన్నట్లున్నాయి. భార్యలకు భర్తలకు మధ్య పోరులుగా ఉన్నాయి. ఇరుగు పొరుగు లొకరి దొడ్లోకి ఒకరు కసువులు ఎత్తిపోస్తున్నారు. టెలిఫోనులలో పరస్పర దూషణలు రింగులెత్తుతున్నాయి. గత ఆరేళ్ల యుద్ధకాలపు రాత్రి గడిచి తెల్లవారాక అనేకులకు ఈ పొద్దున్న చద్దిఅన్నంకూడా లేకుండా పోయింది. మధ్యాహ్నం అంబలి నీళ్ళు చిక్కితే గొప్ప. శీతగాలి కీళ్ళు కొంకర్లు పోయేటట్లుగా గడగడ లాడిస్తోంది. ఇదే ఈ ఉదయాన్న మన "నాగరిక" ప్రపంచ స్వరూపం.

కార్యరంగంలో ప్రవేశించటం మాని ప్రభుత్వాలు, విషసిక్తాస్త్రాలను గాలిలోకి సంధించి వదులుతున్నారు. రాజనీతిజ్ఞులు బుసలతో పొంగుతున్నారు. దేశాలొకదానితో ఒకటి పోటీలు పడుతున్నాయి. కోట్లకొలదీ జనం మాత్రం, తిండీ, బట్ట, నిలువనీడ, జీవించటానికి తగ్గ ఏ విశ్వాసమూ లేక అల్లాడి పోతున్నారు.

నిజంగా ఈనాడు ప్రపంచం చాలా తల్లక్రిందులుగా ఉంది. ఈ సంవత్సరం ఫ్రాన్సు అమెరికా నుంచి 15 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి చేసుకొంది. ప్రక్కనె ఉన్న రైనోలోయ గనుల భాగ్యమంతా, రాజకీయాల అవకతవకతో, బూజుపట్టినట్టయి పోతోంది. బ్రిటన్‌కు 20 లక్షల టన్నుల ఉక్కు కావలసి కొరత అయి ఉంది.

ఏతత్కారణంగా కొత్త ఫ్యాక్టరీలు, కొత్త నివసన గృహాలు కట్టటం చాలా మటుకు తగ్గించుకోవలసి వచ్చిందని సర్ స్టాఫర్డ్ క్రిప్సు చెప్పాడు. మరి అమెరికా మాత్రం (గత కొద్ది వారాల వెనకటి దాకా,) తన ఉక్కు పరిశ్రమను విస్తృతం చేయకుండా ఆపేసింది, త్వరలో ఆర్థిక మాంద్యం ఏర్పడనున్నదేమోనని భయంచేత. (ఇప్పుడు ఉత్పత్తి పెంచటానికి మళ్లీ పూనుకొంటోంది.) స్వీడిషు ప్రభుత్వము అధికారరీత్యా ప్రకటిస్తూ, ఇకముందు, మోటార్లు, ఫిల్ములు, ప్లాస్టిక్ వస్తువులు, ఇత్యాదులు అమెరికా నుంచి దిగుమతి చేసుకో వీలులేదని తెల్పింది.

అమెరికాకు స్వీడిష్ ఎగుమతులు మాత్రం కొస్త జోరే చేస్తారు. ఒకనాడు మహాభాగ్యవంతమై స్వీడన్ నిల్చింది. నేడు రష్యాకు తన యంత్ర వస్తువులను ఎగుమతి చేస్తే, రష్యా తిరిగి అమ్మేందుకు పోలిష్ గనుల బొగ్గు ఏమీ లేదనే కారణంచేత, రష్యాకు ఎంత అవసరంగా ఉన్నాకూడా, యంత్ర వస్తువుల ఎగుమతి వాళ్ళ కొంది.

సోవియట్-కమ్యూనిస్టులకు నిత్య అనుకూలుడైన డీన్ ఆఫ్ కాంటర్‌బరీ, ప్రాచ్య యూరప్‌లో పర్యటన చేసి వచ్చాక లండన్‌లో మాట్లాడుతూ, "పోలండ, జెకొస్లావాకియా, హంగరీ, రుమేనియా, బల్గేరియా, యుగోస్లావియాలు, యంత్ర సంపత్తి లేక ఘోరంగా బాధ పడుతున్నాయని చెప్పాడు. పశ్చిమ రాజ్యాలతో మైత్రి కల్పకోవాలనే అవి ఆతురపడుతున్నాయన్నాడు. "కేవలం రెండు వేల మోటారు ట్రక్కులు పంపితే చాలు, అమెరికా యుగోస్లోవాకియా మైత్రిని సంపాదించ వచ్చును" అన్నాడు. కాని తూర్పు యూరప్ రాజ్యాలను మార్షల్ ప్రణాళికలో చేరవలసిదని ఆహ్వానిస్తే, చివరకు నిరాకరించాయి. ఈనాడు సమిష్టి రాజ్యసభామందిరంలో మోత లెత్తుతున్న మాటలలో అమెరికా పట్ల యుగోస్లావియా చూపిస్తా మనుకొన్న "మైత్రి" మాత్రం కనబడదు.



సమిష్టి రాజ్యసమితి సభలో ఉపన్యసిస్తున్న బ్రిటిష్ ప్రతినిధి హెక్టర్ మాక్‌నీల్

ఈ నవంబరు మొదలునా, జెకోస్లోవాకియా రేషను ప్రమాణాలు, రొట్టి, పంచదార, పాలు వెన్న బంగాళా దుంపలు, అన్నిటిలోనూ కూడా క్షీణించుకు పోతున్నాయి. హాలండ్‌లో కాయగూరలు ఎక్కువే ఉన్నాయి. మునుపు వాటికి జర్మనీ బజారులో అమ్మకం. నేడక్కడ డబ్బులేదు. అందుచేత అవన్నీ హాలండులోనే కుళ్ళి పోతున్నాయి.

రష్యన్ ఆక్రమిత జర్మన్ భాగంలో 'హాల్లీ' పట్టణంలో ఒక గూడ్సు స్టేషన్ మీద పడి జనం బొగ్గుబస్తాలు, బంగాళా దుంపలు దోపిడి చేశారు.

వాషింగ్టన్‌లో; అమెరికన్ బ్రిటిష్ రాయబారాలు, తమతమ జర్మనీ జోనులలో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు మాత్రం తయారు చేస్తున్నారు. ఉన్న ఫ్యాక్టరీలు పీకెయ్యాలో వద్దో అని జర్మన్ పౌరులు ఆక్రందనలు చేస్తున్నారు. ఒక చేత్తో పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికలు పుచ్చుకొని, రెండో చేత్తో ఉన్న ఫ్యాక్టరీలను "కూల దొయ్యటాన్ని" పిచ్చి గొడవ" అనాలో ఏమనాలో తెలియదు. కాని జరుగుతూన్న సంగతిమాత్రం ఇది.

ఇంతంతటి మహా భీకర సమస్యలు ఎదుర్కొంటుంటే, వ్యక్తి నిరుపాయుడై నిస్సహాయుడై నిలబడుతున్నాడు. తన క్రియాలాపాలన్నీ ఉడిగించుకొని, ప్రభుత్వాలకో రాజకీయ నాయకులకో, తనను పూర్తిగా అప్ప చేస్తేసు కొంటున్నాడు. ఈ మనుష్యులు అతన్ని బానిస చేసేందుకే అధికారాలుపయోగిస్తున్నారు. విషమ సమయాల్లో వ్యక్తి తన్నివారణకై, ప్రభుత్వం మీద ఆధార పడుతాడు. నేడు ప్రతి నిత్యం మహా విషమ ఘటనా నిబిడమై పోతోంది ప్రపంచం. ఈ విషమస్థితి ఎంత దీర్ఘంగా సాగితే అంత ఎక్కువగా ప్రజాస్వామ్యాలు, వ్యక్తి స్వాతంత్ర్య హక్కులూ కూడా తీవ్రాఘాతాలను తినవలసి వస్తుంది.

ఈనాడు అంత దారిద్ర్యము అనుభవించకుండా ఉన్న వ్యక్తులూ, నియంతృత్వ జిగీషా కళంకితులుకాని నిజాయితీ కల అధికారులూ, ఇంకా జీవన ప్రమాణాలు కొస్త ఎక్కువగానే ఉంటూన్న దేశాలు, అంటే అమెరికా లాంటి దేశాల ప్రభుత్వాలు, వీరందరూకూడా, ఈ చారిత్రక సమయంలో, తమతమ సంపూర్ణ శక్తులను సమీకరించుకొని, మానవ స్వేచ్ఛలను బలిగొంటూ ప్రభుత్వాలు ప్రతిభలు వలగబెట్టుకొనేందుకు చేసే ప్రబల ప్రయత్నాన్ని నిరోధించటం, తమ విధ్యుక్త ధర్మంగా భావించి పని చేయవలసి ఉంది.

ఆర్థిక అవసరాల నెదుర్కోటానికి, అంతర్జాతీయంగా అత్యధికమైన కృషి జరగటం చాలా తక్షణావసర మని నేను భావిస్తున్నాను. వట్టి మాటలతో కాలి కడుపులు నిండవు. ఇక లేక్ సక్సె సమావేశంలో జరుగుతున్న సమిష్టి సంప్రదింపులు, వ్యాపారరీత్యా దేశాలు సన్నిహితసంబంధాలు కుదుర్చుకోటానికి అభ్యంతర విధానంలో పర్వతాలలాగే అడ్డు నిలుస్తున్నాయి.

ప్రభుత్వాలు, దూషణ ప్రతిదూషణలు పరస్పర నిందారోపణలు చేసుకోవటం మానివేయాలి. ఇక నియంతృత్వేతర దేశాలలో, ప్రైవేటు ప్రచురణ సంస్థలను ప్రభుత్వం అదుపులో ఉంచాలనటం అర్థంలేనిపని, ప్రయోజన శూన్యం కూడా. అందువల్ల సాధించగలిగే దేదీలేకపోగా, పొరపులు ఎక్కువ చేసుకోవట మౌతుంది. వాక్స్వాతంత్ర్యానికి వచ్చిన తిప్పలేమిటంటే, ఆశినమాట గిటనివాడు ఎవడో ఒకడుంటూంటాడు. అంతమాత్రాన్న ఏ స్వల్పంగానైనా అణచటానికి ప్రయత్నిస్తే, ఇంటి బానిసత్వానికి మళ్ళీ పునాది వేయటమే అవుతుంది. ఏ దేశంలో, వార్తాపత్రికలు, రేడియోలు, తదితర ప్రచురణలు ఒకరొక్కరుగా నిర్మించుకోకుండా ఉంటారో, అల్లాంటి చోట, విదుర్లు నుంచి రక్షణాధికారం పొంద ప్రయత్నించవచ్చును. కాని అల్లాటి దేశమంటూ ఏదైనా ఉందేమో నాకు తెలీదు.

అందుచేత, ఈ నాడు మనం జీవిస్తున్న ఈ తీవ్రకాలాలలో, "కూద ప్రలాపాలూ," "ఇవి ఎవరు మొదలెట్టారో" అంటూ, చిలిపి తగాదాలు పెట్టుకోటం చాలా కుత్సితంగా కనిపిస్తుంది. అంతకన్నా రాజకీయ వేత్తలు, ఆర్థిక వేత్తలు, మొదలైన వారంతా శాంతంగా ఒక్కొక్క చోట సమావేశమయి, ఉత్పత్తి, ప్రణాళికలు, ఎగుమతులు దిగుమతులు, ఋణపణాలు, ఇంకా తత్సంబంధి విషయాలు, ఇన్నీ చర్చించుకొని తేల్చుకొంటే బాగుండునని నా కనిపిస్తుంది. ఆ సమావేశాలలో, ఒక్క అమెరికా, పశ్చిమ యూరపియన్ వర్గాలే ఉండాలని లేదు. ఫ్రాన్సు, ఇటలీ, ఇంగ్లాండు, పశ్చిమ జర్మనీ దేశాలు, మానవజాతి భవిష్య న్నిర్మాణానికి చాలా ముఖ్యాలే అని ఒప్పుకొన్నా, ఆ దేశాలన్నీ కలిపినా, 18 కోట్ల జనాభా మాత్రమే కదా! మరి చైనా ఇండియా, ఇండోనీసియా, ఇండోచైనా, బర్మా మలయా, సయాం — యీ దేశములలోనే శతకోట్ల జనాభా నివసిస్తున్నారే! వాళ్ళ సహాయం లేనిదే ప్రస్తుత రాజకీయ ఆర్థిక విపత్తులను తొలగించుకొని పరిష్కరించు నేందుకు అవకాశమే లేదే! మరి మార్షల్ ప్రణాళికలో ఆసియా ఖండపు ఊసే లేక మరచి పోయారు.

మార్షల్ ప్రణాళికకు ప్రాతిపదికైన భావము బహుశా ఒక్క అమెరికా మాత్రమే సహాయం అంటూ చేయగలదని. కాని ఇది పూర్తిగా సరికాదు. ఉదాహరణకు డచ్చి తూర్పు ఇండియా దీవులు ఈనాటి ప్రపంచపు కొరతను తీర్చేందుకు సహాయం చేయగల అమూల్య సంపదను, రబ్బరు, నూనె, తగరం, పంచదార, ఇంకా తదితర ముఖ్య వస్తువులను కలిగి ఉన్నాయి. కాబట్టి మార్షల్ ప్రణాళిక కొనసాగాలంటే, ఇండోనీసియాలో శాంతి ఏర్పడటం చాలాముఖ్యం. అయితే ఈ విషయాన్ని ఈ దృష్ట్యా చూపినవాళ్ళే ఇంతవరకు లేరు. అమెరికా కాంగ్రెసు,నవంబరు 17వ తేదీని సమావేశమవాలని ట్రూమన్ అధ్యక్షుడు ఆయత్త పరచాడు. మళ్ళీ అధ్యక్ష ఎన్నికల సమయం సమీపించింది. ఇప్పుడు మార్షల్ ప్రణాళికను అంగీకారం చూపించి, సాధికారంగా చేయగల ఈ శాసనసభికులు, విదేశ విషయిక ప్రాతిపదిక సమస్యలకన్నా, దేశాంతర్గత రాజకీయాల పాకులాటలకే ఓట్ల బలాలను ఉపయోగించుకో ప్రయత్నించ వచ్చును. ఉదాహరణకు కొందరు రాజకీయ వేత్తలు, పన్నులు తగ్గించటానికి ప్రయత్నించ వచ్చును. దేశంలో పలుకుబడికి ఏనాడైనా ఇది బహుసులభోపాయము. కాని పన్నులు తగ్గిస్తే ప్రభుత్వాదాయము తగ్గిపోతుంది ఇంక విదేశాలకు పెట్టుబడులు పెట్టే ఆస్కారముండదు, అంతకన్నా కూడా అమెరికాలోనే ధరలు పెరిగిపోయి, పై దేశాలకు సాయం చెయ్యాలంటే మరీ భారమని తోస్తుంది.

ఒకవేళ అమెరికన్ కాంగ్రెసు, మార్షల్ ప్రణాళికను కొనసాగించటానికి తగినంత సొమ్ము ఇయ్యాలని ఒప్పుకొంటుందనే అనుకొన్నా, రష్యా, ప్రాచ్యయూరప్‌లుకూడా ఇందులో కలిసి రావాలని ఆహ్వానించటమే చాలా మేలని తోస్తుంది. ఏ తక్షణ సహాయంకోసం 16 యూరపియన్ రాజ్యాలు ఆతురతో ఎదురు చూస్తున్నాయో, ఆ సహాయం చేయటంలో ఇంకా జాగరణచేస్తూ కూర్చోక, అంతర్జాతీయ ఉత్పత్తి వాణిజ్యాలను పెంచేందుకు ఒక అఖండమైన ప్రణాళికను తయారు చేయించి తత్సాధనకు వెంటనే ఉపక్రమించాలి. ఏ ప్రభుత్వాన్నీ ఇందులో కలవమని ఒత్తిడి చేయటం ఏ మాత్రం ఉండదని స్పష్టమే. అయితే ఎవరు వచ్చి కలుస్తామన్నా, ఒకవేళ మళ్ళీ మనస్సులు మార్చుకొన్నామన్నా, చేరటానికి, విడిపోటానికి కూడా అవకాశం ధారాళంగా ఉండాలి.

అసలు ఇప్పటి లోక పరిస్థితుల విషమ స్వరూపాన్ని, తీవ్రతను కూడా తగినంత గాఢంగా మనం ఎవళ్ళూ అర్థం చేసుకోటం లేదేమోనని నా భయం. ఒక వంక దేశాలు చితికి పోతున్నా, ఇరు రాజకీయ వేత్తలు చర్చలతో కాలం వృథా పుచ్చుతున్నారు. ఈ చర్చల తీవ్రతే ప్రపంచం మరీ రోగపీడితమై పోయిందని ఋజువు చేస్తున్నాయి. దేశాలలోనూ దేశాలమధ్యా జీవిత వ్యవహారాలు సమస్థితిలో ఉంటే, ద్వేషాలూ, పరస్పర దూషణాలూ మటుమాయ మౌతాయి. ఈ తీవ్రచర్చలన్నీ కూడా ప్రపంచ వ్యాధి లక్షణాలే అని జాగ్రత్త పడాలి.

నవల

నారాయణభట్టు

శ్రీ నోరి నరసింహశాస్త్రి

౨౦

గురునాథ శ్రేష్ఠి

గురునాథశ్రేష్ఠి రాజమహేంద్రపుర కిరాటులలో నెల్లసంపన్నుడు. అతని పూర్వులు విదేశములతో ఓడవ్యాపారము చేసి విశేషధన మార్జించిరి. రాజరాజ నరేంద్రుని పెదతండ్రి శక్తివర్మ రాజ్యమునకు రాకముందు ఇరువది యేడేండ్లు వేంగీదేశము అరాజకముగా నుండెను. ఎక్కడ బలముగలవా డక్కడ ప్రభుత్వము నెరపి బీదలను దోచుకొనెను. సంఘబలము లేని పలువురు తూర్పు సముద్రమునందు సువర్ణద్వీపములకును, యవద్వీపమునకును, మలయదేశమునకును, శ్రీవిజయమునకును వలసపోయిరి. పలువు రొక్కమారు వలస పోవలసినందున నావలు దొరక వయ్యెను. ఉన్న నావ లన్నిటికి రాబడి హెచ్చెను. గురునాథశ్రేష్ఠి తండ్రి యీ విధముగా కోటీశ్వరుడై పోయెను. వారి నావలు యానసహములు. వారి భటులు విశ్వాసపాత్రులు. వారి వ్యాపారములో మోసము లేదు.

గురునాథశ్రేష్ఠికి గృహయాజమాన్యము సంక్రమించునప్పటికి దేశములో రాజశాసనము సమర్థమై శాంతి నెలకొనెను. వలసలు తగ్గిపోయెను. వారి లాభములు చూచి పలువురు క్రొత్తనావలు కట్టి వ్యాపారము సాగించిరి. అంతట గురునాథశ్రేష్ఠి మెల్లమెల్లగా ఓడవ్యాపారము తగ్గించెను. విదేశములతో తెగని వ్యాపారమునకుమాత్ర మవసరమగు నావ లుంచుకొని పూర్వార్జితవిత్తము భద్రపరచుకొనుచు దానిని వృద్ధికి ఋణము లిచ్చి పెంపు చేసికొనుచుండెను.

వంశక్రమాగతమైన మర్యాద యతడీ వృత్తిలో గూడ సంపాదించెను. అత డిచ్చు ఋణములపై కోరువృద్ధి స్వల్పము. కాలికవృద్ధియే కాని చక్రవృద్ధియు కారితవృద్ధియు నెన్నడు కోరడు. ఎదురు లెక్కలు కోరినవారికి వ్రాయించి ఇప్పించును. అట్టి లెక్క లున్నను లేకున్నను అతని లెక్కలలో పొరపాటు రాదను ప్రసిద్ధి కలదు; అతనివద్ద ఋణము పుచ్చుకొనుటకు అధమర్ణులుగా ధనవంతులును పేదలును వచ్చుచుందురు. అంతియకాదు. పలువు రాతనివద్ద ధనము దాచబెట్టుదురు. కొన్ని వర్తక సంఘములును, గ్రామసంఘములును అతనివద్ద ధనము దాచుకొనుటయు, ఋణము తీసికొనుటయు గలదు.

ఈ వ్యాపారమునకు రాజమహేంద్రపురములో నాతనికి పెద్దభవనముకలదు. దానిని ప్రత్యేకముగా బలిష్ఠముగా కట్టించెను. దాని రక్షణనిమిత్తము సాయుధులై పలువురు రక్షకభటులు కాపుందురు. పత్రములు, లెక్కలు వ్రాయుటకతనివద్ద కరణము లనేకులు కలరు. వారు పలువురు జైనులు. వారేనాటి లెక్క లానాడు శ్రేష్ఠి కప్పగింపవలెను. అవి సరిచూచుటలో గురునాథుని కద్భుతప్రజ్ఞ కలదు.

గురునాథశ్రేష్ఠి అగ్రతకు చిహ్నముగా రాజరాజ నరేంద్రుడు ఛత్రచామరములు గౌరవలాంఛనములుగా ప్రసాదించెను. ధాన్యశ్రేణీపతియగు సిరివిసెట్టికి రాజమర్యాదలో రెండవ స్థానమే కలదు. తరచుగా వర్తక వ్యవహారములలో గురునాథశ్రేష్ఠినే యధికరణికునిగా రాజరాజు నియమించువాడు. తీర్పు లిచ్చుటలో గూడ నాతడు బహుసమర్థుడు. పారశీక వర్తకుల నేరము విచారించి ప్రధాన వర్తకులను శిక్షించి సేవకులు ముగ్గురిని ఇతడు వదలివేసెను.

ఈనాడు పదివేల గద్యాణములు ఋణము కావలె నని కోరుచు కుమారసప్తకములో చిన్నవాడగు రాజమార్తాండునియొద్దనుండి వార్తాహరుడు వచ్చెను.

పూర్వము కుమారసప్తకము గురునాథశ్రేష్ఠియొద్ద నెన్నడోగాని ఋణ మడుగువారు కారు. చైత్రమాసాదిగా మిగిలిన సోదరు లారుగురును చెరి యొక పదివేల గద్యాణములను ఋణము తీసికొని వెళ్లియుండిరి. వా రందరు రాజరాజ సమీప బంధువులు. వా రందరయెడ రాజరాజునకు వాత్సల్యము కలదు. మరియు వారు జనసామాన్యమున కందుబాటులో నుండి లోకాదరము గడించిరి. వారికి రాజాస్థానములో గౌరవము కలదు. వారి జీవికలకు అనేక గ్రామములు కలవు. వారి కుటుంబమునకు ఆరువదివేల గద్యాణములు ఋణము పెట్టుటలో భయమేమి?

వరహాలు వేంగీ దేశములో వ్యవహారమున నుండెను. గద్యాణములు విదేశ వ్యాపారమున నుపయోగపడుచుండెను. వీ రిన్ని గద్యాణములతో ఏమి విదేశవ్యాపారము చేయుచున్నారు?

క్రిందటి దినమున రాజరాజు మహాసభలో గురునాథ శ్రేష్ఠియు నుండెను. బ్రాహ్మణ హత్య కాముని గూర్చిన విచారణ వినియుండెను. కాముడు యువరాజుమీద నేరము మోపుటకు ప్రయత్నించుచున్నను అది నిలుచునట్టు లేదు. హత్యకు యువరాజు కారకుడైన ప్రమాదజనితము కామరాజపుత్రుడు కారకుడైన ప్రమాదమున వీలు లేదు. అది విని యింటికి వచ్చిన వెంటనే కుమార సప్తకములో నెవరైన ఋణము కోరినచో తనకు తెలుపనిది పత్రములు పూర్తి చేయవల దని అగ్రకరణమునకు తెలిపెను.

'అందువలన రాజమార్తాండుని వార్తాహరుని, కరణములు గురునాథశ్రేష్ఠియొద్దకు బంపిరి.

అతనిజూచి గురునాథుడు సందేహించెను. ఈ స్వల్ప వ్యవధానమున నీ సోదరులందరకు నింత ధన మెందుకు కావలసి వచ్చినది! అరువదివేల గద్యాణములకు భయము లేనిచో నిక ఈ పదివేల గద్యాణములకు భయమా?

రాజమార్తాండుని పత్రిక తెచ్చిన సేవకుడు గురునాథశ్రేష్ఠికి నమస్కరించి పత్రము చేతి కందిచ్చి నిలుచుండియే యుండెను. శ్రేష్ఠి మరల పత్రము చదువుకొనెను.

అరువదివేల గద్యాణములు పోవుచున్నచో మరి పదివేలు కూడ నెందుకు పోగొట్టుకొనవలెను! ఒక్క క్షణ మాలోచించెను.

"ఈ సాయంత్రము రాజకుమారుల దర్శనమునకు వచ్చెద నని రాజమార్తాండ ప్రభువులతో నివేదింపుము" అని శ్రేష్ఠి తల యెత్తక పత్రము వంక జూచుచునే సేవకునితో చెప్పెను. తన ప్రభువుకోరికకు ఎదురుమాట వచ్చుట ఎరుగనివాడైనందున నా సేవకుడు శ్రేష్ఠి సాహసమున కాశ్చర్యపడుచు వెడలిపోయెను.

వెంటనే గురునాథుడు శకటము సిద్ధము చేయించికొనెను. రాజానుగ్రహదత్తమగు ఛత్రచామరములు పట్టించుకొని శిబితో దానిపైనధిరోహించి బయలుదేరెను. అతడు మిత్రులగు శ్రేష్ఠులను దర్శించి యెన్నియో వ్యవహారములు వారితో ముచ్చటించెను. సందర్భవశమున తెచ్చిన ప్రసంగమువలన కుమారసప్తకము చైత్రమాసాదిగా ననేక లక్షల గద్యాణములు ఋణము చేసినట్లు అతడు తెలిసికొనెను. వారు చేసినఋణ మిప్పలొక్కరివద్ద కాదు. వారిలో కొందరు ఆ రాజపుత్రులకు ఋణమిచ్చినందుకు సగర్వులైయుండి చెప్పికొనిరి. ఒకరి సంగతి మరి యొకరికి దెలియదు.

గురునాథశ్రేష్ఠికి ఒక్కసారిగా ఆశ్చర్యము తోచెను. అరువదివేల గద్యాణములు పోవుటయ కనికికొరత గాదు. కాని యింత ఋణము వా రెందుకు చేయుచున్నారు? వారి కేదేని దురుద్దేశమున్న, దానికి సహాయభూతుడైన తనకు మాత్రము ప్రమాదము కాదా?

ఇప్పుడేమి చేయవలెను? ఇతరవర్తకులచేత ఋణము లడిగింపజేయుదునా? నేను పెట్టిన ఋణము తిరిగి యిమ్మని యడుగుదునా? రహస్యముగా ప్రభువుల కిది నివేదింతునా? బలవంతులతో, విరోధము పనికిరాదు. ఈ సందర్భమున అల్లరి చేసికొన కమానము వహించుటే కార్యము. ఏది యెట్లున్నను ఇకపై నాతడు కుమారసప్తకమునకు ఋణమీయ గూడదని నిశ్చయించెను. ఇతర వాణిజులును కాముని వ్యవహారము తేలనిది క్రొత్త యప్పులు వారికీ యరు.

ఈవిధముగా తలపోయుచు గురునాథశ్రేష్ఠి మాటయిచ్చిన ప్రకారము ఆ సాయంత్రము రాజమార్తాండుని దర్శింప నేగెను. ద్వారపాలకులు దర్శనమున కిప్పుడు అనుజ్ఞ లేదని గురునాథ శ్రేష్ఠిని పంపివేసిరి.

౨౧

శ్రేష్ఠి కోపము

గురునాథశ్రేష్ఠికి సామాన్యముగా కోపము రాదు. వచ్చినను అది బయటికి వ్యక్తము కాదు.

రాజమార్తాండుడు రాజబంధువు, రాజమాన్యుడు. అయినను గురునాథశ్రేష్ఠి శ్రేష్ఠులలో అగ్రగణ్యుడు, సమానులలో నుత్తముడు. రాజమార్తాండుడే అధమర్ణుడై తన్ను ఋణము యాచించినాడు. అట్టివానియొద్దకు దర్శనమునకు పోగా వీలుకల్గించలేదు. రాజమార్తాండుని దర్శింపవలసిన అవసర మేమియు గురునాథ శ్రేష్ఠికి లేదు.

శ్రేష్ఠి ఇంటికి వచ్చిన వెంటనే కుమారసప్తకమున కున్న గ్రామముల విలువయంతయు లెక్క కట్టెను. ఎంతహీనముగా లెక్క వేసినను అవి పది లక్షలు గద్యాణముల విలువ కలవి. అది చూచుకొని వెంటనే మిత్రులగు వర్తకులను గలసికొని, కుమారసప్తకము చేసిన ఋణములు ఐదు లక్షల గద్యాణములు కొనివేసి పత్రము లన్నియు తీసికొని పదిలపరచెను.

ఆ మరునా డుదయముననే శీఘ్రముగా కరణములను బిలిపించి, కుమారసప్తకము ఋణపత్రములిచ్చి, ఎవరిలెక్క వారిది వేరువేరుగా తేల్పించి, రావలసిన మొత్తములు ఆ సాయంత్రము మూడు జాముల లోపుగా చెల్లింపవలసిన దని కోరుచు పత్రములు వ్రాయించి రాజకుమారులకు పంపెను. వా రేడ్వురవల్ల రావలసిన మొత్తము ఐదులక్షల యరువదివేల గద్యాణముల మూలధనమును, అందుపై కాలికవృద్ధి నాలుగువేల నాలుగు వందలు గద్యాణములును అయ్యెను. మల్లప్ప యింకను సంఘారామములో చికిత్స నొందుచున్నందున అతనికి సంఘారామమునకును, మిగిలిన యార్వరకు వారి మందిరములకును పత్రములు పోయెను.

చికిత్సాలయములో నున్న మల్లప్ప పత్రము వెంటనే పుచ్చుకొనెను. కాని మిగిలిన యార్గురను గురునాథుడు పంపిన క్షమాపణ పత్రములని తలచి వార్తాహరులకు దర్శన మీయలేదు. వార్తాహరు లామాట గురునాథ శ్రేష్ఠికి నివేదించిరి. అతడు వెంటనే వారిని మరల పంపుచు, నీమారు దర్శన మీయనిచో వారి ద్వారబంధములకు పత్రములు కట్టి రండని యాజ్ఞాపించెను. వార్తాహరులు గజగజ లాడుచు బయలుదేరిరి.

ఈ వ్యవధానములో మల్లప్ప పత్ర మందుకొని వెంటనే సోదరుల కావార్త నంపెను. అది తెలిసికొని రాజపుత్రు లందరు తెల్లవోయిరి.

శ్రేష్ఠి వార్తాహరులు భయపడుచు రాజపుత్రుల మందిరద్వారములు సమీపించిరి. కాని వారీమారు ద్వారముల నిల్పినాడే వ్యవధిగా లోపలనుండి రమ్మని యనుజ్ఞలు వచ్చెను. రాజపుత్రులు ఆదరముతో నా పత్రములు పుచ్చుకొని ముట్టినట్లు పత్రములు వ్రాయించి యిచ్చి పంపివేసిరి. వారి కన్నులు వారు నమ్మలేక పోయిరి.

వార్తాహరులను పంపివేసిన ఉత్తరక్షణముననే రాజపుత్రు లార్గురును రాజమార్తాండుని భవనమున సమావిష్టులై క్రిందటి దినము జరిగిన దంతయు తెలిసికొనిరి.

ఇప్పుడు వారేమి చేయవలెను?

ఇంత స్వల్ప వ్యవధానములో నింత ధనము పుట్టుటెట్లు! మల్లప్పకును తన పరిచితులైన విదేశవర్తకులు వారి సరకు లిచ్చుట నమ్మి ధన మొదుచుకొని పోవు నంతవరకే కాని తనపై వేరభిమానమున్న వారు కారు. ఆపైని వారిప్పటికే యట్టి వారివద్ద తీసికొన్న వస్తువులకు చాల ధనము ఈయవలసియున్నారు. మరికొంత ఋణము తెచ్చినగాని వారి బాధ తీరదు.

గురునాథునికి ప్రతిస్పర్ధికదా సిరివిసెట్టి! అతని నడిగిన నీయడా? అతడు పూర్వమిత్రుడు కాడు. ఇంత యవ్యవధానముగా నడిగిన నతడు అనుమానింపడా? సంగతి సందర్భము లాలోచించుకొనుటకు కాలయాపనము చేయును. లాభము లేకపోగా నవతపముగా తమ ఋణము వెల్లడియౌను.

వెంటనే ఋణము తీర్పనిచో గురునాథశ్రేష్ఠి అధికరణస్థానమునకు వెంటనే మనల రప్పించును. మన కంతకంటె నవమాన ముండబోదు. అవమానమే కాదు. ఇంత ఋణ మెందుకు చేసిరా యని ప్రశ్నలు పుట్టును. అందుపై నపనిందలు పెరుగును. అది కాక కామరాజపుత్రునిపై రాజసభలో తీవ్రనింద విచారణ యగుచున్నది. శ్రేష్ఠిని మంచి చేసికొనుటయే బుద్ధి!

అంతట గురునాథశ్రేష్ఠిని ఒకమారు వచ్చి పోవలసిన దని గౌరవముగా సేవకునిచే వార్త నంపిరి. దానికి గురునాథశ్రేష్ఠి ద్విగుణీకృత గౌరవముతో తాను కార్యాంతరవ్యగ్రుడై రాజాలనందుకు చింత తెల్పుచు క్షమింపు డని వేడుచు ప్రత్యుత్తర మంపెను.

రాజకుమారులు మండిపడిపోయిరి. కాము రాజకుమారుడు స్వయముగా పోయి యా శ్రేష్ఠిని పొడిచివేసి వచ్చెదనని త్రాచుపామువలె లేచెను. రాజమార్తాండుడు అతని నాపి, యింతయంతటికి కారకుడు తానైనందున శ్రేష్ఠిని వరకివేయు గౌరవము తనకే కావలెనని వాదించి ఖడ్గము నొరనుండి తీసెను. కాని తక్కివ నలుగురు సోదరులు వారి నుభయులను శాంతపరచిరి.

ప్రతాపము చూపవలసిన సమయ మింకను రాలేదు. ఈ శ్రేష్ఠిమీది కోపముతో తొందరపడి చేయరాని సాహసకార్యము చేసినచో తల పెట్టిన ప్రయత్నము లన్నియు భగ్నమగును. ఈ యవినయమునకు గురునాథశ్రేష్ఠి యుత్తరవాదియగు సమయము రాగలదు. అంతవరకు నోర్పు వహింపవలెను.

అంతయ కాదు. గురునాథుడు ధనవంతుడు. అతని ద్రవ్యముతో నెంతయేని పని గలదు. అతని తాతలనాటినుండి మన పితామహులకు మైత్రి కలదు. కేవలము. పూర్వమైత్రి స్మరణవలన నతడు లొంగడు. కర్ణాటక ప్రభువులు మన పితామహుల కిచ్చిన వజ్రకంఠిక యమూల్యమైనది. అది శ్రేష్ఠివద్ద నుంచి ముందు కావలసినంత ధనము తీసికొందము. ఇట్టి ఉపాయముతో నీ కష్టసమయమున మరియొక బలవన్మిత్రుని సాధింపవచ్చును.

ఇట్లుపదేశించి రాజమార్తాండునే గురునాథునితో సంప్రదించుటకు బంపిరి.

౨౨

సంధి

రాజమార్తాండుడు వచ్చునని గురునాథశ్రేష్ఠి ముందుగనే యూహించెను. కనుక యతనిని గౌరవించుటకు తగిన రీతిగా నాసనాదులు సిద్ధము చేయించి యుంచెను.

రాజపుత్రుడు వచ్చుచున్నాడని తెలిసినంతనే శ్రేష్ఠి ఎదురుపోయి, వినయముతో నమస్కరించి ఆహ్వానించి యున్న తాసనమున గూర్చుండబెట్టి తాను నిలుచుండెను. రాజమార్తాండుడు కూర్చుండుమని కోరినంతవరకు అట్లే నమ్రతతో నతడు నిలువబడియే యుండెను.

(22-వ పేజీ చూడుడు)

నేటి ప్రపంచం


[భద్రతామండలి సభ్యత్వపు పోటీనుంచి భారతదేశం నిష్క్రమించడం, తత్ఫలితంగా యుక్రేన్‌కు స్థానం లభ్యం కావడం; అగ్రరాజ్యాల మధ్య ఈ విషయంలో రహస్య ఒప్పందాలు జరిగినవని శ్రీమతి విజయలక్ష్మి హెచ్చరిక చేయడం; స్పెయినుతో ఆర్జంటైనా రాజకీయ సంబంధాలు తెగతెంపులు చేసుకోకుండా సమితి నిర్ణయాన్ని ధిక్కరిస్తున్నందుకు అధిక్షేపణ తెలుపడం; ఉపసమితిస్థాపనను ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంకూడా ఆమోదించడం; బడ్జెట్ రహస్యాలను బయటపెట్టిన కారణంగా బ్రిటిష్ ఖజానా శాఖా మంత్రి హ్యూ డాల్టన్ పదచ్యుతుడై, సర్ స్టాఫర్డ్ క్రిప్స్ ఆశాఖపైకూడా ఆధ్వర్యం వహించడం; సయాంలో ఫేసిస్టు సేనాని ఆధ్వర్యాన సైనిక విప్లవం జరిగి ప్రజా పక్ష ప్రభుత్వం పతనం కావడం; ఇవీ ఈ వారం జరిగిన ప్రముఖ అంతర్జాతీయ రాజకీయ సంఘటనలు]

ప్రపంచ భద్రతా మండలిలో సభ్యత్వంకోసం భారత దేశానికీ, సోవియెట్ రష్యాలో ఒక స్వతంత్ర రాష్ట్రమైన యుక్రేన్‌కూ మధ్య ఏర్పడిన పోటీ చిట్టచివరకు పరిష్కారమైంది. ఐతే ఇది ధర్మసమ్మతంగా గాని, న్యాయబద్ధంగా గాని, పరిష్కారం కాలేదు. ఈ పోటీలో మొత్తం పదకొండు సార్లు ఎన్నిక జరిగినప్పటికీ ఇటు భారత దేశానికి గాని, అటు యుక్రేన్‌కు గాని, రావలసిన వోట్లురాక తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడుతూ వచ్చింది. భద్రతా మండలి స్థానాల కోసం అగ్రరాజ్యాలు అనుసరిస్తున్న లాలూచీ వ్యవహారాలను, లోపాయికారీ ఏర్పాట్లను, గూడుపుఠానీని తీవ్రంగా గర్హిస్తూ భారతదేశం ఈ పోటీనుంచి విరమించు కొంటున్నదని శ్రీమతి విజయలక్ష్మి ప్రకటించింది. భారతదేశ విరమణ ఫలితంగా యుక్రేన్‌కు స్థానం లభ్యమైంది. భద్రతామండలిలో సోవియెట్ రష్యాకు ఇది వరకే ఒక శాశ్వత స్థానం వున్నది. అదిగాక యుక్రేన్ సభ్యత్వంద్వారా మరొక స్థానం కూడా చేకూరింది.


* * *

"భద్రతా మండలిలో చర్చకు వచ్చే దాదాపు ప్రతి అంశానికీ హిందూ మహాసముద్ర ప్రాంత పరిస్థితులతోనూ, పరిణామాలతోనూ ప్రత్యక్ష సంబంధం వుంటుంది. అందువల్ల ఆగ్నేయ ఆసియాఖండ రాజ్యాల ప్రజలకు భద్రతా మండలిలో ప్రాతినిధ్యం లేకపోవటం అక్రమం. ముఖ్యంగా భద్రతా మండలిలో వలస రాజ్యాధిపత్యం వహిస్తున్న దేశాలకు ప్రాతినిధ్యం ఇచ్చి, ఆయా వలసరాజ్యప్రజలకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడంవల్ల ఇది మరీ అక్రమ మనిపించు కొంటుంది." అని శ్రీమతి విజయలక్ష్మి భారతదేశ ఉపసంహరణ నిర్ణయాన్ని ప్రకటిస్తూ హెచ్చరిక చేసింది.

ద్వితీయ ప్రపంచసంగ్రామానంతరం ఆసియా ఖండంలో విజృంభించిన జాతీయశక్తులను, స్వాతంత్ర్య కాంక్షను దృష్టిలో పెట్టుకొనే శ్రీమతి విజయలక్ష్మి ఈ హెచ్చరిక చేసింది. ఫ్రెంచి, డచ్చి సామ్రాజ్యవాదులను నేటికీ సాహసోపేతంగా ప్రతిఘటించి స్వాతంత్ర్య సమరం సాగిస్తున్న ఇండోచైనా, ఇండోనీసియా దేశాల సమస్యలే ఇందుకు ప్రబల నిదర్శనాలు. ఈ దేశాలపై పాశ్చాత్యుల వలసరాజ్యాధిపత్యం అంతమై సంపూర్ణ స్వాతంత్ర్య స్థాపన జరిగేవరకూ ఆసియాఖండానికిగాని, ప్రపంచానికిగాని శాంతి, భద్రతలు చేకూరడం కల్ల. అశాంతి, పారతంత్ర్యం ఏ ఒక ప్రాంతాన్ని



ఫ్రాంకో



డాల్టన్

బాధించినా, దాని ఫలితం సమస్తప్రపంచమూ అనుభవించవలసిన ప్రమాదం ఏర్పడుతుంది. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ప్రపంచ పురోభివృద్ధికే ఆ అశాంతి, పారతంత్ర్యం పెద్ద ప్రతిబంధకంగా పరిణమించేమాట వాస్తవం.

* * *

ప్రపంచంలో ఏ భూభాగమైతే ఇప్పటి వరకూ పాశ్చాత్య సామ్రాజ్యవాదులకు క్రీడారంగంగా వుండి, నేడు జాతీయ అభ్యున్నతిని, ప్రపంచశాంతిని కాంక్షిస్తున్నదో, ఆ ఆగ్నేయ ఆసియారాజ్యాలకే భద్రతామండలిలో స్థానం లేకుండా పోయింది. భద్రతామండలి స్థానాల పంపిణీ విషయంలో అగ్రరాజ్యాలమధ్య ఏదో లాలూచీ వ్యవహారం జరిగిందనీ, ఈ లాలూచీ ఒప్పందాలను ఐక్యరాజ్యసమితి బహిరంగ సమావేశంలో చర్చించడం అవసర మనీకూడా విజయలక్ష్మి హెచ్చరిక చేసింది. ఈ లోపాయికారీ పరిస్థితులలో యుక్రేన్‌తో పోటీచేసి, అంతులేని ప్రతిష్టంభనను తెచ్చిపెట్టి, సమితి కార్యక్రమంలో అనవసరంగా ఆలస్యాన్ని కలిగించటం భారత దేశానికి ఇష్టంలేదని కూడా ఆమె స్పష్టపరిచింది. ఏది ఏమైనప్పటికీ, ఈ పోటీలో అన్యాయానికీ, అధర్మానికీ విజయం చేకూరడం, న్యాయబద్ధమైన భారతదేశవాదన విఫలం కావడం జరిగింది. ఐక్యరాజ్య సమితి క్షేమాన్ని కోరి అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకొన్న భారతదేశం తన త్యాగబుద్ధినీ, ధర్మ నిరతినీ ప్రదర్శించిందనే చెప్పాలి. భారతదేశ ఉపసంహరణ జరిగినా, ప్రపంచ శాంతి క్షేమాలకోసం ఏర్పడిన ఒక ప్రముఖ అంతర్జాతీయ సంస్థలో అగ్రరాజ్యాల అధికార ప్రాబల్యంకోసం ప్రాకులాడడం, గూడుపుఠానీ జరపడం అతి శోచనీయమైన విషయం. ఈ దుర్బుద్ధి పోనంతవరకూ సమితి నిర్జీవమైన, నిరుపయోగమైన సంస్థగానే వుండి పోతుంది.

* * *

ఐక్యరాజ్య సమితి జననకాలవిశేష మేమిటోగాని, అది ఏ ప్రధాన నిర్ణయాన్ని చేసినా ఏదో ఒకదేశం ఆ నిర్ణయాన్ని ధిక్కరించడమే ఇప్పటివరకూ సంభవిస్తున్నది. గత సంవత్సరం శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశంలో దక్షిణాఫ్రికా భారతీయ సమస్యపై చేసిన నిర్ణయాన్ని మార్షల్ స్మట్స్ ప్రభుత్వం ఏ విధంగా తృణీకరించి ధిక్కరిస్తున్నదో, అదే సమావేశంలో ఫేసిస్టు స్పెయిన్ విషయమై చేసిన నిర్ణయాన్ని దక్షిణఅమెరికాదేశమైన ఆర్జంటైనాకూడా అదే విధంగా తృణీకరించి ధిక్కరించడం జరుగుతున్నది. ఐక్యరాజ్యసమితి రాజకీయసంఘంలో



క్రిప్సు

మొన్న శ్రీమతి విజయలక్ష్మి స్పెయిన్ ప్రసక్తి తెచ్చి, ఆర్జంటైనా వైఖరిని తీవ్రంగా ఖండించింది. గత సంవత్సరం శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశంలో సమితిలో సభ్యత్వంవున్న ప్రతి దేశమూ స్పెయినుతో రాజకీయ సంబంధాలను తెగతెంపులు చేసుకొని, తమతమ రాయబారులను స్వదేశాలకు పిలిపించివేయాలనే తీర్మానం జరిగింది. అన్నిరాజ్యాలు ఈ నిర్ణయాన్ని శిరసావహించినవిగాని, ఆర్జంటైనామాత్రం తృణీకరించింది. ఇప్పటివరకూ తన రాయబారినే స్పెయిన్ నుంచి పిలిపించలేదు. ఆర్జంటైనా ఈ వైఖరిని అవలంబిస్తున్నందుకు ఆశ్చర్యపడవలసిన అగత్యం లేదు. ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో కూడా ఈ దేశం ఫేసిస్టు అనుకూల విధానాన్నే అనుసరించింది. అనేకమంది నాజీలకు, ఫేసిస్టులకు యుద్ధ సమయంలో ఆశ్రయ ఇచ్చింది. ఐక్యరాజ్య సమితి నిర్ణయాన్ని ధిక్కరిస్తున్న ఆర్జంటైనాకు భద్రతా మండలిలో స్థానం లభ్యంకావడం, భారత దేశానికి లభ్యం కాకపోవడం ఆశ్చర్య పడవలసిన విషయం.

* * *

1936-38 సంవత్సరాలలో రిపబ్లికన్ ప్రభుత్వంపైవిద్రోహం పన్ని తిరుగుబాటు జరిపివిజయం సాధించిన జనరల్ ఫ్రాంకో దాదాపుఈ పది సంవత్సరాల నుంచీ నిరంకుశ ఫేసిస్టు పరిపాలన సాగిస్తున్నారు. అతడు ప్రజాభీష్టాన్ని పాటించి తదనుగుణమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, పౌర హక్కులను గౌరవించే వరకూ స్పెయినుతో ఏ విధమైన రాజకీయ రాయబార సంబంధాలూపనికి రావని సమితి ప్రణాళికలోని 41 వ నిబంధన ప్రకారం సమితి స్పెయిన్‌పై ఆర్థిక ఆంక్షలను ప్రయోగించడం అవసరమనికూడా ఆ తీర్మానంలో పొందుపరిచారు. మొన్న జరిగిన ప్రపంచ సంగ్రామంలో రష్యాపైకి సైనిక దళాలను పంపికూడా స్పెయిన్ జర్మనీకి సహాయ పడ్డది. ఈ విధంగా నిరంకుశ పాలన సాగిస్తున్న జనరల్ ఫ్రాంకోపై ఆర్థిక ఆంక్షలను కూడా సమితి అమలు జరపాలని పోలిష్ ప్రతినిధి మొన్న సమితి రాజకీయ సంఘంలో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు.

* * *

మొన్నటి ప్రపంచ యుద్ధం ఫలితంగా ప్రపంచంలోని అనేక అస్వతంత్ర దేశాలలో జాతీయ ప్రజాస్వామ్యశక్తులు విజృంభించినవి కదా, స్పానిష్ ప్రజలు జనరల్ ఫ్రాంకోపై ఇప్పటివరకూ ఎందుకు తిరుగుబాటు సాగించకుండా వున్నారనే ప్రశ్న రావడం సహజం. ప్రజాస్వామ్యప్రియులైన స్పానిష్ ప్రజల్లో స్వాతంత్ర్యాగ్ని చల్లార లేదనే ఈ ప్రశ్నకు సమాధానం చెప్పవచ్చు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ సమీపంలో రిపబ్లికన్ రహస్యదళాలు గెరిల్లా పోరాటం ప్రారంభించినట్లూ, ఈ ప్రతిఘటనే రిపబ్లికన్ల తిరుగుబాటుగా పరిగణించి అవసర సహాయం చేయవలసిందని ఐక్యరాజ్య సమితికి విజ్ఞప్తి వెళ్లినట్లు ఈ మాసారంభంలోనే ఒక వార్త వచ్చింది. ఇప్పటికి పదేళ్ల పరిపాలనలో తగిన కట్టుదిట్టం చేసుకున్న జనరల్ ఫ్రాంకో ఈపాటి ప్రతిఘటనకే వదిలిపోతాడా అన్నది వేరే ప్రశ్న. మొత్తంమీద స్పెయినులో ఫేసిస్టు ఫ్రాంకో పాలనపై ప్రతిఘటన ప్రారంభమైందన్నమాట.


* * *

జనరల్ ఫ్రాన్సిస్కో ఫ్రాంకోకు ఈనాడు స్పెయినులో ఏపాటి పలుకుబడి, అండ, ప్రాబల్యం వున్నవో తెలుసుకోవడం అవసరం. మతాధిపతులు, పెట్టుబడి దారులు, సైన్యం ఈ మూడు వర్గాలవారు ఫ్రాంకోను బలపరుస్తున్నట్లు ప్రస్తుతపు స్పెయిన్ దేశపు స్థితిగతులను బట్టి వ్యక్తమవుతున్నది. ఈ మూడింటిలో ముఖ్యమైన అండ సైన్యానిదేనని ఫ్రాంకో అనుకూలవాదులు, ప్రతికూలవాదులుకూడా ఒప్పుకుంటున్నారు.

సైనిక నాయకత్వంలో జనరల్ ఫ్రాంకో ఆరితేరినవాడని ప్రతీతి. 1936 లో రిపబ్లికన్ ప్రభుత్వంపై అంతర్యుద్ధం ప్రారంభించినప్పుడు జనరల్ ఫ్రాంకో ప్రత్యేక సేవనలిస్టు పటాలాలను స్వయంగా ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం సైనిక శాఖలో ప్రధానమైన కీలకమైన ఉద్యోగాలన్నిటినీ ఆ సేవనలిస్టు పటాలాల్లో తనకు నమ్మిన బంట్లుగా పనిచేసినవారిలో నింపివేశాడు. తన పరిపాలన పట్ల విముఖతను కనబరిచినవారందరినీ అప్రధానమైన ఉద్యోగాలలో పడవేశాడు. సంపూర్ణ విశ్వాసపాత్రులనదగినవారికే ముఖ్యమైన ఉద్యోగాలు ఇచ్చుకున్నాడు. ద్వితీయప్రపంచ సంగ్రామంలో ప్రాచ్యరంగానికి వెళ్లి, సోవియెట్‌రష్యాతో పోరాడిన "స్పానిష్ బ్లూ దళాధిపతి మునాజ్ గ్రాండిస్ అనే అతను ప్రస్తుతం మాడ్రిడ్ సైనిక మండలానికి ప్రధాన సేనానిగా పనిచేస్తున్నట్లు వార్తలు వస్తున్నవి. ఇతడు ఫ్రాంకోకు ముఖ్యుడు; నమ్మిన బంటు. రాజధాన్ని వదలి జనరల్ ఫ్రాంకో దేశంలో ఏ యితర ప్రాంతానికైనా వెళ్ళగలుగుతున్నాడంటే, ఈ సేనానిమీద వున్న విశ్వాసంవల్లనే.

ప్రస్తుతం స్పెయిన్‌కు ఎంత సైనిక సంపద వున్నదీ ఇదమిత్థమని తెలియదు. దాదాపు 5 లక్షల సేన అయినా వుంటుందని కొందరి అంచనా. పైగా దేశంలో నిర్బంధ సైనికసేవ అమలులోవున్నది. సాయుధబలాలేగాక, సివిల్ గార్డులు, రహస్య పోలీసు దళాలవారూకూడా ఎక్కువగానే వున్నారు. సాలీనా అయే వ్యయంలో సగభాగం సైన్యంకిందనే వినియోగమవుతున్నదట. సాధారణంగా మతమన్నా, మత ప్రచారమన్నా ఏవగింపు చూపిన 'రిపబ్లికన్లు తొలగిపోయినందుకు సంతోషంతో మత పీఠాధిపతులుకూడా జనరల్ ఫ్రాంకోను బలపరుస్తున్నట్లు తెలుస్తున్నది, ఇంతగా పాతు

(17-వ పేజీ చూడుడు)



విజయలక్ష్మి

ఆంధ్రదేశమున వేదప్రచారము

శ్రీ పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి

1

ఆంధ్ర శబ్దము తొలుత జాతి వాచకము. పిమ్మట దేశవాచకము. తరువాత భాషావాచకముగా రూపొందెను.

జాతివాచకముగా నుండినపుడు ఆంధ్రులు అనువారు 'పుష్కరతీర్థ' ప్రాంత దేశమున (ఇది 'అజ్మీరు' పట్టణ ప్రాంత ప్రదేశము) విశ్వామిత్ర శాప హతులై వెళ్లగొట్టబడిరి. అందు అపస్తంబులు 'యమునా' తీరమునందలి 'సాల్వ' దేశమునందు 1 యౌగంధరి, మహారాజు చే పాలింపబడుచుండిరి. కాలాంతరమున నా యాంధ్రులు 'ఆర్యావర్తము' నుండి యన్యుల చే త్రోసివేయబడి దక్షిణాపథమునకు తరలిరి. 'ప్రతిష్ఠానపుర' రాజ్యమును క్రీ. పూ. 4 వ శతాబ్ద ప్రాంతమున స్థాపించి 'ఆంధ్ర శాతకర్ణులు' అని పేరొందిరి. శాతకర్ణులు రాజ్య పాలకులగు బ్రాహ్మణులు. సౌరాష్ట్రాది దేశముల నేలిన 'నహపాన' నాదులను, 'ఉజ్జయిని' రాజధానిగా 'మాళ్వాది' దేశముల నేలిన 'చస్తనుని' వంశజులను శాతకర్ణులవలె బ్రాహ్మణరాజులే. ఈ బ్రాహ్మణులు రాజ్యమేలు 'హస్తిపురి' గంగా ప్రవేశము కాగా (జనమేజయునికి నాలవ తరమువ) రాజ్యభ్రష్టుడగు 'నిచక్షుని' (శ్వేతకర్ణుడని హరివంశము) అతని పుత్రుడగు 'అజపార్శ్వుని' 'కౌశిక, పైప్పలాద, శైల్వ' నామకులగు ఋషులు 'కౌశాంబి' నగరమునకు దెచ్చి వానిని రాజుజేసి తాము 'మంత్రులు' మాండలిక ప్రభువులు నైరని హరివంశమున గలదు. వారి సంతతివారే వృద్ధి నొంది బహు రాజ్యముల స్థాపించిరని ఆ పురాణమె చెప్పుచున్నది. ఈ బ్రాహ్మణ రాజులను అసహ్యించుకొనుచు 'విష్ణు, భాగవతాది' పురాణకర్తలు కలియుగమున 'వ్రాత్య బ్రాహ్మణులు' సౌరాష్ట్రాది దేశముల నేలుదురని ఈర్ష్యతో వ్రాసిరి.

ఈ వ్రాత్య బ్రాహ్మణు లనబడు వారిలోని వారే 'ఆంధ్ర శాతకర్ణులు.' వీరు 'చైత్య' (యజ్ఞ వేదిక) చిహ్నముగల పతాకమును ధరించిరి. నాణెములలో 'చైత్య' చిహ్నమును వేయించిరి చైత్య చిహ్నము 'బౌద్ధమత చిహ్న' మని పెక్కండ్రు భ్రమ నొందుచున్నారు కాని, 'అపస్తంబ, అశ్వలాయనాదుల, శ్రౌత సూత్రముల జదివిన నట్లు తలంపరు. 'నహపాన చస్తన, శాతకర్ణ' శాఖలవారి పూర్వులు పశ్చిమ దిశనుండి 'డేరయస్' మొదలగు పాశ్చాత్యుల యొత్తిడికి

తాళలేకయు, తూర్పున 'కోసల, మగధాది' దేశీయుల బలములను జయింప లేకయు, క్రీ. పూ. 6-2 శతాబ్దముల నడిమి కాలమున దక్షిణాపథ రాజ్యములను స్థాపించినట్లు కాన్పించుచున్నది.

శాతకర్ణులు గోదావరీ తీరమున ప్రతిష్ఠానపుర రాజ్యమును స్థాపించునాటికి నేడు ఆంధ్రదేశము అని చెప్పబడు ప్రదేశము 5 విభాగములుగా 'అనార్యులు' లేక దేవయోనులు 2 అనబడు జాతులవారి యధీనమున నుండెను.

అవి—కళింగము, వేంగి, తెలుంగు, ములక, చోడ అనబడు పేరులు కలవి. అనార్యుల యొక్క మతములు మొదట నెట్టివైనను 'ఖారవేలుడు' అను కళింగదేశ ప్రభువు యొక్క రాజ్య కాలమున 'జైన' మతము ఉత్తరాంధ్రమున ప్రవేశించి అత్యభివృద్ధి నొందినది. ఇంచుమించుగా ఆ కాలముననే బౌద్ధ మతము మధ్యాంధ్రమున (కృష్ణానదీ తీరమున) 'కబ్బెరలు' అనబడు కుబేర యక్షజాతి ప్రభువుల పాలనమున ప్రవేశించి వృద్ధినొందినది.

'నిషాదస్థపతులు' 3 అను పై రాజన్యుల కాలమున వేద మెట్లీ యాంధ్రభూమిలో బ్రవేశించును? నేటి ఆఫ్రికాలోని నీగ్రో జాతుల వారిలో క్రైస్తవ, మహమ్మదీయ మతము లభివృద్ధి నొందినటులు 'జైన, బౌద్ధ' మతము లీ నిషాదులలో ప్రవేశించి యభివృద్ధి నొందినవి.

ఇట్లుండ శాతకర్ణుల ప్రభుత్వము పశ్చిమాంధ్రమున 'గౌతమీపుత్ర శాతకర్ణి' కాలమందత్యంతము సౌరాష్ట్రాది పశ్చిమ భరత ఖండముననే గాక ప్రాక్సముద్ర తీరమునందు మహేంద్రగిరి మొదలు నల్లమలల (కృష్ణగిరి) వఱకును దక్షిణమునను వ్యాపించినది. అప్పుడే మన దేశమునకు ఆంధ్రదేశము అను పేరువచ్చినట్లు కాన్పించును. ఆ గౌతమీపుత్రుడే ఆర్యావర్తము నుండి ఆంధ్రదేశమునకు వచ్చిన బ్రాహ్మణులు సాంకర్యము నొందని నిబంధనముల నేర్పరచి యున్నాడు 4 ఆర్యావర్తము నుండి శాతకర్ణుల రాజ్యమున 'ప్రవేశించిన బ్రాహ్మణులు తైత్తిరీయశాఖకు (యజుర్వేద శాఖకు) చెందినవారుగను 'ఉజ్జయనీ' ప్రాంతమునకు 'కఠ' శాఖీయులును, సౌరాష్ట్ర మహారాష్ట్ర దేశములకు 'కాలాప' (మైత్రాయణీయ) శాఖీయులును అగు బ్రాహ్మణులు చేరినట్లు 'చరణవ్యూహము', 'చరణవ్యూహపరిశిష్టము' అను గ్రంథముల వలన తెలియనగు చున్నది. మరియు సామవేదశాఖలలో ఆంధ్ర దేశమునందు 'కౌథుమ' శాఖయు, మహారాష్ట్రము నందు 'రాణాయన శాఖయు' కర్ణాటకమున 'జైమినీ' శాఖయు బ్రాహ్మణములతో వ్యాపించిన వని పై చరణవ్యూహము, చరణవ్యూహ పరిశిష్టములే స్పష్టపరచుచున్నవి. అథర్వవేద శాఖలలో 'శౌనిశాఖ' కాశ్మీరాది దేశములలోను, దక్షిణాపథమునను సమానముగానే వ్యాపించినద్ది గాని, పైప్పలాదశాఖ అపస్తంబ మహర్షిచే గౌరవింపబడినట్లును, ఆంధ్రదేశమున ప్రాచీన కాలముననే బ్రవేశించి వ్యాపించినట్లును, అపస్తంబుడు తన ధర్మసూత్రములలో 'వ్రాత్యపూజా' సందర్భమున శౌనక శాఖలోని విపులమగు వ్రాత్యసూక్త సమితిని గ్రహింపక క్లుప్తముగానున్న పైప్పలాద శాఖలోని వ్రాత్యపూజా విధానమునే గ్రహించుట చేతను ఆంధ్ర దేశమునగు బ్రాహ్మణులు నేటికిని చేయు 'బ్రహ్మయజ్ఞము' నందు నాలుగు వేదముల ప్రారంభ మంత్రములు చెప్పుటలో 5 అథర్వ వేదాది మంత్రముగా పైప్పలాద శాఖకు ఆది మంత్రమును చెప్పుటయు, ఆంధ్రులకు, అథర్వశాఖ 'పైప్పలాద' శాఖయే యని స్పష్టమగుచున్నది. పైప్పలాదుడు గోదావరీ తీరముననే వెలిగెనని బ్రహ్మ పురాణమున నొక కథ కలదు.

ఈ అథర్వ శాఖీయులు (అథర్వ చరణులు) క్రీ. శ. 10 వ శతాబ్ది వఱకు ఆంధ్ర దేశమున నుండినట్లు కొన్ని 'తామ్ర శాసనము' లలో-దానప్రతిగ్రహీతల పట్టికలవల్ల తెలియ నగుచున్నది. ఎందులకై వేదములు—అందు కృష్ణ యజుర్వేదము—(తైత్తిరీయశాఖ) అవసరమో. అట్టి యజ్ఞ కర్మములును మన యాంధ్ర దేశమున శాతకర్ణుల కాలముననే, ఆ మహారాజుల చేతనే ప్రవేశ పెట్టబడెను. ఆంధ్ర శాతకర్ణులలో 'యజ్ఞశ్రీ శాతకర్ణి' 'వేదశ్రీశాతకర్ణి' 'అను వారు నిత్యాగ్నిహోత్రులు, వేద పాఠకులుగాను నుండిరని వారి శాసన, నామముల వల్లనే స్పష్టముగా తెలియనగుచున్నది. ఇట్లని వారు తత్పూర్వము దేశము దేశమున వ్యాప్తమై జనసామాన్యము యొక్క పారమార్థిక తృష్ణ్తి కనుకూలమగు 'జైన, బౌద్ధ మతములను' నిరసింపక దానికిని దోహదము నొసంగి స్తూపాది నిర్మాణములకుం దోడ్పడిరి. తమ వైదిక మతమును బ్రహ్మ, క్షత్రియ జాతులలో వృద్ధియగునట్లు చేసిరి. సర్వమత సామరస్య మన్న నిట్టిదే కదా!

జగత్ప్రసిద్ధిగన్న 'నాగార్జునుడు' గౌతమీపుత్ర శాతకర్ణి కాలపువాడే నని లోకప్రథకలదు. బ్రాహ్మణ్యము సాంకర్య మొందకుండ శాసనములోనర్చిన గౌతమీపుత్రుడు లోకప్రసిద్ధిగన్న నాగార్జునుని బౌద్ధమత ప్రచారమునకు, అతని మహాస్తూపాది నిర్మాణమునకు దోడ్పడి, జనులు కొన్ని విధములను పన్నుల నీయ నవసరము లేదని శాసనము లొనర్చుట మహోత్కృష్టమనుట కంటె నాతని యసూయా పరిపాల నావిధానము యొక్క మహిమము నేమని పొగడవలెను? గౌతమీపుత్రుడు గోదావరి నదిని తన తల్లి పేరుతో గౌతమీ నదినిగా (నేటివారు బకింగ్హాం కెనాలు హేమిల్టన్ కెనాలు, హుస్సేన్ సాగరు, కృష్ణరాజ సాగరువలె) మార్చెనట 6 పై కారణములచే మన యాంధ్ర దేశమునందు ఆర్య మత చిహ్నములు— అందు వేద ప్రచారకులగు బ్రాహ్మణులు ప్రవేశించుట—వేదముల ప్రయోజనము యజ్ఞకర్మ లొనర్చబడుటకు ఆంధ్ర శాతకర్ణుల కాలముననే, ఇప్పటికి పదునెన్మిది శతాబ్దములకు బూర్వమే జరిగెను.

శాతకర్ణులనాడే గోదావరీ తీరమున వేద పాఠకులగు బ్రాహ్మణులు ప్రవేశించిరో ఆ గోదావరీ తీరమున ఇప్పటికిని వేద పాఠము సుస్థిరము, సుస్పష్టమును వైదికస్వరయుక్తముగా లోకప్రసిద్ధి నొందియే యున్నది. ఆంధ్ర శాతకర్ణులు రాజ్యచ్యుతి నొందిన పిమ్మటను, ఆంధ్రావని జాలించిన 'శాలంకాయననాడు' ప్రభువుల కాలమున వేదమాత ఈ దేశమున నెట్లు ప్రచార మయ్యెనో తెలియదు. కాని, శాలంకాయనులు, మహర్షి గోత్రనామములగుటచే వారును వేదమును వృద్ధి నొందించిరనియే చెప్పవలసి యున్నది. శాలంకాయనులకు పిమ్మట, పాగాంధ్రమును 'విష్ణుకుండినులును' పశ్చిమాంధ్రమును 'చాళుక్యులును' పాలించిరి. ఆ కాలమునందు ఉత్తర హిందూస్థానమున, కనోజ్ ప్రభువులు—అందు శ్రీహర్షుడు బౌద్ధమత ప్రధాన యజ్ఞముల జేయుచుండుటచేత, ఆతనికి పోటీగా వైదికమత ప్రచార మొనర్చుచున్నారా అనునట్లు చాళుక్యులు (పులకేశి) విష్ణుకుండినులు (మాధవ వర్మ) అశ్వమేధాది మహాయజ్ఞము లొనర్చుటచే బోధాయనాది మహర్షులచే అపవిత్ర దేశముగా దలపబడిన ద్రవిడావని మహాపవిత్రప్రదేశముగా జేయబడినది. అందు 'విష్ణుకుండిన మాధవ వర్మ' పదునొకండు అశ్వమేధ యాగములును, నరమేధమును చేసి యున్నాడనుటకంటె నాతని వైదిక మతోద్రేకము వేఱుగ జెప్పవలయునా 7 ? ఇంత మాత్రమే కాదు. విష్ణుకుండినులు, చాళుక్యులును, బ్రాహ్మణ విద్యార్థులవలె 'పవిత్రపాణులై' విప్ర విద్యార్థులతో గలసి 'తైత్తిరీయ వేదము' ను గురువులకడ జదువుచుండిరి. ఇందులకు విష్ణుకుండినుడగు మూడవ మాధవవర్మ "శివశర్మ" అను బ్రాహ్మణునితో తాను 'తైత్తిరీక సబ్రహ్మచారి' ననియు కుబ్జ విష్ణువర్ధనుని పుత్రుడను 'జయసింహ వల్లభుడు' రుద్రశర్మకు తాను 'తైత్తిరీక సబ్రహ్మచారి' ననియు 'పొలమూరు' తామ్రశాసనములలో వ్రాసికొనుటయే నిదర్శనము. (సబ్రహ్మచారి యనగా సహాధ్యాయుడై వేదము జదువుకొనుట.) రాజరాజ నరేంద్రుడు ఆంధ్ర భాషను పోషించినట్లే వేదవిద్యను గూడ పోషించెను. "బ్రహ్మరాజు" 8 బిరుదము గల 'అంకయ్య' అను గొప్ప వేద పండితునకు విశేష భూదాన మిచ్చినట్లు ఇటీవల 'భారతి'లో ప్రచురింపబడిన 'నందం' తామ్ర శాసనమువల్ల తెలియనగు చున్నది.

చాళుక్యులలో కుబ్జ విష్ణువర్ధనుని రెండవ పుత్రుడును, ఆరు మాసములు మాత్రమే రాజ్య మేలినవాడు నగు 'ఇంద్రవర్మ' 'వాజసనేయశాఖ' (శుక్ల యజుర్వేదము) చదివిన 'చండిశర్మ'కు బ్రహ్మదేయముగా (వేదవిద్యకై) 'ఇప్పత్రి' అను గ్రామమును. క్రీ. శ. 633 సం.రమున, దాన మిచ్చిన శ్లోక శాసనము కలదు. ఇంతకు పూర్వమీ యాంధ్రావనిలో శుక్ల యజుర్వేద వేత్త ప్రశంస కానరాదు.

(సశేషము)

1. అపస్తంబ మహర్షి యౌగంధరి కాలమున సాల్వదేశమునం దుండినట్లు ఏకాగ్ని కాండ మంత్ర పన్నముల వల్లను, నా కృతమగు నవకథామంజరివల్లను తెలియ గలదు.

2. (1) విద్యాధరులు (2) అచ్చరలు (3) జక్కులు (4) రక్కసులు (5) గోండులు (6) కబ్బెరలు (7) కిన్నరులు (8) పిశాచులు (9) తెలుంగులు (10) ఎరుకలు (11 మేదరలు మొదలగువారు.

3. నిషాదస్థపతి శబ్దమునకు మూడు విధములగు నర్థము లున్నవి. (1) నిషాదుడైన రాజు (2) నిషాదులకు రాజు (3) నిషాదుడు రాజుగాగల జనుడు—పైరెండే ఇచ్చట సరిపోవును.

4. గౌతమీపుత్ర శాతకర్ణి యొక్క 'నాసిక శాసనములలో పై యంశములు కలవు.


5. శిష్టులగు నాంధ్ర బ్రాహ్మణులు బ్రహ్మయజ్ఞము చేయునపుడు, ఋగ్వేదాదియగు 'అగ్నిమీళే పురోహితం' అనియు, యజుర్వేదాదియగు 'ఇషే త్వోర్జే త్వా' అను మంత్రమును, సామవేదాదిగల 'అగ్న ఆయాహి వీతయే' అను దానిని గ్రహించి, 'శంనోదేవీ' అను పైప్పలాద శాఖా మంత్రమును గ్రహింతురు.

6. వాల్మీకి రామాయణము నందు గోదావరి నదిని గౌతమి యని చెప్పినట్లు కాన్పింపదు.

7. మాధవ వర్మ పౌత్రుని చిక్కుల్ల శాసనము వల్ల పై యంశము తెలియగలదు.

8. బ్రహ్మరాజు అనగా వేద పాండిత్యము గల రాజు. ఇది కవిరాజు బిరుదము వంటిది.

భారత రాజకీయాలు



కృపలానీ

భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించిన తరువాత రాజకీయరంగంలో త్వరత్వరగా, అనుకోని మార్పులు సంభవిస్తున్నవి. పొరుగు రాజ్యమగు పాకిస్థాన్ కృత్యములవలన గలుగుచున్న యిబ్బందులేగాక, అంతరంగికముగ కాంగ్రెస్ సంస్థ నాయకులలోనే కొన్ని భేదాభిప్రాయములు బయలుదేరుచున్నవి. యిబ్బందులు కలిగిస్తున్నవి. దేశవిభజన కావించి పాకిస్థాన్ స్థాపించినతరువాత జరిగిన సంక్షోభము ప్రజలమనస్సులను కలచివైచినది. మన ఉదారతను పగలు దుర్బలతగా వెంచుచున్నారు. ఏవేవో ఆశయములకు అంటిపెట్టుకుని మన స్వాతంత్ర్యమును భగ్నమొనర్చుటకు ప్రయత్నించువారిపట్ల శాంతితోను, ఉదారతతోను ప్రవర్తించుట ఏమాత్రము క్షేమప్రదముకాదు. ఈ విషయము నాయకులందరు అంగీకరించినను, ప్రభుత్వములోనున్న వారి చర్యలు కొంతవరకు అంత కారగా ముగా లేవు. రానున్న ప్రమాదము నెరిగియు, దానినెదుర్కొని దేశమును రక్షించుటకు తగిన చర్యలను ప్రభుత్వము సకాలములో పూనుకొనలేదనియు, స్వాతంత్ర్యమును సంపాదించిన సంస్థయు, తమను ప్రభుత్వములోనికి పంపిన సంస్థయు నగు కాంగ్రెస్ సంస్థ అధ్యక్షునికే వీరు తమ విధానములను తెలియజేయుటలేదు. అందువలననే కాంగ్రెస్ అధ్యక్షుడు ఆచార్య కృపలానీ తన పదవికి రాజీనామా నిచ్చుచున్నాడు. ఈయన రాజీనామావలన కొన్ని మహోత్కృష్ట సమస్యలుత్పన్నమగుచున్నవి. కాంగ్రెస్ కార్యవర్గమునకు, కేంద్రములో అధికారము నందున్న కాంగ్రెస్ ప్రభుత్వమునకు, ఎట్టి సంబంధము లుండవలెనన్నది వీనిలో ముఖ్యసమస్య. వ్యక్తుల విషయ మటుంచి, నిష్కర్షగా చెప్పవలెనన్నచో, కాంగ్రెస్ ప్రభుత్వము కాంగ్రెస్ సంస్థ ఆదేశము ప్రకారమే నడుచుకొనవలసి యున్నది. కాని ఈ విషయమై, అధికారము నందిన్న కాంగ్రెస్ సభ్యులు ఏ సమాధానము చెప్పకుందురో, ఎ. ఐ. సి. సి. ఏమి నిర్ణయము చేయనున్నదో చూడవలసి యున్నది. భారత రాజకీయ రంగములో కాంగ్రెస్ సంస్థ భవిష్యత్తులో ఎటువంటి పాత్ర వహింపగలదో, బహుశః ఈ నిర్ణయము పైననే ఆధారపడి వుండును.

* * *

జునాగఢ్ సంస్థానం భారత యూనియన్‌లో జేరినది; ఈ సంఘటన కొంతవరకు ఆశ్చర్య కరముగానే యున్నది. కాని అటుపైన జరిగిన సంఘటనలు మరింత ఆశ్చర్య కరముగా వున్నవి. జునాగఢ్ తాత్కాలిక ప్రజాప్రభుత్వం ప్రశంసనీయంగా పురోగమనం సాగిస్తూ వుండటం వలన, సంస్థాన పరిపాలనా యంత్రం భగ్నమై పోవటం మొదలు పెట్టింది.

కాని పరిపాలనా యంత్రమంతా భారత ప్రభుత్వానికి వప్పజెప్పి, దివాన్ కరాచీ వెళ్ళి, పాకిస్థాన్ మామూలువిధానమును అనుసరించాడు. తాత్కాలిక ప్రభుత్వానికి భారత ప్రభుత్వం సంపూర్ణ సహాయం చేసిందనీ, అందువలన జునాగఢ్ తాత్కాలిక ప్రభుత్వానికి లొంగిపోవలసి వచ్చిందనీ, అందువలన ఆ చట్టవిరుద్ధ ప్రభుత్వానికి లొంగిపోవటంకన్న భారత ప్రభుత్వానికే లొంగిపోవటం మంచిదని తాను భావించినట్లూ, ఇందువలన జునాగఢ్ భారత యూనియన్‌లో చేరినట్లు భావించరాదని ఈయన ప్రకటించాడు. దీనిపై పాకిస్థాన్ ప్రభుత్వం అందుకుని, చిలువలు పలువలుగా ఒక ఆరోపణ తయారుచేసింది. తాత్కాలిక ప్రభుత్వమనే చట్ట—విరుద్ధ సంస్థను పోషించి, పాకిస్థాన్ భూభాగమగు జునాగఢ్‌ను భారత ప్రభుత్వం ఆక్రమించుకోవడం అశాస్త్రీయము, అసంబద్ధమునని, ఇది ఒక విద్వేష పూరిత చర్యయేనని పాకిస్థాన్ ప్రభుత్వం ఆక్షేపణ చేసింది. భారతప్రభుత్వంగాక, తాత్కాలిక ప్రభుత్వమే జునాగఢ్ సంస్థానాన్నంతనూ ఆక్రమించుకొని వుంటే పాకిస్థాన్ ప్రభుత్వం ఈ ఆక్షేపణ చేయుటానికి అవకాశమే వుండేది కాదు. భారతప్రభుత్వానికి సంస్థానాన్ని వప్పజెప్పి ఈ విపరీతమైన నింద వేసి, అంతర్జాతీయ ప్రపంచంలో ఇండియా ప్రభుత్వంపై దుష్కీర్తి తేవటానికే జునాగఢ్, పాకిస్థాన్‌లు, ఈ కుతంత్రం పన్నాయి. ఇది నిజమే గాకపోతే, సంస్థాన పరిపాలనా యంత్రం భగ్నమై పోతూవుంటే, పాకిస్థాన్ ప్రభుత్వం కళ్ళు మూసుకుని ఎందుకు వూరుకున్నది? భారత యూనియన్‌లో చేరటానికి ఇష్టంలేని దివాన్ భారత యూనియన్ సహాయం ఎందుకు ఆపేక్షించారు? ఆపత్కాలములో తమను రక్షింపలేని పాకిస్థాన్‌కు అంటిపెట్టుకొని వుంటే జునాగఢ్‌కు ఏమి లాభము? మహాత్మ గాంధితోను, సర్దార్ పటేల్‌తోను అతివినయముగా దివాన్ జరిపించిన సంప్రదింపు లన్నీ ఒక మోసముగా పరిణమించినవి. కాని, ఏదో పెద్ద నింద భారత ప్రభుత్వంపై మోపాలని, తమ భూభాగాన్నే వదలుకున్న పాకిస్థాన్ ప్రభుత్వం, ఎంత బలవత్తరంగా వున్నదో, ఎంత సమంజస విధానములతో వ్యవహరిస్తున్నదో, ప్రపంచం గ్రహించకపోదు. అన్యాక్రమించి, సంస్థానంలో ఎంతో భాగాన్ని వశపరచుకున్న తాత్కాలిక ప్రజా ప్రభుత్వాన్ని నిర్లక్ష్యంచేసి, దివాన్ పన్నిన మోసపు టురులలో భారత ప్రభుత్వం అంత సునాయాసంగా చిక్కుకొని పోవడంమాత్రం విచారకరమైన విషయం. జునాగఢ్ సంస్థానాన్ని తాత్కాలిక ప్రభుత్వమే ఆక్రమించుకుని, ఆ ప్రభుత్వ యాజమాన్యముననే రిఫరెండం జరిగివుంటే, భారత ప్రభుత్వాన్ని నిందించటానికి పాకిస్థాన్‌కు అవకాశం వుండేదే కాదు. ఇప్పుడు భారత ప్రభుత్వ వశమైన సంస్థానం, సంస్థానంలో ప్రజాభీష్టం ప్రకారం భారత యూనియన్‌లోనే వుండిపోతుం దనటంలో సందేహం లేదు. (పాకిస్థాన్ ప్రభుత్వం చెప్పినట్లు) సంస్థానం విషయంలో దివాన్‌కు, నవాబ్‌కు సంబంధంలేదు. అయితే పాకిస్థాన్ ప్రభుత్వం సంస్థానం తమదేనని భావిస్తున్నది. కాని అది వాస్తవానికి ప్రజలది. చివరకు ప్రజాభీష్టము విజయము నొందినా, అది సక్రమంగా జరిగి వుంటే మరింత ప్రశంసాపాత్ర మయ్యేది.

భారతదేశంలో ముస్లిం ముష్కర దండయాత్రకు ప్రథమంగా బలియైన సోమనాథ దేవాలయం పునర్నిర్మించుకుని భారతీయులు ఈనాడు పూనుకోవటం సమంజసము; హర్ష దాయకము.

* * *

కాశ్మీర్ సంస్థానంలో భారత సేనలు విజయవంతంగా పురోగమనం సాగిస్తున్నవి. దుండగుల కేంద్ర స్థానమగు బారామూలా ఆక్రమించుకొనబడినతరువాత దుండగుల ఆక్రమణాయం దున్న మరొక బలవత్తర కేంద్రమగు ఊరీకూడా ఆక్రమించు కొనబడినది. దుండగులు ముఖ్య పట్టణముగా ఏర్పరచుకున్న పలందురి పట్టణమునుండి వారు పారిపోయి, ఏదో ఒక అనామక స్థలములో దాగుకొనవలసివచ్చినది. ముజఫరాబాద్, పూంచ్, మీర్‌పూర్ జిల్లాలలో తప్ప దుండగులు మరే ప్రాంతములోను లేరు. ఈ ప్రాంతమునుండి కూడా బహుకొద్ది కాలములోనే వారు తిరోగమనంచేయక తప్పదు.

కాశ్మీర్ సంఘటనలలో పాకిస్థాన్‌కు ప్రత్యక్ష సంబంధమున్నదని రుజువు చేయుటకు తగినంత ఆధారము, సాక్ష్యము దొరకుచున్నది. ఖైదీలుగా చిక్కిన దుండగులు చాలమంది పాకిస్థాన్ సైన్యములోని సైనికులే. వీరు చెప్పుచున్న విషయములను గమనించినచో, పాకిస్థాన్ ప్రభుత్వమే పరోక్షముగా, ఈ అప్రకటిత యుద్ధము సాగిస్తున్నదని రుజువు కాగలదు. కాశ్మీర్ సంస్థాన ప్రభుత్వమును కూలదోయుటకు 1945-వ సం. లోనే ముస్లింలీగ్ ఆధ్వర్యమున ఒకకుట్ర పన్నబడినట్లు రుజువుచేసెడి కాగితములు తమకు దొరికినవని కాశ్మీర్ దివాన్ మహాజన్ ప్రకటించాడు. ఖైదీల వాఙ్మూలములు, వారివద్ద దొరకుచున్న ఇతర పత్రములు భారత ప్రభుత్వం ఒక సంపుటముగా ప్రచురించి, విదేశములలో, పాకిస్థాన్ జరుపుచున్న దుష్ట ప్రచారమునకు ప్రతిగా పాకిస్థాన్ కుట్రలను బయటపెట్టి, పాకిస్థాన్ సక్రమ మను విధానము నవలంబించునట్లు చూడవలెను.

భారత ప్రధాని, ఉపప్రధాని, రక్షణశాఖ మంత్రులు కాశ్మీరువెళ్ళి, పరిస్థితులను స్వయముగా గమనించి, కాశ్మీరు ప్రజలకు, ప్రభుత్వమునకు ధైర్యము గొల్పి వచ్చారు.

* *** ***

పశ్చిమ సరిహద్దులలో భారత ప్రభుత్వమును పెట్టుతున్న యిబ్బందులతో పాకిస్థాన్‌కు తృప్తి కలుగలేదు. వీలైనన్నిచోట్ల, వీలైనన్ని విధముల భారత ప్రభుత్వమును ఇబ్బంది పెట్టడమే పాకిస్థాన్ ఏకైక లక్ష్యముగా కనిపిస్తున్నది. త్రిపురా సంస్థానము బెంగాల్‌లో నున్నది. ఈ సంస్థానంలో ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు హిందువులే. కాని ఈ సంస్థానము మూడువైపుల తూర్పు బెంగాల్‌లోనికి చొచ్చుకొని వున్నది. ఒకవైపున మాత్రము అస్సాం సరిహద్దు వున్నది. అందువలన భారతదేశంతో రాకపోకలకు ఈ సంస్థానానికి, కాశ్మీర్‌కు వున్నంత యిబ్బంది కూడా లేదు. అయితే, తూర్పు బెంగాల్ నుంచి ఈ సంస్థానానికి రాకపోకలు సులభమన్న విషయం అంగీకరించాలి. అంతేగాని సాంస్కృతికంగాను, మతవిషయికంగాను ఈ ప్రజలకు హిందువు లవటంవలన, తూర్పు బెంగాల్‌తో కన్న అస్సాంతోనే అత్యంత సన్నిహిత సంబంధంవున్నదనటం నిర్వివాదాంశం. ఈ సంస్థానం ఆగస్టునెలలోనే భారత యూనియన్‌లో జేరినది. కాని ఈ సంస్థానం భారత యూనియన్‌లో జేరితే, తూర్పు బెంగాల్ రక్షణ కొంతవరకు కష్టతరమౌతుందని భావించి, ముస్లింలు, ఏ విధముగానైనా ఈ సంస్థానమును పాకిస్థాన్‌లో కలుపుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ప్రయాణీకులవలె, ఊరు చూడటానికి వచ్చినవారివలె చాలమంది ముస్లింలు అనవసరంగా సంస్థానంలో ప్రవేశించి, పాకిస్థాన్‌లో చేరవలసిందని ఒత్తిడిచేయటం, ఏవో చేస్తామని భయపెట్టటం ప్రారంభించారు. అందువలన ఆ సంస్థాన సరిహద్దులను కాపాడటానికి భారతప్రభుత్వం సేనలను పంపవలసి వచ్చినది. ఈ సంస్థాన సరిహద్దులలో భారత సేన లుండటం అసంభావ్యమని పాకిస్థాన్ తలంచవచ్చు కాని ఇది వారు కోరితెచ్చుకున్నదే కదా! ఇటువంటి చిలిపిచేష్టలు చేయటం పాకిస్థాన్ ప్రభుత్వం ఎంత త్వరలో మనుకుంటే అంత మంచిది.

* * *

హైదరాబాద్ ఇంకా త్రిశంకుస్వర్గంలో తల్లక్రిందులుగా వ్రేలాడుతునే వున్నది. ఛత్తారి నవాబ్ ఆధ్వర్యమున పనిచేసిన రాయబారవర్గం రాజీనామా నిచ్చినతరువాత మొయిన్ నవాజ్ జంగ్ బహదూర్ ఆధ్వర్యమున ఏర్పడిన రాయబారవర్గం, లాంఛనప్రాయంగా రెండురోజులు సంప్రదింపులు జరిపి హైదరాబాద్ తిరిగి వెళ్ళింది. ఆలోచించుకొనటానికి తనకు మరొక




నవాబ్ మొయిన్ నవాజ్ జంగ్

15 రోజులు వ్యవధి యిమ్మని నిజాం కోరుతున్నారు. గత వారం సూచించినట్లుగా, ప్రస్తుత ప్రాతిపదికలపై నిజాంకు, భారతయూనియన్‌కు ఒడంబడిక కుదరగల అవకాశ మేమీ లేదు. ఇక నిజాం కోరుతున్న కాలవ్యవధి దేనికి? తాను భారత యూనియన్‌లో జేరుతాననో, లేదనో విస్పష్టంగా నవాబ్ చెప్పివేయవచ్చును. కాని ఈ విషయంలో ఎటూ తెగించి చెప్పటానికి నవాబ్‌కు ధైర్యము లేదు. భారత ప్రభుత్వంలో చేరితే, నవాబ్‌ను సకుటుంబంగా నాశనంచేస్తామని ఇత్తేహాదుల్ ముస్లిమీన్ భయపెడుతున్నారు. భారతదేశంలో చేరను, స్వతంత్రంగా వుంటానని నిశ్చితంగా చెప్పివేసి, ఒక్కరోజుకూడా గడపలేనని నవాబ్‌కు తెలుసును. ముందుమాస్తే నుయ్యి, వెనుకకుపోస్తే గొయ్యి. అందువలననే నవాబ్ వీలైనంతవరకు సంభాషణలు తెగకుండా నడుపుతూ, ఏమి జరుగుతుందో వేచి చూద్దాం అనే ప్రమాదకర విధానం అవలంబిస్తున్నాడు. కాని సంస్థానంలోని ముస్లిం ఉద్యోగులు, ముస్లింలు చేస్తున్న దురోచ్ఛలకు లోనై, ఈయన కొన్ని తప్పుడు పనులుచేస్తూ, తన ఉనికి మరింత ప్రమాదకరమని రుజువు చేసుకుంటున్నాడు. తన సేనాధిపతిని కంటివైద్యం మిషపై, లండన్ పంపి వీలైనన్ని ఆయుధాలు కొనివేస్తున్నాడు. ఈ ఆయుధాలు దొంగచాటుగా కరాచీ పంపి, అక్కడినుండి విమానాలద్వారా హైదరాబాద్ చేరవేస్తున్నారు. అధిక లాభాపేక్షపరులు, భారతదేశం తమ అధికారంనుండి జారిపోయిందే అని విచారాక్రాంత కోపోద్రిక్తులైన బ్రిటిష్ వర్తకులు కొందరు ఈయనకు సహకారం చేస్తూ వుండటంలో ఆశ్చర్య మేమీ లేదు. సంస్థానానికి జేరిన ఆయుధాలన్నీ ముస్లిములకు పంచిపెడుతున్నారు. చుట్టుప్రక్కల ప్రాంతాలనుండి క్రొత్తగా సంస్థానం చేరిన ముస్లింలకు ఆయుధశిక్షణ యిస్తున్నారు. ఇదంతా నిజాం సర్వస్వాతంత్ర్యమనే ఎండమావిని చేరటానికే!

నిజాం సంస్థానంలోని ప్రజలలో అధిక సంఖ్యాకులు ఆంధ్రులు. ఆంధ్రదేశ మహోత్కృష్ట చరిత్రలో ప్రణమ ఘట్టము తెలంగాణాలోనే జరిగినది. భారతదేశచరిత్రలో ఆంధ్రులకు ప్రత్యేక విశిష్టతను సంపాదించి పెట్టిన తెలంగాణా కాకతీయులు, రాయలసీమ విజయనగరమే. ఇంతవరకు కోస్తా ఆంధ్రుల కృషి శూన్యమే నని చెప్పవచ్చును. కాని కాలవశమున నేడు రాయలసీమ క్షామగ్రస్తము, తెలంగాణా మ్లేచ్ఛహస్తగతమునై పోయినవి. సుసౌభాగ్య సంపన్నులు, రాజకీయముగా చైతన్య వంతులునని కోస్తా ఆంధ్రులు, చెల్లియో, చెల్లకో, అఖిలభారత దేశంలో కొంత పేరు సంపాదించారు. కాని ఇంతవరకు వీరు సాధించిన దేదీ ముచ్చటైనా కనపడదు. మద్రాసు రాజధానిలోని ఆంధ్రజిల్లాలకు, నిజాంసంస్థానమునకు, ఒక్క కృష్ణా జిల్లాలోతప్ప మిగిలిన జిల్లాలలో కృష్ణా, తుంగభద్రా నదులు సరిహద్దులుగా నున్నవి. కృష్ణాజిల్లాలో మాత్రం నిజాం సంస్థానము, రాష్ట్రప్రాంతములు ఒకదానితో నొకటి చొచ్చుకొనిపోయి వున్నవి. కృష్ణా జిల్లాకు చెందిన లింగగిరి, మునగాల పరగణాలు నైజాం సంస్థానం మధ్యనే వున్నవి. నిజాంకు చెందిన 4,5 చిన్న చిన్న పరగణాలు మన జిల్లామధ్యనే వున్నవి. తెలంగాణా

17-వ పేజీ చూడుడు

మహిళాలోకం



పాశ్చాత్యదేశాలలో స్త్రీల అభ్యున్నతి

శ్రీమతి కొండ పార్వతీదేవి. బి. ఏ.

గత ఆగష్టు మాసమందు స్విజర్లాండులోని ఇంటర్‌లాకన్ పట్టణమందు మిసెస్ కార్బెట్ ఆశబీగారి అధ్యక్షతక్రింద 14 వ అంతర్జాతీయ మహిళా మహాసభ జరిగినది. ఆ సభకు అఖిల భారత మహిళాసంఘ పక్షమున భారతదేశ ప్రతినిధిగా వెళ్లు నవకాశము నాకు కలిగినది. నేను చూచిన విశేషముల తెలుప కుతూహలము కలదు.

స్విజర్లాండు పాశ్చాత్యదేశములో ప్రకృతి సౌందర్యమున వన్నెకెక్కినదై, ఆరోగ్యమునకు నిలయమై, అందమగు ఉపవనములతోడను, పచ్చికబయళ్ళతోడను, ఫలవృక్షముల తోడను చిత్రవిచిత్రములగు స్విస్ దేశీయుల నైపుణ్యమును ప్రకటించు పూతోటలతోను చూపరుల కానందము చేకూర్చుచుండును. అచ్చటి స్త్రీలు పురుషులవలె కష్టసహిష్ణుత కలిగి, సేద్యము చేయుటయందు నేర్పుగలిగి, ఫలవంతముగ చేయ కొక అంగుళము నేలనైనా వదలిపెట్టరు. స్త్రీలు పురుషులవలెనే దుస్తులనుధరించి, వ్యవసాయపు పరికరములను తీసుకొని, వీపులమీద మూటలు వేసుకొని కొండలు ఎక్కుచుండుట కనపడును. పలువిధముల రంగుల పూవులతోను, పచ్చిగడ్డితోను చిత్రముగా, నమర్చిన ఇంటర్‌లాకన్ లోని కసియారమే, వారి కళానైపుణ్యమును చాటుచున్నది.

ఇంటర్‌లాకన్ పేరు సూచించుచున్నటుల ఆ పట్టణము రెండు సరస్సులమధ్య నమరియున్నది. ఆ సరస్సునందు ప్రతిఫలించు పర్వతశ్రేణియందు జాంగ్ ఫ్రో, (Jung fro) అనగా యౌవన వతి యను మంచుకొండయు కనుల పండువుగ నుండును. స్విజర్లాండులోని స్త్రీలు కలుపుగోలు తనముగ విదేశీయులతో ప్రవర్తింతురు. వారిలో కొలదిమంది మాత్రమే ఇంగ్లీషుభాష మాట్లాడగలిగి యున్నారు. పత్రికా విలేఖరు లనేకులు స్త్రీలు కలరు. వారు కూడా ఇంగ్లీషుకంటే ఫ్రెంచిభాష బాగుగ మాట్లాడ కలిగియుందురు. అచ్చట మహాసభలలో సహితము మారశ్రవణయంత్రముతో నవసరములేక నిశ్శబ్దముగా నుండును. స్త్రీలు పిల్లలను సభలకు తీసుకొనిరారు. అచ్చట ప్రతినిధులు మాట్లాడుటకు మహాసభలను ఏర్పాటు చేసిరి. మనదేశములో ఉపన్యాసకులను పూలమాలలతో సత్కరించు నాచారము కలదుగదా? ఆ దేశములో ఉపన్యాసకులకు అధ్యక్షురాలికి అందముగా చిత్రించిన శ్రేష్ఠమైన రుచ్యమైన చాక్లెట్లు కలిగిన కొయ్యపెట్టెల నిచ్చిరి. స్విజర్లాండుకు బరన్ ముఖ్యపట్టణము. క్రొత్తపట్టణము ఎత్తుగా నుండి పాతపట్టణము క్రింద నుండును. అచ్చట పార్లమెంటు భవనము అందమైన కట్టడముగలిగి టిక్కెట్లు లేకుండగనే కొన్ని దినములందు ప్రేక్షకులు వెళ్లుటకు అవకాశము కలిగియున్నది.

బరన్‌కు సమీపమునసే, బాసల్ అను పట్టణము కలదు. అందు పురాతన క్రైస్తవ దేవాలయము, దానిమీద చెక్కబడిన శిల్పపని ప్రశంసనీయముగ నున్నది. ఆ పట్టణమునందే ఫ్రాన్సు, జర్మనీ, స్విజర్లాండు మూడు దేశముల చివరలను గలుసుదురు. ఈదేశము, ఘోర సంగ్రామ బాధల నుండి తప్పించుకొనుటచేత బీభత్స దృశ్యము లేవియు లేక, భోజన వసతులు కలిగి ప్రజలు సుఖజీవనము చేయుచున్నారు. ఈ దేశీయుల అతిథిసత్కారము చిత్రముగా నుండును. మనము తొడుగుకొని వెళ్ళిన ఓవర్‌కోటును, మన కాతిథ్యమిచ్చిన ఇంటి యజమానురాలు వెళ్లగానే తీసి మరల మనము వచ్చునప్పుడు తానే స్వయముగ తొడుగును.



అఖిలభారత మహిళాసభ మద్రాసుశాఖ (శ్రీమతి రాధాబాయి సుబ్బరాయన్‌గారు ప్రారంభించారు.

ఆ ప్రయాణసందర్భమునసే పోర్టు సైడ్‌లో దిగి, ఈజిప్టుకు ముఖ్యపట్టణమైన, కైరోకు వెళ్లితిని. అచ్చట ప్రపంచములోకెల్ల పెద్దవైన స్మారకచిహ్నములైన మూడు పిరమిడ్లు కలవు. అన్నిటికంటె పెద్దది 755 అడుగుల పొడవును, 450 అడుగుల వెడల్పును గలిగియున్నది. ఒక లక్షమంది జనము 30 సంవత్సరములు కష్టపడి కట్టినట్లు చెప్పుదురు. మొదట పాలరాతితో కట్టబడినదట కాని, కాలము గడచుటచేత గోధుమవన్నె రాళ్ళే ఇప్పుడు కనబడును. సూర్యాస్తమయసమయమందు, ఒక మైలు దూరము నీడను వ్యాపింపజేయును. రెండవది దాదాపు మొదటిదానితో సమానమేను. బెల్జియన్ అనునతను అందు పరిశీలించి చూడగా, 5000 సంవత్సరముల క్రితము ఏ రాజు స్మారకము నిమిత్తము కట్టబడినదో ఆ రాజుయొక్క మృతకళేబరము సురక్షితముగా కనపడినదట. మూడవది, పెద్ద పిరమిడ్‌లో సగము ఎత్తు మాత్రమే కలిగియున్నది. ప్రతిరాజు రాజ్యమునకు రాగానే తన స్మారక చిహ్నమును కట్టుట ప్రారంభించెనట. వాటియొక్క ఎత్తు రాజ్యపరిపాలనాకాలమును గూడ సూచించుచున్నవని చెప్పుదురు. ఆ నైల్ నదీతీరముననే, అనేకములైన గోరీలు, మసీదులు కలవు. అన్నిటికంటెను, అతి పురాతనమైన చూపరులకు ఆశ్చర్యమును కలిగించు స్ఫింక్స్ Sphinx అనునొక పెద్ద ఏకరాతి విగ్రహము. మానవస్త్రీ ముఖము, సింహపు శరీరమూ కలిగి, అనేక సంవత్సరములను, ఋతువులను, చూచుచూ మానవ అశాశ్వతత్వమును పరిహసించుచున్నదా యనునట్లున్నది. దాని పొడవు 140 అడుగులు, ఎత్తు 30 అడుగులు. నెపోలియన్ సైనికుల కాల్పుల వలన ముక్కుపై కిరీటము విరిగి పోయినదని చెప్పుదురు. అయినను ఇప్పటికిని యుగ యుగముల నాటి శిల్పకారుని కళావైదగ్ధ్యమును చూపుచున్నది.

అచ్చటి గొప్పయింటి స్త్రీలు పరదా పద్ధతినే అవలంబించుదురుగాన వీధులలో కనపడరు. బీదవారు సహితము నల్లని బురఖాలను వేసుకొని వీధులలో తిరుగుచుందురు. ఇప్పటికి విద్యావతులైన స్త్రీలు తమ దేశీయ దుస్తులను వదలి పాశ్చాత్యదేశీయులవలెనే గౌనులను ధరించెదరు. కేశఖండన ఆచారము ఇంకా ప్రబలలేదు కాని పాశ్చాత్య దేశీయుల వలెనే అనేక విధములగు ముడులను వేయుదురు.

స్విజర్లాండు ఎట్లు ప్రకృతి సౌందర్యముచేత నలంకృతమై యున్నదో, అటులనే లండన్ పట్టణము, మానవకృత చిత్ర విచిత్రములతోడ నలరారుచున్నది. అచ్చటి విద్యుచ్ఛక్తితోడ నడపబడు సాయంత్ర మగ్గి మానవునికి కౌశల్యమును నైపుణ్యమును చూపుచున్నది. భూమిక్రింద (Under ground) కట్టబడిన ఆ విశాలమైన స్టేషనులు, రైలు మార్గములు, వందలకొలది ప్రయాణీకులను ఒకే పర్యాయము పైకి తీసుకొని వెళ్లుటకు, క్రిందికి తీసుకొని వచ్చుటకు ఎలెక్ట్రిక్ లిఫ్టువలె మనిషితో పనిలేకయే 24 గంటలు అవి అంతట అవియే తిరుగుచుండు ఎస్కలేటర్సు అనబడు కొయ్యమెట్లు వరుసలు ప్రకృతి శాస్త్రమందు వారికిగల అపార విజ్ఞానమును తెలుపుచున్నవి. విదేశీయులుకూడా ప్రయాణము చేయుటకు సులభముగా నుండుటకు గోడలమీద రైలు మార్గముల ప్లానులు వేయుదురు. అచ్చువేసిన కాగితములు ఉచితముగా పంచి పెట్టుదురు. అచ్చట రైళ్లలో ఒకే తరగతి మొదటి తరగతి పెట్టెలే కలవు. ఆ తరగతి బండ్లు మన దేశములోని మొదటి తరగతి పెట్టెలకంటెను సౌకర్యముగాను, పరిశుభ్రముగాను, మెత్తని పరుపులు కలవిగా నున్నవి.

పబ్లిక్ స్థలములలో ఉమ్మివేయ కూడదనియు ఉమ్మి వేసిన 65 రూ. (5 పౌనులు) పై చిల్లర జుల్మానా విధించెదమనియు రైళ్లలోను బస్సులలోను, ట్రాములలోను వ్రాసెదరు. అందువలన వీధులు, ప్లాట్‌ఫారములు చాల పరిశుభ్రముగా నుండును. కౌంటీ కౌన్సిల్ (మునిసిపాలిటీ) వారు ప్రతి యింటికి చెత్తవేయుటకు, డబ్బాల నిచ్చి వారే వాటిని శుభ్రము చేయు భారముకూడ వహించెదరు అచ్చటి ప్రభుత్వము వారు, సంఘసేవాపరులు పెట్టిన ఆరోగ్యస్థానములు (Health centres) కలవు

సాధారణముగా పేటకొక వైద్యస్థానము కలదు. అందులో ఫిన్స్ బరీ సెంటరు కౌంటీ కౌన్సిల్ వారిచేత నడపబడుచున్నది. అందులో, చెవులకు, ముక్కుకు, కాలికి, పన్నుకు, ప్రత్యేక ప్రత్యేక క్లినిక్సు కలవు. అచ్చట పెద్ద పరుపులు మొదలగు వాటిని సహితము క్రిమినాశనము చేసి శుభ్రముచేయు పెద్ద యంత్రము కలదు. అంటురోగములనుండి ఎట్లా తప్పించుకొనవలెనో, ఎట్లా జాడ్యములను ప్రారంభదశలో తెలుసుకొనుటకు వీలగునో, ఏ కాలమందు, ఏ దుస్తులను, ఏరంగు దుస్తులను, ధరించిన ఆరోగ్యకరమో, ఏ ఆహారము శరీరమునకు పుష్టి కలిగించునో, ప్రారంభమునందే రోగముల తెలుసుకొని ఆహార విహారాదిమూలకముగ రోగ నివారణ చేసుకొనుటకు అవకాశముకలదో - ఈ మొదలగు విషయము లన్నియు ఆకర్షణీయముగా నుండునట్లు రంగురంగుల బొమ్మలతో అచ్చు వేయించి, కరపత్రములను పంచి పెట్టుదురు. గర్భిణీ స్త్రీల ఇండ్లకు వెళ్లి వారికి వలయు సదుపాయముల చేయుదురు.

పిల్లలకు, పిల్లల తల్లులకు వసతులు కల్పించు నిమిత్తము మాతాశిశు శరణాలయములు ప్రభుత్వము వారిచేతను, ప్రజలచేతను నడుపబడుచున్నవి పెక్కులు గలవు. పిల్లల తల్లులు ఉద్యోగములకు వెళ్లినప్పుడు, కూలీ మొదలగు పనులకు వెళ్లినను, అనారోగ్యముగ నున్నను ఆ బిడ్డలకు శిక్షణ పొందిన నర్సులు ఆహారాది సౌకర్యములు కలుగ జేయుటయేగాక విద్యాశిక్షణముకూడ నిచ్చెదరు. ఆ బిడ్డలకు అనేక విధములగు వస్తుసామగ్రిని సమకూర్చి వారి అభిరుచి కనుగుణముగ సున్నితమార్గమున శిక్షణ నిచ్చెదరు. అచ్చట బరామండ్సీ కౌన్సిల్ అనేక విధములుగ సాంఘికసేవ జేయుటయందు ప్రసిద్ధి చెందినది. ఆ సంస్థ పక్షమున బాల సంఘము, వృద్ధుల సంఘము నాటక సంఘము, సభా నిర్వాహక సంఘము, వికలాంగుల సంఘము అనునవి నడపబడుచున్నవి. బీద పిల్లలకు పాఠశాలలు తెరచి, వారికి చిత్తరువులు లిఖించుట, పాటలు పాడుట, కథలు చెప్పుట, నాటకములు వేయించుట మొదలగు

(18-వ పేజీ చూడుడు)

క థా ని క :

దయ్యాలవేద ఘోష

శ్రీ తెన్నేటి సూరి

సముద్రతీరం: శిథిలమైపోతున్న వో ముసలి పట్నం. మూడునాలుగు దినాలుగా, ఆహో రాత్రులూ మేఘాలు క్రమ్మేసేసి, ముసురుబట్టి, ఆ పట్నం చీకటిబడిపోయింది. వర్షం దెబ్బ కొంచెం తెరిపిచ్చినా, ఈదురుగాలి ఇంకా తగ్గలేదు. బిగిలిపోయిన ఆ కొయ్య మేడల్ని, పాకడుబట్టి, రావి చెట్లు మొల్చి, నోళ్లు తెరుచుకొని, యాలిగిలబడిపోతూన్న ఆ వచ్చి యిటుల ప్రహరీ గోడల్ని, ఊడ్చింది. ఇంకా ఊపుతునే వుంది.

అర్ధరాత్రి: రోడ్డుప్రక్కనున్న లాంతరు స్తంభం మీద, మిణుకు మిణుకుమంటూ, దీపం వెలుగుతోంది. చుట్టూవున్న నాలుగు ద్వారాలూ వానకి తడిసి కావురేసిపోయున్నాయ్. కాని, కష్ట పరంపరల్లో, తడిసి ముప్పందమై తడబడిపోతున్నా లెక్క చేయక, తన విజ్ఞానజ్యోతితో, ఆ యస్తంభంలా జీవితపథాన స్థైర్యంతో నిలిచి వెలుగుతూన్న తేజశ్శాలి ఆ లాంతరు స్తంభం. అచేతనమైన ఆ లాంతరు స్తంభాని కున్నంతమాత్రం స్థైర్యం ఆ మానవుడికి ఎందుకు లేకపోవాలి?—

లాంతరు స్తంభానికి ప్రక్కగా నడిచిపోతున్నాడు. రోడ్డు మీద యే చెత్త కనిపించితే, యే చెదారం కనిపించితే యే గుడ్డపేలిక కనిపించితే. యేచింకిగోనె ముక్క కనిపించితే, దానల్లా జీబులు జీబులుగా నెత్తిచుట్టూ, మెడచుటూ, మొలచుటూ. కాళ్లచుట్టూ యేదోవిధంగా చుట్టబెట్టుకుని, ఊరిబయటి గంగానమ్మ గుడివేపుకు గజటుగా నడిచిపోతున్నాడు.

తనదేహంమీద వున్న పదార్థాల్లో ఏదీ తనది కాదు తన దన్నది ఈ ప్రపంచంలో యేదీ లేదు. అవన్నీ ఇతరులు పనికిరాక వీథిలోకి ఊడ్చి పారవేసిన బాపతు. వీథిలో చెత్తంతా తన్ని ఆపాదమస్తకం ఆవరించుకుంది. ఈ మహాగోళంమీద తన దనేది యేమీలేదు. వస్తువుల మాట అలా వుంచండి—తన మనస్సులోవున్న భావాలే తనవి కావు. అవన్నీకూడా ఇతరులు తమకు పనికిరాక బయట పారేసిన బాపతే. తనకు స్వంతభావ మనేది ఒకటీ లేదు తన కసలు మనస్సే లేదూ! నామతః వున్నా, దానికి చైతన్యం పోయి పనిచెయ్యటం మానేసింది తనకు తనుగా ఏదీ ఆలోచించుకోలేదు. తనకు తనుగా ప్రకాశించలేదు. ఏ క్షణం ఏ ధనికుడి కారు హారన్ యెటు తప్పుకోమని గర్జిస్తే అటు తప్పుకోటం, యే యెర్రటోపీ యెటు తప్పుకోమని గదిమితే అటు పెడగా తిరిగిపోవటం. ఈ ప్రపంచంలో ఏ క్షణం యే ప్రభంజనం యెటువీస్తే, రోడ్డుమీది ఆ గడ్డిపోచలోపాటు తనూ అటు కొట్టుకుపోతుంది. లేదా, వాటితోపాటు చుట్టజుట్టుకుని, యే మురిక్కాలువ తూముకో అడ్డంపడి కుళ్లిపోతూ వుంటుంది.

అసలు ఈ గుడ్డపేలికలన్నీ, ఈ చెత్తంతా, రోడ్డుమీద యెందుకు పారేస్తారో? పాపం వాళ్లంతా చాలా పుణ్యాత్ములు! తనకి చలేస్తుందని, ఈ గుడ్డపేలికల్లో, ఈ చెత్తలో తను ఒళ్లు దాచుకోటానికి దయదల్చి బయట పారేసుంటారు. అందుకేగా మహారాజులు ఎంగిలాకుల్లో పులుసుముక్కలూ అవీ వొదిలి పెడుతూవుంటారు,—తన కాకలౌతుం దనేగా!

తన కాకలైతే వాళ్లకేం? తనకి చలేస్తే వాళ్లకేం?—ఇదంతా వాళ్లకేం పట్టిందబ్బా? పాపం వాళ్లంతా చాలా దయగలవాళ్లైవుండాలి—ఛా!—దయేమిటి? దయ—మట్టి!—మొన్న డబ్బుకోసం తమ్ముణ్ణి కూనీచేయించాడే! వాడి మేడమీది కిటికీలోనుంచి వచ్చిందేగా ఈ పేలిక! ఎన్నిముళ్లు వేసినా యీ గుడ్డపేలికలో దయనేది వుంటానికి, వీలు లేనే లేదు. దీనికి అక్కడక్కడ ఆ యెర్రటి రక్తపు మరకలు తప్ప మరేమీ లేదు. మరెందుకు పారేసినట్టు?—

ఓహో! అదా! తనకి మరీ చలేస్తే, మరీ ఆకలేస్తే, అమాంతం వాడింట్లో జొరబడి పోయి, వాడు వొండుకున్న కూడంతా తినేసేసి, వాణ్ణీ వాడి పెళ్లాన్నీ బయటికి తరుమేసేసి, పోయి వాడి పందిరిపట్టె మంచం మీద తను పడుకుంటాడని వాడి భయం. ఆ భయం మాత్రం వాడికెందుకుండాలి? దబ్బిడ్చి పోలీసుల్ని కాపలాపెట్టుకోనే పెట్టుకున్నాడుగా? ఒకవేళ పోలీసు లంటే కూడా వాడికి అనుమానం పుట్టుకొస్తోందేమో!

II

ఆసలీ గంగానమ్మగుళ్లో ఇంకెవరూ లేపుగా: పోనీ. యీ చెత్తా చెదారం అంతా పూడదీసి అవతల పారేసేస్తే. మొండిమొలతో వుంటే మాత్రం తన్నెవరు చూస్తారు ఆ చీకట్లో.

'చత్! పీడా విరగడైపోయింది. ప్రాణం హాయిగా వుంది. చెత్తా చెదారం అంతా ఒక్కసారి వొలిపోయి, ప్రాణం చిక్కు దీసుకున్నట్టుగా వుంది. ఎంత స్వేచ్ఛగావుందీ!....అరె....కొంచెం....చలిచలిగా వున్నట్టుందే! తలుపులు ఊతకలెత్తేసి గర్భగుళ్లో దూరేసే హాయిగా వుంటుంది.

'ఓసీ! ఇన్నాళ్లూ నే నిలా ఈ చీకట్లో వస్తుంటే. నువ్వు లోపల అమృదంపీప మొకటి బెట్టకుని వెలుగుతున్నావన్నమాట!....మొగమొండా వాణ్ణి నేనిలా దిసమొలతో వస్తుంటే. యేపిచ్చి ఇంతింత దయ్యపుకళ్లు బెట్టుకొని నావంక అలా చూసి కులుకుతున్నావూ?....నీ కర్మ....నీకు మొగుడూ లేడు, నాకు పెళ్లామూ లేదు, ఈ గబ్బిలాల బిలంలో రాత్రిళ్లు నీకు నేనూ, నాకు నువ్వూ. మన ముళ్ల కిరీటం వొదిలిపోయింది. నా తల్లో నా స్వబుద్ధీ, స్వలోకం—చేతిలో ఈ బాకూ—నామార్గం. ఇప్పుడు ఎలెక్ట్రిక్ దీపాలువేసిన రాజబాటలా ఎంత దివ్యంగా కనుపిస్తోందీ!'

III

"అమ్మో! యెవరు నువ్వు ఇక్కడికెట్టా వొచ్చావ్?—బ్రహ్మరాక్షసిలా చేతిలో ఆ కత్తేమిటి?"

"నోరెత్తితే కూనీ చేసేస్తాను; బయల్దేరు; నాకు ఆడది కావాలి; నువ్వు అందంగా వున్నావ్"—

"అమ్మో! నే రాను."

"రాకపోతే చస్తావ్: అవతల గదిలో వాడు తాగి తసమిసలాడుతుంటే పీక నులిపి కూనీ చేసేశాను."

"అఁ!...."

"ఇనప్పెట్టె తీసి, ఉన్నదీ మన్నదీ సంగ్రహం చేసుకు పోతున్నాను. ఇదుగో మూట, చూశావా?—నువ్విక్కడున్నావా ఈ కూనీకేసు నీ పీకె మీదికొచ్చేస్తుంది. పద! ముందు కిదులు. అనవసరంగా ఎందుకు ప్రాణాలు తీసేసుకుంటావ్?"—

"చంపుతావేమో?"

"పిచ్చా?—నాకు ఆడది కావాలని చెప్పటం లేదూ?"—

"ఎలా...పారిపోయేదీ!"



తాత్కాలిక గవర్నరుజనరల్ సి. రాజగోపాలాచారి, సర్దార్ వల్లభాయిపటేల్, శ్రీమతి మనిబేన్ పటేలు మొదలైనవారితో పాలం విమానాశ్రయం వద్దనున్నప్పుడు తీసిన చిత్రం.

గతింతే! నువ్వో రాతిముహం. నేనో రప్పముండా కొడుకూ,....ఆ వుత్తరీయం విప్పి ఇలా తగలెయ్!....అఁ! రాతికి నీకు సిగ్గేమిటి?—

'ఈ ఉత్తరీయం చుట్టుకుంటే ఎంత వెచ్చగా వుందీ! ఈ కాస్త వేడికే హాయిగా గుండెల్లోకి ప్రాణాలెలా జేరుకుంటున్నయ్! వొంట్లో గడ్డకట్టుకు పోయిన రక్తంకూడా కరిగి వెచ్చబడుతోందే! బ్రతగ్గలిగితే హాయిగానే వుండేటట్టుంది!

'ఈ మేడరపెట్టెలో ఇంకా యేమేమున్నాయో?....ఇంకేం!....ఇందులో ఇంకా రెండుత్తరీయాలున్నాయి! సరే పైమీది కొకటీ, నెత్తిమీది కొకటీ. అరే! ఈ కతేమిటి!—వేటల్ని నరికేందుకుగావన్ను. సరే. ఇది మనదగ్గిర వుంటం యెందుకేనామంచిది.

'కాయకష్టంచేసి బ్రతకాలని యెంతప్రయత్నించినా బ్రతుకు తెరువులేకుండా చేశారు. ఎంత కష్టించి చదువుకున్నాను. ప్రయోజన మేమిటి? వాళ్ళ చుట్టాలేమిటో, వాళ బంధువులేమిటో—ఈ దేశాన్ని సంగతి వాళ్లకేం బట్టింది? పైగావో చెంప నేను డొక్కలు మాడి చస్తుంటే, వాళ్లంతా వో ప్రక్క కొల్లగొట్టుకు తింటూనే, నాకు—నీతి, సత్యం, ధర్మం, అహింసా, దొంగతనం మహాపాపం,—అంటూ, ఈ చెత్తా చెదారం, నాతలచుట్టూ చుట్టి నాకు పిచ్చెత్తించారు. ఈ రాత్రితో ఆ కచాటీ అంతా దులిపి వొదిలించేసుకున్నాను. ఆ దిక్కుమాలిన

"చెపుతాగా—బయల్దేరు"

"ఒళ్లు తెలియకుండా తాగాను....లేస్తే....తూలి పడిపోతానేమో?"

"రెక్క బట్టుకుంటాను! నెమ్మదిగా లేచిరా,"

"ప్రొద్దున్నే, ఈ కూనీకేసు ఆఘోకి తియ్యరూ? పోలీసులు మన్ని పనిగడతారేమో?—ఎక్కడికి పారిపోదాం?—"

"ప్రొద్దున్నేవచ్చి డాక్టరు పరీక్షచేసి 'తెగదాగి చచ్చా'డని సర్టిఫై చేసాడు. వీడి పెళ్లాం ఊరిమీద తిరిగి తెల్లారు యూముకు కొంపకి జేరుకుని, ఆ సినంతా అది చూసుకుంటుంది—దాని నెత్తిమీదికి రకుండా కోటీశ్వరుడి పెళ్లాన్ని కోర్టు కీడుస్తారా పోలీసులు? ఆ బెంగ నీ కెందుకు; పద."

IV

"ఇంకలోకే మళ్లా పేరెందుకు మార్చుకున్నారూ?"

"ఊరో?"

"ఊరు మారాలి సొచ్చిందిగా."

"ఊరుమారాలి సొస్తే, పేరు, మారాల్సిరాదూ? ఒకొక్కరూ సీతో మన జీవితంలో ఒకొక మార్పు: ఒకొక్కకి శేబరం మనం పై కెక్కటానికి ఒకొక్క నిచ్చెనవెట్టు, ఒకొక్క హత్యతో ఒకొక్క ఊరు, ఒకొక్క పేరూ మార్పు: నా అసలు పేరేమిటో కూడా నా కిప్పుడు జ్ఞాపకం లేకుండా పోయింది! దాన్ని నే నెప్పుడూ ఉపయోగించుకోనే లేదు!"

"మీ చరిత్ర తలుచుకుంటూంటే నా ఒళ్లు జలదరిస్తోంది; ఎన్ని దురాగతాలు! అమ్మయ్యో! ఒక్కసారి వెనక్కుతిరిగి చూసుకోండి"

"వెనక్కు తిరిగి చూడకు, మనకి మనమే దయ్యాల్లా, పిశాచాల్లా, బ్రహ్మరాక్షసుల్లా కనుపించి, గుండె పగిలి చచి పోతాం, ఎప్పటి కప్పుడు గతాన్ని నరికేసుకుని, నీ స్మృతి పథంనుంచి, కిటికీలోనుంచి విసిరి బుచ్చుకుని బయటికి అజ్ఞాతపథంలోకి, అంధకారంలోకి దూరంగా గిరవాటేసేస్తూ వుండు. సాచెయ్యి బలగా ట్టుకుని, ధైర్యంగా ముందుకు అంగులెయ్! వెలుగులోకి భవిష్యత్తులోకినడు. పిరికితనం మానెయ్!"

"పోనీ; ఇప్పణ్ణుంచైనా, మన మీ హింసాకాండ మానేసేసి, హాయిగా బ్రతగ్గూడదూ? మనకి కావలసినంత వుందిగా. మీ గడ్డం బుచ్చుకు బ్రతిమిలాడతాను—మనస్సుకు శాంతి చేకూర్చుకోండి! కారుణ్యం వహించండి."

"హ హ హ!! కారుణ్యం—నాకేం కారుణ్యం నేనో పెద్దపులినైపోయాను. కులటా! నీ కేవన్నా తల కొవ్వెక్కిందా?"—

"ఏడికూ అంత కోప మొచ్చిందీ? .... నే నేమన్నాననీ?... తెలియకేపో పొరపాట్న అన్నాను; క్షమించండి"

"ఉద్రేకంలో యేదో తొందరపడ్డట్టున్నాను రేవతీ! మరే మనుకోబోకు ఈపిశాచ సంఘంమీద నా కున్నమంట నీ కర్థంగాదు. ఈ హింసాకాండ నేను మానుకోలేను. ఆసాంతం యీ చిత్రవధలు ఇలా జరిగి పోతూ వుండవలసిందే... రేవతీ! నావి కిరాతాలంటున్నావు గాని, ఈ కిరాతాలు చేతగాక మొదట్లో నే నెంత నరక మనుభవించానో నీ కేమన్నా తెలుసా?"—

"పట్టు బడతారేమో ననే భయం కొద్దీ అలా అన్నాను."

"పట్టుబడితే పది వేలు పారేస్తాను ఇప్పుడు నాకేం లెక్క! కూనీ చేస్తే మాత్రం బ్యాంకర్ మోహన్‌రావును ఒక సామాన్య హంతకుడుగా సిక్షవెయ్యటమే? గుండె చెంపా?—

"అయితే ఈ మేడెవరిది?"

"ఎవరి దేవిటి? మొన్నే—కొన్నాను"

"అమ్మో! ఇంత మేడా, కొనెయ్యడమే!—ఎంత కెట్టీ?"—

"అఁ! యెంత ఓ లక్ష"

"లక్ష రుపాయిలే! మని ద్దరికి ఇంత మేడెందుకూ?"

"వ్యాపారా లన్నిటికీ ఆఫీసులు కావొద్దూ?"

"ఏం వ్యాపారాలూ?"—

"ఒక టేమిటి? తెల్లారే టప్పటికి చూడరాదూ, ఎన్ని బోర్డులు వెలుస్తాయో!"

"మీ రేం మనుష్యులండీ!"

"గడచిన చరిత్ర మరిచేసి, రాణీలా హాయిగా బ్రతుకు; కొంప తీసి నౌకర్లతో నోరు జారావా.."

"అమ్మో! ఇంకేమన్నా వుందా!"

"అఁ! జాగ్రత్త!"

"అది సరేగానీ, నాలుగు దిన పత్రికలు, నాలుగు భాషల్లో, ఒక్కసారి తీసుకొస్తున్నారని, నౌకర్లంతా అనుకుంటున్నా రేమిటీ?"

"అవును—"

"అయ్యో బాబోయ్! ఎందుకీ హైరానంతా?"

"నాకేం హైరాను; హైరాను పడేవాళ్లు డబ్బుచ్చుకు కూలి చేసే ఎడిటర్లూ, ప్రెస్ పనివాళ్లూ. నాకు హైరానేమిటి నీ ముఖం?"

"అసలెందుకీ హంగామా అంతా?"

"వచ్చే సంవత్సరం ఈ రాష్ట్రానికి ప్రధాని కాబోతున్నాను"

"అయ్యో బాబోయ్! అయి?"

"శాసనాలు చేస్తాను—ధర్మ శాసనాలు—తెలిసిందా?"

"ఏమిటీ! మీరా! న్యాయ శాసనాలు చెయ్యటమా!"

"అఁ! నేనే—ఇంకా చిన్న పిల్లలు చదువుకునే బళ్లల్లో నేనూ కొన్ని దొంగ రాతలు గోడలమీద వ్రాయిస్తాను."

"ఏం?"

"సత్యం వద; ధర్మం చర, అహింసా పరమో ధర్మః; దొంగతనము చేయరాదు; జీవహింస చేయరాదు; దేవుని యందు భక్తి వుంచు,—ఏం? చాలా, ఇంకా చెప్పాలా?"

"చప్పుండి; ఇంకాకా వచ్చి ఆగటమెందుకు?"


"వ్యభిచారము మహాపాపము."

"ఎందు కిదంతా?"

"తెల్లవాళ్ల జాతిలోకి నేను జేరుకున్నాను—వచ్చే జాతినంతా పట్టి నాయనమ్మ గొట్టెంమందక్రింద తయారుచేస్తేగాని, ఇష్టం వచ్చినట్టు పీక్కుతింటానికి వీలుండదు."


"దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా వుంది. ఇదంతా!"

''బొమ్మలులేనిదేశం.



కైలాసవాసి సాంబసదాశివుడు







'అయం ముహూర్త సుముహూర్తమస్తు'...కల్యాణ మంటపంమీద వధూవరులు-పెండ్లి పెద్దలు



గానసుదంరి పాటకచ్చేరి, పాడేది ఏంరాగమో?...



పల్లెవాడలోని గొల్లజంట




సమగ్రమైన...


నాగరికతలేనికూపం"



రాజ తాండవం



అగ్రహారం - ఆరామం - ఆలయం



ఉపదేవతలు



హంగుచేసిన భోగంమేళం



షన్నాయిమేళం



వృద్ధ విప్రదంపతులు



అమ్మగారికి ఆవేశం - అయ్యగారి భూతవైద్యం

బాలానందం

పిల్లలు వ్రాసిన కథలు ●

మందారపువ్వులు

పూర్వకాలమున ఒక పేదరాసి పెద్దమ్మ వుండేది. ఆమెకు ఒక కూతురు. పెద్దమ్మ ఎప్పుడును అడవినుండి మందారపువ్వులు తెచ్చేదిది. ఒక రోజున మందారపువ్వులు తెచ్చి ఎండబెట్టి తన కూతురును కాపలా ఉండమన్నది. "జాగ్రత్త! ఒక్క పువ్వు కూడా పోరాదు" అని చెప్పి తను వెళ్ళిపోయినది. ఆ అమ్మాయి అచ్చటనే కూర్చుని ఒక పూవు కూడా పోకుండా చూచి గంపలోనికి ఎత్తినది. ఎత్తి ఇంట్లో పెట్టినది. కొంచెము సేపు అయినతరువాత పెద్దమ్మ వచ్చి చూచుసరికి పూలు గంపలో సగమునకు వున్నవి.

అప్పుడు తన బిడ్డదగ్గరకు వెళ్ళి "కష్టపడి కోసుకువచ్చినాను. సరిగా చూడకుండా ఉన్నావు. అన్ని పువ్వులు పోయినవి" అన్నది.

అప్పుడు బిడ్డ "నేను ఏమీ పోగొట్టలేదు" అన్నది. "ఇంకనూ అబద్ధము ఆడెదవా?" అని గట్టిగా బిడ్డను కొట్టినది.

పాపము బిడ్డ మంచముమీద పరుండినది. "నీకు అన్నము కూడ పెట్టనుపో!", అన్నది పెద్దమ్మ. అని బిడ్డవంక చూడకుండా అడవికి పోయి అచ్చట మందార పువ్వులు కోసి, అడవిలోనే ఎండబెట్టి, తనే కాపలా కూర్చున్నది. కొంతకాలము అయినాక గంపలోకి ఎత్తిచూచినది.


ఎత్తి చూచినను సగమునకే వచ్చినవి. అప్పుడు పెద్దమ్మ తన తప్పు తెలిసికొన్నది. మందారపువ్వులు ఎండబెట్టి కొంతకాలము పోయినతరువాత తీసిన సగమునకే వచ్చును అనుకొనెను. ఇంతలో తన బిడ్డ జ్ఞాపకము వచ్చెను. నా బిడ్డకు మల్లె పూవులు ఇష్టము; తీసుకుపోయెదను అని, మరియొక చిన్న బుట్టలో మల్లె పూవులు తీసుకొని పోయెను.

ఇంటికి వెళ్ళుసరికి తన బిడ్డ లేదు. ఎంత వెదకినను ఇంట్లో కనిపించలేదు. అప్పుడు పెద్దమ్మ ఒక దీపము, మల్లె పూవులబుట్ట పుచ్చుకొని వెళ్లెను. కొండలు, గట్టులు, పొదలు, చెరువులు అన్నియూ వెతికెను. తన బిడ్డ కనపడలేదు.

అప్పుడు పెద్దమ్మ "హా! నా బిడ్డా! కనరావా! అని" "ఏడ్చి ఇదిగో నీకు ఇష్టమైన పువ్వులు" అని ఆ బుట్టను ఆకాశముమీదకి విసరివేసెను. అవి ఆ బిడ్డ అందుకొనెను. అవియే మనకు నక్షత్రములుకింద కనబడుచున్నవి.

చావలి కృష్ణ

3. ఫారము: 12 సం. వయస్సు.



"పిల్లల దీపావళి"

బాలగేయాలు

శ్రీ చింతా దీక్షితులు

(సంపాదించినవి)

1

చింతకాయ బొంతకాయ
చిగురు మామిడికాయ
కొల్లేటి వంకాయ
కొమ్మ నిమ్మపండు
వాలికిలి గుంటలో
వెలిగిలు మెయ్యగా
ఒక్కటే రాలగా
ఒంటి పువ్వు పుయ్యగా
తాటాకు చివ్వడే
కోట వెలుగు.

2

గోడమీది రూపాయి
నీమొగుడు సిపాయి
తురకాళ్లింట్లో ఉలిపువ్వ
మావాళ్లింట్లో ఎల్లిపువ్వు

3

అప్పటి ఇప్పటి తాండ్ర
అయ్యవారి తాండ్ర
అలీ బిల్లీ తాండ్ర
అయ్యవారి కొప్పులో తాచుపాము.

4

ఓయి ఓయి నాయడా
వంగపండు నాయడా
గుడ్డి గుర్ర మెక్కినావు
నక్కపాలు పితికినావు
చిక్కాన్ని పోసినావు
జేపని మండ బరిణింక తుప్ప
తుప్ప కాదురా తుమ్మెదమాను
మాను కాదురా మామిడికొమ్మ
కొమ్మ కాదురా కొడవలిగిద్ద
గిద్ద కాదురా గిద్దెడు చల్ల
చల్లకాదురా బెల్లాపచ్చు.

5

గట్టుమీదా కోడి గవ్వల్లా కోడి
తొక్కితే తొంభయి పిలల్లా కోడి
అడుక్కో బుడుక్కో నంబారుబుడ్డి

6

ఆట మాణిక్యమే పాటమాణిక్యం
నట్టింట అమ్మాయి రత్నమాణిక్యం
అమ్మాయిమామలు ఎటువంటివారు
చెవిచెవికి బారెడేసి కమలాలవారు
అడ్డపాగాలవారు అంగీలవారు
వేడుకగుర్రా నెక్కి వేటాడువారు
ఆడంగముద్దు పాడంగముద్దు
నట్టింట అమ్మాయి నవ్వంగముద్దు
(పెద్దాపురం)

గోనుగోను గొలమంద
పాలుపోసి పండబెట్టు అల్లల్లా.
(కనిగిరి)

మాఅప్పసవరము మాకు తే
మా దేముడి గిన్నె మాకు తే



పలప్పనెడవులలో నూత్న ప్రాథమిక పాఠశాల

పిల్లల నవల:



వేళ్ళాడే బొమ్మ

శ్రీ సత్యనారాయణ శ్రీవాత్సవ

౧౦

పినాకయ్య బొమ్మలాటలోపలికి వెళ్లే టప్పటికి ఒక గమ్మత్తు జరిగింది.

అప్పటికే తెఱ ఎత్తేశారు. గుడ్డ తెరమీద గంధోళిగాడూ, బంగారక్కా వచ్చి పోట్లాడుకొంటున్నారు. సభాసదు లంతా విరగబడి నవ్వుతున్నారు. ఆ బొమ్మలు రెండూ తిట్టుకొని, కొట్టుకొని క్రిందామీదాపడుతూవుంటే, వీళ్లకి నవ్వులాటగా ఉంది. "అరరే! వచ్చే నదిగో పినాకయ్యా" అంటూ ఆ బొమ్మలు కేకలేశాయి. వెనకాతల వున్న పాటపాడే వాళ్లందరూ వెనక పాట అందుకొన్నారు.

"అదిగో మన బొమ్మ తమ్ముడు వచ్చాడు"అని తెఱనుంచి తమరెక్కలు దింపి, "పినాకా రా, ఇలా రా" అని పిలిచారు. గంధోళిగాడు మరీ గట్టిగా పిలిచాడు. దానితో పినాకయ్య, వెనకనించి తెఱదగ్గరికి ఎగిరి గంతు వేశాడు. దానితో నాటకశాల అంతా ఎంత గడబిడ అయిందో! ఆ తోలు బొమ్మలాటలోని బొమ్మ లన్నీ, పినాకయ్యని పట్టుకొని కౌగిలించుకొని, ముద్దుపెట్టుకొని ఎంతో హడావిడి చేశారు, లోపల బొమ్మ లన్నింటికి యీ కొత్త తమ్ముడు కలిసినందుకు సరదాగా ఉంది.

కాని బొమ్మలాట ఆగిపోయినందుకు బయట ఉన్న సభికులకు కోపం వచ్చి కేకలేశారు.

"ఆట వెయ్యండోయ్, ఆట!" అన్నారు.

బొమ్మలు ఆట వెయ్యడానికి బదులు పినాకయ్యని భుజంమీద ఎక్కించుకొని మరింత సరదాగా ఆడడం మొదలుపెట్టారు. ఈ గడబిడలో ఆట ఆడించే మనిషి వచ్చాడు. వాడు పొడుగ్గా సన్నంగా గెడకఱ్ఱలాగ ఉన్నాడు. వాడినిచూస్తేనే భయం వేస్తుంది—నల్లని గెడ్డం వాడున్నూ. అది ఎంత పొడుగో తెలుసా! వాడంత పొడుగునా క్రిందకి వేలాడుతూ ఒకోసారి నడిచేటప్పుడు కాళ్లకి తగుల్తుంది కూడాను. ఇంక వాడి నోరు చెఱకు పొయ్యిలాగ విప్పళించుకొని ఉంది. ఆ కళ్లు రెండూ ఎఱ్ఱ లాంతర్లులాగ వెలుగుతున్నాయి. వాడి చేతిలో పెద్ద కొరడా విసురుతున్నాడు. అది నక్కతోకలతోటీ, పాముబుఱ్ఱలతోటీ చేసిన కొరడా!

వాడు చటుక్కున వచ్చేటప్పటికి ఎవ్వరూ కిక్కురు మనలేదు. చీమ చిటుకుమంటే వినిపించే నిశ్శబ్దం! ఆ బొమ్మలన్నీ, గాలిలో ఆకులలాగ అల్లాడిపోయారు. బోదురుకప్పటికి రొంప పట్టితే ఎలాగ ఉంటుందో అలాంటి గొంతుకతో గర్జించాడు.

"ఇక్కడికి ఎందుకొచ్చావు పినాకయ్యా, మా ఆట పాడుచెయ్యడానికి"

"నేను ఆట పాడుచెయ్యాలని రాలేదు బాబూ; నా తప్పేమీ లేదు?"

"నీ తప్పు లేదూ? ఈ వేళరాత్రి కనుక్కుంటాను ఉండు నీ పని"

ఆట అయిపోయింది. ఆటగాడు వంటింటిలోకి వెళ్లాడు. పొయ్యిమీద కూర ఉడుకుతోంది. సరియైన మంట తగలక పచ్చబడిపోతోంది. దానికితగిన వంటచెరకు లేదు. ఏయ్! గంధోళి ఏడీ, ఆ మేకుకి వేలాడదీసిన కఱ్ఱ బొమ్మని తీసుకురా! ఆ కఱ్ఱ పొడి కఱ్ఱ; పొయ్యిలో పెట్టితే క్షణంలో వంట అవుతుంది. ముందు గంధోళి వెనక్కి తీశాడు. కాని వాడు కళ్లెఱ్ఱజేసేటప్పటికి, గంధోళి వెళ్లి పినాకయ్యని లాగుకొని వచ్చాడు. పినాకయ్య నెత్తీ, కాళ్లూ మొత్తుకొంటూ పెద్దగా అరుస్తున్నాడు.

"నాన్నోయ్, నాన్నా! నన్ను రక్షించవూ? వీళ్లు నన్ను చంపేస్తున్నారు నాన్నా, నాన్నోయ్!" అని బిగ్గరగా ఏడ్చాడు.

౧౧

ఆ యగ్గిరాముడు - (ఆటగాడు) వాడి గెడ్డమూ, వాడూ, భయంకరంగా కనిపిస్తాడు. కాని నిజంగా కనిపించేటంత చెడ్డవాడు కాడు. నన్ను చంపకు బాబోయ్! అని పినాకయ్య కేకలు వేయడం విని జాలి వేసింది; కాని,జాలి, పైకి కనబడనీయకూడ దనుకున్నాడు. చివరికి అపుకోలేక, గట్టిగా తుమ్ము తుమ్మాడు. ఇంతలో గంధోళిగాడు విచారంగా దిగాలుపడిన మొగంతో గోడకి చేరబడి, క్రిందికి చూస్తూ నిలబడిఉన్నాడు. వాడికి తుమ్ము వినిపించగానే సంతోషం వచ్చింది. వెంటనే పినాకయ్య చెవుల్లో మెల్లిగా ఊదాడు:

"తమ్ముడూ, భయపడకు, ఆటగాడు తుమ్మేడంటే నీమీద జాలి పుట్టిందన్నమాట. ఇంక నువ్వు బ్రతికిపోయినట్టే!"

ఎవరికైనా జాలీ, విచారం వస్తే ఏడుస్తారు; కళ్లు తుడుచుకొంటారు; అయ్యో అంటారు; మన అగ్గిరాముడికిమాత్రం ఎవడిమీదనైనా దయ పుట్టితే తుమ్ముతాడు. అదీ మంచిదే మరి.

తుమ్మిన తర్వాత, అగ్గిరాముడు బొంగురుగొంతుకతో పినాకయ్యని కేక లేశాడు.

"ఏయ్!, ఏడవకు, ఇంకా అలాగ ఏడుస్తూవుంటే నా కడుపులో ఎలాగో ఉంటుంది. నాకు ఆపలేనం...అ...చ్చ చచ్, హా...చ్ చ్చ చ్చ చ్చ" ఈ మాటు రెండు తుమ్ములు వచ్చాయి.

"మీ పుణ్యమా అంటూ వెయ్యేళ్లు వర్ధిల్లు బాబూ!" అని పినాకయ్య అన్నాడు.

"సరేగాని, మీ నాన్నా, అమ్మా ఉన్నారా?" అని అగ్గిరాముడు అడిగాడు.

"మానాన్న, ఉన్నాడు; మా యమ్మ ఎలా గుంటుందో ఎరగను"

"నిన్ను పొయ్యిలో పారేస్తే మీ నాన్న ఎంత బెంగపెట్టుకొనేవాడో! పాపం! అచ్చ చ్చ, హచ్చ చ్చ అచ్చచ్చ—" మూడు సారులు తుమ్మాడు.

"మీరు చాల మంచివారండీ" అన్నాడు పినాకయ్య.

"ఏం మంచిలే, పొయ్యిమీద కూర పెట్టారు. పుల్లలు తడిసివున్నాయి; పోనీ పొడిగా వున్నావు నిన్ను మంట పెడదాం అనుకొన్నాను. నిన్ను వదిలేశాను. పోనీ మా బొమ్మలలో ఎవరినైనా పెడతాను.

"ఎవరురా అక్కడ?" అని పిలిచేటప్పటికి, ఇద్దరు కఱ్ఱపోలీసువాళ్లు టకాటకా వచ్చి నిలవబడ్డారు. వాళ్లు పొడుగ్గా, సన్నంగా ఉన్నారు; తలమీద ఎఱ్ఱటోపీలు, చేతుల్లో విచ్చు కత్తులూ! "ఏయ్, పోలీసువాళ్లూ, మీరు వెళ్లి గంధోళిగాణ్ణి కట్టి తీసుకురండి; తీసుకొచ్చి పొయ్యిలో పారవెయ్యండి" అన్నాడు. పాపం ఆగంధోళాగాడికి భయంచేత కాళ్లు మెలివేసుకొని పోయాయి. బోర్లపడ్డాడు.

ఇది చూడగానే, పినాకయ్య, అగ్గిరాముడు కాళ్లమీద ఏడుస్తూ వాడి పొడుగు గెడ్డాన్ని తన కన్నీళ్లతో తడపడం మొదలు పెట్టాడు.

"దయపెట్టండి మహారాజా" అన్నాడు. "ఇక్కడ మహారాజు లెవ్వరూ లేరు". అన్నాడు ఆటగాడు.

"దయచూపు మహామంత్రీ!"

"ఇక్కడ మహామంత్రు లెవ్వరూ లేరు"


"దయచూపవు సేనాపతీ!"

"ఇక్కడ సేనాపతు లెవ్వరూ లేరు"


"దయచూపు మహాశయా!"

మహాశయా అనేటప్పటికి, అగ్గిరాముడి మనస్సు కరిగింది. పెదవి కఱచిపెట్టి—





మద్రాసు కార్పొరేషను, కార్మికుల పిల్లలకోసం 45,000 రూపాయల ఖర్చుతో పిల్లలభోజనగృహం కట్టించిచారు. భవనంలో పిల్లలు భోజనాదులు, చేస్తూ, ఆటలాడుకొంటూన్న చిత్రాలు.



గ్రంథ పరిచయము

"చెన్నపట్నం-తెలుగుపట్నం"
[మొదటి భాగం]

రచన: రామచంద్రుని వెంకటప్ప—15, విస్కాట్ రోడ్డు, రాయపేట, మద్రాసు. వెల రూ 1-8-0.

భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణానికి పెద్ద పట్నాలు ప్రతిబంధకాలయినవి. బొంబాయి, చెన్నపట్నం ఇందుకు నిదర్శనాలు. చారిత్రకంగా బొంబాయి మహారాష్ట్రులది; చెన్నపట్నం తెలుగువారిది. కాని ప్రస్తుతం ఎక్కువ జనాభా బొంబాయిలో గుజరాతీలు, చెన్నపట్నంలో తమిళులు. ఈ రెండు రాజధానలలోను ఇప్పటి వరకు రాష్ట్రవిభజన జరుగకపోవటానికి ఈ నగరాలకు సంబంధించిన సమస్యలే ముఖ్యకారణం.

చెన్నపట్నం తెలుగుపట్నమే నని ఆందోళన చేసినంతమాత్రాన సరిపోదు. త్వరలో ఏర్పడబోతున్న సరిహద్దు నిర్ణయ విచారణ సంఘం ముందు ఈ విషయాన్ని నిరూపించటానికి కావలసిన సాక్ష్యాన్ని సిద్ధంచేసి తీరాలి. ఈ ఉద్దేశాన్ని మనసులో పెట్టుకొని గ్రంథకర్త దీక్షతో చేసిన పరిశోధనా ఫలితమే ఈ రచన. ఈ పుస్తకంలోని ముఖ్య విషయాలను వ్యాస రూపంగా ఆంధ్ర వారపత్రికలో ఇదివరకే ప్రకటించారు.

ఈ పట్నం 'ఆంధ్రులదా, అరవలదా' అనే విషయం కేవలం ఇప్పటి జనాభా లెక్కలమీద తేల్చగల సమస్య కాదని గ్రంథకర్త దృఢ విశ్వాసం. బ్రతుకుతెరువులకోసం బయటినుంచి వచ్చినవాళ్ళు పూరిసే కబళించచూడడం సమంజసంకాదు. పట్నంపు పుట్టుపూర్వోత్తరాలు ఏమిటో, అప్పటి వాస్తవ్యు లెవరో, దీని అభివృద్ధికి ఎవరు కారకులో, పరిపాలనలో ఎవరు తోడ్పడ్డారో, వర్తకం యావత్తూ ఎవరు నిర్వహించారో, పరిశ్రమలు ఎవరి అధీనంలో ఉన్నయ్యో అనే అంశాలను పరిశీలించక తీర్పు చెప్పటానికి వీలులేదు. వీటన్నిటినిబట్టి నిష్పాక్షికంగా విచారించిచూస్తే చెన్నపట్నం తెలుగుపట్నమే నని నిర్ధారణ చేయటానికి ప్రబలమైన సాక్ష్యం వున్నదని గ్రంథకర్త సప్రమాణకంగా వివరించాడు.

చెన్నపట్నాన్ని బ్రిటిష్ కంపెనీవారికి ఇచ్చిన నాయకుడు దేశద్రోహి ఔనా, కాదా అనే చర్చ, అవసరానికి మించిన చారిత్రక ఘట్టాలు—మొదలైన కొన్ని విషయాలను అంత దీర్ఘంగా చర్చించి ఉండనక్కరలేదు. పేర్కొన్న అనేకవివరాలకు ప్రమాణాలు, ఆధారాలు ఏమిటో, ఆయాపేజీలలోనే క్రింద భాగాన ఉదహరిస్తే ఇంకా బాగుండేది. మొత్తంమీద ప్రతి తెలుగువాడు చదువవలసిన పుస్తకం.

'రవి'

* * *

'చిత్రసీమ'

రచన: టాల్‌స్టాయి; అనుకరణ:-శ్రీ ముద్దా విశ్వనాథం; జయనికేతనం పబ్లిషర్సు, మదరాసు 7; వెల రూ. 1-.

ప్రఖ్యాత రష్యను రచయిత టాల్‌స్టాయి వ్రాసిన "ఇవాన్ ది ఫూల్" అనే నవలను మూలంగా తీసికొని ముద్దా విశ్వనాథంగారు "చిత్రసీమ"ను తెలుగులో సృష్టించారు. ఈ కథను ఇంగ్లీషులో చదివిన గాంధీమహాత్ముడు తమ జీవితానికి ఆదర్శజ్యోతి అయిన అద్భుత గాథ అని ప్రస్తుతించారట. అధికార వ్యామోహం, ధనకాంక్ష, ప్రతీకారవాంఛ మొదలైనవి శాంతిసౌఖ్యాలకు అవరోధకాలనీ; సహనంవల్లనూ, పరోపకారంవల్లనూ, ఆత్మవిశ్వాసంవల్లనూ ఎంతటి పశుబలాన్ని అయినా ప్రతిఘటించవచ్చుననీ—ఇత్యాది ధర్మసూత్రాలు ఈ కల్పితకథలో నిబిడీకృతమై ఉండడమే మహాత్ముని మెప్పుడలకు కారణం.

కథలోని ముఖ్యపాత్ర—సుకృతి, అసాధారణ వ్యక్తి. కేవలం బుద్ధివంటివాడు. దేనినీ ఆరించడు; దేనికీ భ్రాంగడు. ఆడంబరంలేని ధర్మబద్ధుడు. అర్థం చేసికోలేనివాళ్ళు అతడిని వెఱ్ఱి వెంగళాయ అనేవాళ్ళు. సుకృతిని సత్యమార్గం నుంచి తప్పించడానికి ప్రయత్నించిన శక్తులన్నిటిని జయించి, ఆ శక్తులనుంచే మహత్తరమైన బలాన్ని సంపాదిస్తాడు. చివరకు ఒక దేశానికి ప్రభువై రామరాజ్యాన్ని నిర్మిస్తాడు. స్థూలంగా ఇంతే ఈ కథ.

అనువాదం కష్టమైనది; గొప్పరచనల అనుకరణ మరీ కష్టతరమైనవి. రసవంతంగా కథను నడపడం, సజీవంగా పాత్రలను వ్యక్తీకరించటం సులభమైనవికావు. ఈ విషయంలో విశ్వనాథంగారి కృషి ప్రశంసనీయమే. "మల్లిక యను పిల్ల యోర్తు"..."నీవిప్పటిమోస్తరుగ తృప్తాత్ముడవైయుంట ఎంతమాత్రము తగదు"...ఈలాంటి కృత్రిమ గ్రాంథికంలోకంటె సహజమైన వ్యావహారికంలో వ్రాసిఉంటే ఎంతో ఒప్పిఉండేది.

'రవి'

'గోడ్డకాడ'
(పిల్లల నాటకం)

రచన: తెన్నేటి సూరి; ప్రజాశక్తి ప్రచురణాలయం, బెజవాడ. వెల: అ 6.

ప్రత్యేకంగా ప్రచారంకోసమని తయారయే సాహిత్యానికి చెందుతుందీ నాటిక. జమీందారుల దురాగతాలు దీనిలోని కథావస్తువు. రైతుల పశువుల్ని దొంగిలించడంతో ప్రారంభమయి, మధ్యలో అరెస్టులను అందుకొని, స్త్రీలపైన పిల్లలమీద అత్యాచారాలతో అంతమవుతుంది. పాత్రలంతా పిల్లలే. పాటలు ఇంపుగా వున్నవి. కాని, కళకు, ప్రచారానికి చక్కని సామరస్యం ప్రకటించే రచనలు మాత్రమే జనరంజకమై ప్రయోజనకారి కాగలవని చెప్పక తప్పదు.

'రవి'

* * *

'చారుణి'

పాటిబండ మాధవశర్మ, ఎం. ఏ; శ్రీ బాపు గురుకులము, బాపునగర్, బెజవాడ. వెల ఒక రూపాయి.

ఈ పద్యరచన పదేళ్ళకుపూర్వం ఆరంభించబడి, కవితాభ్యాసంగానికి ఏర్పడిన అంతరాయాలవల్ల ఇన్నాళ్ళు మూలబడి ఇప్పటికి వెలువడిందని రచయితే చెప్పుతున్నాడు. 'రాజస్థాన కథావళి'లోని హమీరుగాథ దీనిలోని కథావస్తువు. పద్యాలనడక, పదాలపొందిక, ఇంపుగానే ఉన్నాయి. శృంగారఘట్టాలు వెగటుగా లేవు. ప్రబంధధోరణికి అలవాటుపడినవారికి ఈ చారుణి రంజకంగానే ఉంటుంది.

'రవి'

* * *

ఆచార్యరంగా

రచయితలు: శాస్త్రి వెంకట నరసయ్య, పాలపర్తి వెంకట సుబ్రహ్మణ్యం. సుందరరాం అండు సన్సు తెనాలి వారి ప్రచురణ. వెల 0-4-0. ఆచార్య రంగాగారి జీవితమును, ఆయన చేసిన దేశసేవను సంక్షిప్తముగ తెలియబరచు పుస్తకము. శైలి పాఠ్యపుస్తక గ్రాంథికము.

* * *

పుణ్యశ్లోకులు

విశ్వామిత్రుడు, నలుడు, యుధిష్ఠిరుడు,—శిబిచక్రవర్తి పంచాప కేశయ్యరుగారు ఆంగ్లమున రచించిన గ్రంథమునకు శ్రీ నాళ్య వేంకట శేషయ్యగారి అనువాదము. గ్రాంథికభాషలో పాఠ్యపుస్తక యోగ్యంగా అనువాదం చక్కగా నడిచింది. ప్రకాశకులు: బాదిల్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు. వెల 0-10-0.

* * *

అరుణాచల రమణుడు

భారద్వాజ వెంకటసుబ్బారావుగారు రచించి రమణాశ్రమమునుండి ప్రచురించిన గ్రంథము. రమణ మహర్షి జీవితమును, అవతారపురుషుడుగా ఆయనను శిష్యులు కొల్చుటకుగల కారణములను, ఆశ్రమము, శిష్యులు ఇత్యాది విశేషము లన్నిటిని గురించి వ్రాసిన గ్రంథము. శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై, వెల 0-12-0.

* * * *

చైనా నూతన ప్రజాస్వామికం:

మా-ట్సే-యాంగ్ రచన, అనువాదం శ్రీ శివయ్య. వెల రూపాయి. ప్రజాశక్తి ప్రచురణాలయం, బెజవాడ.

శ్రీ శివాజీ చరిత్ర

శ్రీ కొమర్రాజు వెంకట లక్ష్మణ రావుగారు రచించినది. పునర్ముద్రణము. వెల 3-0-0 శివాజీ వ్యక్తి, శీలములను ఆంగ్లేయుల దృష్ట్యా కాక, జాతీయ భారతీయ దృష్టితో, సత్యసిద్ధముగ పూర్వచరిత్రాంశయములను తరచి రచించిన జీవితచరిత్రము. భారతీయ మహాపురుషుడుగా శివాజీ ప్రాశస్త్యమును సరిగా గ్రహించుటకు ఈ గ్రంథ మతిప్రయోజన కరము. కాపీలకు: అభ్యుదయ ప్రెస్ గవర్నరుపేట, బెజవాడ.

* * *

వైదీక సంస్కృతి: కమ్యూనిజమూ

రచయిత: వంగల కృష్ణదత్తశర్మ రచయిత. కమ్యూనిస్టుపార్టీలో ఉండి రాష్ట్రీయ స్వయం సేవకసంఘంలో జేరబోతున్నందుకు చెప్పుకొన్న సంజాయిషీ లేఖ వ్యాసము, వెలలేదు.

* * *

బేసిక్ హిందూస్తానీ-తెలుగు బాల బోధిని

గ్రంథకర్త యలమంచిలి వెంకటప్పయ్యగారు. పబ్లిషర్సు: సుందరరాం అండు సన్సు. వెల 0-6-0.

* * *

జబానే హిందుస్తాన్

రచయితలు: వంకాయలపాటి శేషావతారం, లక్ష్మీనారాయణ, బి. ఏ. అండు సన్సు బెజవాడ వారి ప్రచురణ. హిందూస్తానీ బోధకై ఉద్దేశించిన ప్రథమ తరగతి పాఠ్యపుస్తకము. వెల తొమ్మిది అణాలు. కాపీలకు: వంకాయలపాటి శేషావతారం, శ్రీ శారదానికేతనం గుంటూరు.

* * *

కనీనికా నిదానము

రచయిత: డా. మృత్యింటి ఆంజనేయులుగారు. కంటి పాపను పరీక్షించి రోగమును గ్రహించ నేర్పువైద్య నిదాన గ్రంథము. ప్రకృతి కార్యాలయ ట్రస్టు, బెజవాడ వారు ప్రచురించినది. వెల రు. 6-0-0.

పెళ్ళాడే బొమ్మ

"నరే నీ కేం కావాలి చెప్పు"

"గంధోళీగాడిని రక్షించమని ప్రార్థిస్తున్నాను; వేడుకొంటున్నాను."

"నిన్ను వదలివేసినందుకు వాడినైనా పొయ్యిలో పెట్టకపోతే కూర ఎలాగ ఉడుకుతుంది ?"

"అయితే పోనీ లెండి; నన్నే పొయ్యిలో పెట్టండి. ఓభటులారా! నన్నే కట్టి యీ మంటలో పారవెయ్యండి. పాపం నా జతగాడు గంధోళిని ఎందుకు ఆ పొయ్యిలో వేసి,—నాకోసం అతడు చావడం ఎందుకు?"

ఈ మాటలు గట్టిగా పౌరుషంతో అనేటప్పటికి అక్కడి బొమ్మ లన్నీ ఏడవడం మొదలు పెట్టాయి. కర్రతో చేసిన పోలీసువాళ్ళకికూడా కళ్ళ వెంబడి నీళ్ళు బొటబొటా కారాయి. చంటి పిల్లలలాగ వెక్కి వెక్కి ఏడ్చారు.

ముందు అగ్గిరాముడు మంచుగడ్డలాగ చలించలేదు. తరువాత కొద్ది మనస్సు కరగింది. నాలు గైదు తుమ్ములు కొద్దిగా వచ్చాయి. పినాకయ్యని చేతుల్లోకి తీసుకొని "నువ్వు మంచివాడివిరా అబ్బాయి! ఎంత ధైర్యం! ఇలా రా, ఏదీ ఒక చిన్న ముద్దుపెట్టు" అనగా నేపినాకయ్య వాడి గడ్డం పట్టుకొని ఉడత చెట్టెక్కినట్టు ఎక్కి పైకిపెళ్లి గట్టిగా వాడిముక్కుమీద ముద్దుపెట్టాడు.

"నన్ను వదలివేసి నట్టేనా?" అని గంధోళిగాడు వినీ వినిపించనట్టు మెల్లిగా అడిగాడు. అగ్గిరాముడు, "వదిలేసినట్టే. ఈవేళకి ఈ ఉడికీ ఉడకని కూర తింటాను. మరి ఏంచేస్తాను" అన్నాడు. దానితో బొమ్మ లన్నింటికీ మరింక భయంలేదని సంతోషం కలిగింది. అవన్నీ నాటకశాలలోకి వెళ్లి తెఱవేసి దీపాలన్నీ వెలిగించి ఆడటం మొదలుపెట్టాయి. తెల్లవారేనరకు అలాగ ఆడుతూనే వున్నారు!

——

అంతర్జాతీయ రాజకీయాలు

(7-వ పేజీ తరువాయి)

గ్రస్తిపోయిన జనరల్ ఫ్రాంకో ఫేసిస్టు ప్రభుత్వాన్ని కూలద్రోయాలంటే ప్రజాస్వామ్య శక్తులు తమ బలసంపద నంతటినీ సమీకరించుకొని పెద్దపెట్టున విజృంభిస్తేనేగాని సాధ్యపడదు. ఇందుకు ఐక్యరాజ్య సమితికూడా అన్ని విధాలా రిపబ్లికన్ రహస్య దళాలకు ఇతోధికంగా సహాయపడాలి.

* * *

దక్షిణాఫ్రికా భారతీయ సమస్యపై ఇండియా, పాకిస్తాన్ యూనియన్ ప్రభుత్వాల మధ్య రౌండ్ టేబుల్ సమావేశం జరగడం అవసరమని భారతదేశం ప్రతిపాదించిన తీర్మానం మీద ఐక్యరాజ్యరాజకీయ సంఘంలో చర్చ సాగుతున్నది. సమితి ఆదేశాన్ని ధిక్కరించిన దక్షిణాఫ్రికాప్రభుత్వం అక్కడి భారతీయుల సమస్య కేవలం తమదేశానికి చెందిన ఆంతరంగికసమస్యమాత్రమేనని, ఇందులో సమితి జోక్యంకలిగించుకోడానికి ఎట్టి అధికారం లేదనీ వాదిస్తున్నది. ఈ సమస్యాపరిష్కారానికి భారతదేశం ఎన్ని ప్రతిపాదనలు చేసినప్పటికి దక్షిణాఫ్రికాప్రభుత్వం మొండి పట్టుదల చూపుచున్నదే గాని దారికి రావడంలేదు. భారత ప్రతినిధి ఎం. సి. సెటల్వాడ్ గారు సమస్యను సవ్యంగా పరిష్కరించుకుందామనే ఉద్దేశంతో ఎన్ని ప్రయత్నాలు చేసినా విఫలమైన మీదటనే భారతదేశం దక్షిణాఫ్రికాపై ఆర్థిక ఆంక్షలను ప్రయోగించడం సంభవించిందని విశదీకరించాడు. దక్షిణాఫ్రికాప్రభుత్వం భారతీయులపై ప్రయోగించిన జాతివిద్వేష శాసనాన్ని రద్దుచేసే పక్షంలో, భారతదేశం తక్షణమే ఆర్థికసంబంధాలను తిరిగి ఏర్పాటుచేసుకుంటుందని కూడా సెటల్వాడ్ అన్నాడు. పరస్పర సమాలోచనలకే ఇష్టపడని స్మట్స్ ప్రభుత్వం జాతివిద్వేష శాసనాన్ని బుద్ధిపూర్వకంగా రద్దుచేయడం అసంభవం. ఐక్యరాజ్యసమితి ఉదాసీనవైఖరిని మానివేసి, కఠిన వైఖరికి దిగితేనేగాని మార్షల్ స్మట్స్ లొంగిరాడు. బ్రిటన్, అమెరికాల ఆదేశానుసారం నడుస్తున్న ఐక్యరాజ్యసమితి కఠిన ధోరణి అవలంబిస్తుందనుకోవడం పొరపాటు. దక్షిణాఫ్రికాలో రెండున్నర లక్షల మంది భారతీయులకు జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను అరికట్టలేని ఈ సమితి ప్రపంచ శాంతి సమస్యలను ఏపాటి పరిష్కరించగలదో సందేహమే.

* * *

సంవత్సరం పొడుగునా సమావేశమవుతూ సత్వరమే పరిష్కారం కావలసిన ప్రపంచ సమస్యలన్నిటినీ జాగ్రతగా పరిశీలించడానికి ఐక్యరాజ్య "ఉపసమితి" (ఇదే చిన్న సమితి) ఒక దాన్ని ఏర్పాటు చేయడం అవసరమని అమెరికా విదేశమంత్రి జార్జి మార్షల్ చేసిన ప్రతిపాదన రాజకీయ సంఘంలోనే గాక, సమితి సర్వసభ్య సమావేశంలో కూడా ఈ వారం నెగ్గింది. ఇది కేవలం సోవియట్ రష్యా ప్రయోగిస్తున్న వీటో అధికారాన్ని పరిమితంచేసి సమితి కార్యక్రమాన్ని అమెరికా, మిగతా అగ్రరాజ్యాలకు అనుకూలంగా కొనసాగించడానికి వేసిన ఒకఎత్తు. ఈ ఎత్తు ఫలించింది; రష్యా ఈ ఉపసమితి కార్యకలాపాలను తాము బహిష్కరించుతున్నట్లు ఖండితంగా ప్రకటిస్తున్నది. ప్రపంచ శాంతికి రష్యా ఎంతవరకు సహకరిస్తుందనే సమస్య ఇక త్వరలో స్పష్టంగా తేలిపోతుంది. అగ్రరాజ్యాల విభేదాలు ఈ "ఉపసమితి" స్థాపనతో మరీ విస్పష్టమవుతవి. అంతర్జాతీయ సంస్థలో రష్యా వుంటుందో, విరమించుకుంటుందో కూడా తేలిపోవచ్చు.

* * *

బ్రిటిష్ ఖజానా శాఖామంత్రి హ్యూ డాల్టన్ ఒక విచిత్రమైన, ఆకస్మికమైన సంఘటన ఫలితంగా రాజీనామా ఇవ్వడం, ఆ పదవిని సర్ స్టాఫర్డ్ క్రిప్స్ స్వీకరించడం జరిగింది. డాక్టర్ డాల్టన్ బ్రిటిష్ కార్మిక పక్ష ప్రముఖులలో ఒకడు వయస్సు 60 ఏళ్ళు. కార్మికపక్ష కార్యవర్గానికి ఒక ఏడాదిపాటు అధ్యక్షుడుగా కూడా పనిచేశాడు. ఆర్థిక వ్యవహారాలలో కూడా ఆరితేరినవాడు. మొదటి ప్రథమ ప్రపంచ సంగ్రామంలో ఇటలీ రంగంలో పనిచేశాడు. ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో ఇతన్ని ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ యుద్ధ ఆర్థిక వ్యవహారాల శాఖకు మంత్రిగా కూడా నియమించాడు. జర్మనీపై ఆర్థిక దిగ్బంధ విధానం జయప్రదంగా కొనసాగడానికి డాల్టన్ సామర్థ్యంతో పనిచేశాడు. ఇంత సమర్థుడు ఒక చిన్న పొరపాటు కారణంగా బ్రిటిష్ మంత్రివర్గం నుంచి తప్పుకొనవలసి వచ్చింది.

* * *

బ్రిటిష్ ప్రభుత్వ తాత్కాలిక బడ్జెట్ ప్రతిపాదనలను మొన్న 12-వ తేదీ సాయంత్రం 4 గంటలకు (బ్రిటిష్ కాలమానం ప్రకారం) కామన్సు సభలో ప్రవేశ పెట్టడానికి 15 నిమిషాలు ముందుగా లండన్ 'స్టార్' పత్రిక లాబీ విలేఖరితో ముచ్చటిస్తూ బడ్జెట్‌లోని అంశాలను డాల్టన్ బయట పెట్టడం జరిగింది. ఆ పత్రిక బడ్జెట్ రహస్యాలను యథాతథంగా, కామన్సులో ఖజానా శాఖా మంత్రి ప్రవేశపెట్టడానికి పూర్వమే (15 నిమిషాలు) ప్రకటించివేసింది. బడ్జెట్ రహస్యాలను ఏ మంత్రీ బయట పెట్టకూడదన్నది బ్రిటిష్ మంత్రివర్గ సంప్రదాయం. ఏ నియమాన్ని ఉల్లంఘించినా సహిస్తారేమోగాని, బడ్జెట్ రహస్యాలు బయటపడితే మాత్రం బ్రిటిష్ ప్రభుత్వం ఏమాత్రం సహించదు. బడ్జెట్ వ్యవహారాలు ముందుగా బయటపడితే అనేకమంది వ్యక్తులు, ప్రైవేట్ ఆర్థిక, వ్యాపార సంస్థలు ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమానికి విరుద్ధంగా స్వార్థప్రయోజనాలను సాధించడం సంభవిస్తుంది. అందువల్లనే బడ్జెట్ విషయాలను అధికారపూర్వకంగా ప్రకటించేవరకూ అతి గోప్యంగా వుంచవలసిన బాధ్యత అవి తెలిసిన ప్రతి బ్రిటిష్ మంత్రిపైనా వుంటుంది. ఈ నియమాన్ని, లేదా, ఈ ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని బ్రిటిష్ ప్రభుత్వం తు. చ. లు తప్పకుండా పాటించడం పరిపాటి.

ఖజానా మంత్రి డాల్టన్ తన అవివేక ప్రవర్తనకు, తన తప్పిదానికి కామన్సు సమావేశంలోనే బాహాటంగా క్షమార్పణ చెప్పుకున్నాడు. ఖజానామంత్రి పదవికి రాజీనామాను అందజేస్తూ ప్రధాని అట్లీకి ఒక లేఖ వ్రాసుకున్నాడు. మంత్రివర్గ అత్యవసర సమావేశంలో ఈ రాజీనామాను గురించి చర్చించారు. జార్జిరాజు రాజీనామాను ఆమోదించడమూ, సర్ స్టాఫర్డ్ క్రిప్స్ ఆ పదవిని స్వీకరించడమూ కూడా జరిగింది. 'డాల్టన్ డ్రామా' ఈ విధంగా సమాప్తమైంది. సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌కు బ్రిటిష్ ప్రభుత్వ సమస్త ఆర్థిక వ్యవహారాలపైనా దీనితో సర్వాధికారాలూ సంక్రమించినవి.

* * *

బడ్జెట్ వ్యవహారాలను బయట పెట్టిన ఫలితంగా బ్రిటిష్ మంత్రి తన పదవిని కోల్పోవటం ఇది మొదటి సారికాదు. 1936 లో బాల్డ్విన్ బ్రిటిష్ ప్రధానామాత్యుడుగా వుండగా కూడా ఇదే మాదిరి సంఘటన ఏర్పడింది. బడ్జెట్ రహస్యాలు బయలుపడిన కారణంగా అప్పుడు సర్వపక్ష విచారణ జరగడం, బ్రిటిష్ వలస రాజ్య శాఖామంత్రి జె. హెచ్. థామస్ తన పదవిని కోల్పోవడం జరిగింది. ఆనాటి బడ్జెట్ రహస్యాలను లాయడ్ ఇన్సూరెన్సు కంపెనీ వారు విపరీతంగా స్వార్థ లాభంకోసం వినియోగించుకోవడం సంభవించింది. జె. హెచ్. థామస్ కూడా ఆరితేరిన కార్మిక నాయకుడే. అపార సంఖ్యాబలంగల బ్రిటిష్ రైల్వే కార్మికులు థామస్ ఎంత చెబితే అంత. థామస్ తన 15 వ ఏటనే ఎన్నో కార్మిక సమ్మెలను జయప్రదంగా నిర్వహించినవాడు. ఒకప్పుడు రైలు ఇంజన్లను శుభ్రంగా తుడిచే కూలీగా పనిచేసిన థామస్ బ్రిటిష్ మంత్రిమండలిలో సభ్యుడై మహోన్నతస్థితికి వచ్చాడు. బడ్జెట్ రహస్యాలను బయటపెట్టినందుకు జరిగిన విచారణతో పదభ్రష్టుడై, బ్రిటిష్ ప్రజాహిత జీవితంలో నామరూపాలు కూడా లేకుండా పోయినాడు. తిరిగి పది సంవత్సరాల అనంతరం హ్యూ డాల్టన్‌కూ అదే స్థితి సంప్రాప్తమయింది. డాల్టన్‌మీద కూడా నిష్పాక్షికవిచారణ జరిగేటట్లు వార్తలు వస్తున్నవి. బడ్జెట్ ప్రతిపాదనల అధికార ప్రకటనకూ, 'స్టార్' పత్రిక ప్రకటనకూ మధ్య 15 నిమిషాల మాత్రమే వ్యవధివున్నందున వ్యక్తులుగాని, ఆర్థిక వ్యవస్థలుగాని స్వార్థప్రయోజనాలను సాధించడానికి వీలులేకపోయి వుండవచ్చు. ఐనప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వం, ఒక అపూర్వ సంప్రదాయాన్ని కాపాడేవిషయంలో వ్యక్తులను ఏమాత్రం పాటించదనడానికి డాల్టన్ ఉదంతం ఒక ఉత్తమ నిదర్శనం.

* * *

మార్షల్ పిబుల్ సంగ్రామ్ ఆధ్వర్యాన సయాంలో ఈ నెల 9-వ తేదీన సైనిక తిరుగుబాటు జరిగింది. సయాం పరిపాలనాధికారాన్ని ఇతడు హస్తగతం చేసుకున్నాడు. ల్వాంగ్ థమ్రంగ్ నవస్వత్ ప్రభుత్వం పతనమైంది. ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో తమ దేశాన్ని జపాన్ వారు ఆక్రమించినప్పుడు వారిపై నవస్వత్ జయప్రదంగా ప్రతిఘటన సాగించి దేశానికి విముక్తి సాధించిన వాడు. యుద్ధ ఫలితంగా దేశంలో బ్రిటిష్ వారి రేవు పరిశ్రమకు ఏర్పడిన నష్టానికి పరిహారంగా సయాం $12\frac{1}{2}$ లక్షల పౌనులు చెల్లిస్తుందని నవస్వత్ గత మాసమే ప్రకటించాడు. ఇప్పుడు సైనిక తిరుగుబాటు సాగించిన పిబుల్ సంగ్రామ్‌కు ఇద్దరు మాజీ ప్రధానులు (ఖువాంగ్ అభయవంగ్, సీనీ ప్రమోజీ) అండకూడా దొరికినట్లు తెలుస్తున్నది. పిబుల్ సంగ్రామ్ జపానువారు దేశాన్ని ఆక్రమించి వున్నప్పుడు సయాం ప్రధానిగా పనిచేశాడు. ఇతడు ఫాసిస్టు పక్షపాతి. 1943 లో మిత్రరాజ్యాలమీద యుద్ధం ప్రకటించాడు. 1945 లో జపాను పతనం కాగానే, ఇతడికి అరెస్టుచేసి, బ్రిటను సయాముల మధ్య సంధి ఒడంబడిక కుదరగానే విడుదలైనాడు. నవస్వత్ ప్రభుత్వం అసమర్థంగా పనిచేస్తున్నదనీ, ఉద్యోగులలో లంచగొండితనం ప్రబలిపోతున్నదనీ ఆరోపణలు చేసే వార్తలు లోగడ వచ్చినవి. సయాంలో ఈ సైనిక తిరుగుబాటు ఏ కారణాలవల్ల సంభవించిందో, దీనికి ఇండో చైనాలో జాతీయవాదుల స్వాతంత్ర్యపోరాటానికి ఏమైన సంబంధం వున్నదో ఇవాళేమి తెలియరావడంలేదు.

భారత రాజకీయాలు

[9 వ పేజి తరువాయి]

సోదరులకు మనకు సంబంధ బాంధవ్యములు మెండు. కాని ఈ కష్టకాలములో, అన్ని సహాయములు చేయుటకు తగివున్న మనం, వారికి ఏమి సహాయం చేస్తున్నాము. ఇండ్లనుంచి బలవంతముగా లేవగొట్టి వేయబడి, భయాక్రాంతులై మన వద్దకు వచ్చిన సోదరులకు వారి స్వగృహములు వారికి వచ్చునట్లు మనమేమైనా చేస్తున్నామా? ఇంతటి కష్టకాలంలో తెలంగాణా సోదరులకు ఏ సహాయము చేయలేని మనము, ఏదో కొండ త్రవ్వి తమ నెత్తిన పెట్టగలమని రాయలసీమసోదరులు విశ్వసిస్తారా? తెలంగాణా ఆంధ్రుల కష్టాలవలన మనకు చీమకుట్టినట్టయినా బాధ కలుగలేదు. దాబు, దర్పంతో వూరివెంట తిరుగుతూ, ఏదో పొడిచేసేటట్లు కబుర్లు చెప్పటంకన్న ఆంధ్రులు చేయగలిగిందేమీ లేదు. 'విశాలాంధ్ర జిందాబాద్' అని మద్రాసువీధులలో ఊరేగింపు ప్రదర్శనం చేసిన ఆంధ్రయువకుల ఉడుకు నెత్తురు, విశాలాంధ్రంలో అతి ముఖ్యము, చారిత్రాత్మక మగు తెలంగాణా కాపుదున్న కన్నీటికి, ఈ శీతాకాలపు చలిలో గడ్డకట్టుకుపోయిందా?

నిజాంసంస్థానంలో బాధపడుతున్న తమ సోదరులను రక్షించటానికి, స్వాతంత్ర్యపోరాటంలో నిజాం ప్రజలకు తోడ్పడటానికి బీరార్ ప్రజానాయకుడు బ్రిజ్‌లాల్ బియానీ ఆజాద్ హైదరాబాద్ ప్రభుత్వమును స్థాపించ ప్రయత్నించుట ఎంతయు శ్లాఘనీయము. ఈ ప్రభుత్వమునకు భారతీయులందరు సహకరించి, నిజాం త్వరలోనే భారత యూనియన్‌లో చేరునట్లు చూడవలసియున్నది.

మద్రాసు రాష్ట్ర ప్రభుత్వ సేవకులుగా వున్న ముస్లిం ఉద్యోగస్థులు కొందరు మద్రాసుకు దగ్గరగానున్న ఆవడి ఆయుధసామగ్రి డిపోనుండి చాల సామగ్రిని మారుపేర్లతో కొని, సంస్థానానికి చేరవేశారు. వీరికి బ్రిటిష్ ఉద్యోగుల మద్దతు కూడా వున్నదట. మద్రాసు నౌకాశ్రయములోనే కొన్ని ఆయుధాలు పట్టుబడ్డవి. ఇప్పటికైనను మద్రాసు ప్రభుత్వం నిద్రమేల్కొనటం హర్షించదగిన విషయం. నిజాం సరిహద్దుప్రాంతాలలో రక్షణకు తగిన ఏర్పాట్లు జరుగుచున్నవి.


* * *

దేశవిభజన జరిగినప్పుడు, ఆయుధ సామగ్రి పంపకం సరిగా జరుగునట్లు చూచుటకు, ఈ దేశంలోని బ్రిటిష్ సైనికుల రక్షణకు బాధ్యత వహించుటకు, ఇండియా, పాకిస్తాన్‌ల సైన్య విధానములను సమన్వయ పరచుటకు సుప్రీం కమాండరు అను ఒక ఉద్యోగి, రెండు అధినివేశములలోను పనిచేస్తూవుండేటట్లు, నియమింపబడినాడు. ఈయన ఒక పెద్ద కార్యాలయం కూడా ఏర్పరచుకున్నాడు. ఈ కార్యాలయం, ఈ పదవి 1948 వ సం. మార్చి నెలవరకు వుండాలని మొదట్లో భావించారు. కాని పాకిస్తాన్ మొరటుతనం, పరోక్షంగా కాశ్మీర్‌లో యుద్ధం జరుపుతూవుండటం, ఈయన పనికి చాల ఆటంకాలు కలిగిస్తున్నవి. ఈయనద్వారా భారత యూనియన్ నుంచి ఆయుధాలు తెప్పించుకోవాలని పాకిస్తాన్ ఎత్తు వేస్తున్నది. అందువలన ఈ పదవిని రద్దు చేస్తే బాగుంటుందని భారత ప్రభుత్వం భావిస్తున్నది. భారత ప్రభుత్వ సూచనతో సుప్రీం కమాండరు కూడా ఏకీభవించాడు. అందువలన నవంబరు 30 వ తేదీ నుండి సుప్రీం కమాండరు పదవిని రద్దుచేసి, బ్రిటిష్ సైనికుల రక్షణకొరకు చేసే ఏర్పాట్లు చేసుకొనటానికి బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది.

* * *

పాకిస్తాన్ స్థాపనకు తీసుకు తోడ్పడి, పాకిస్తాన్‌లో ప్రవేశార్హతకూడా లేకుండా భారత యూనియన్‌లో మిగిలిపోయివున్న ముస్లింల సమస్య కొరకరాని కొయ్యగా పరిణమిస్తున్నది. దేశవిభజన జరిగినవెంటనే తాము యూనియనుకు భారతయూనియన్‌కు విధేయులమై వుంటామని వీరు పదేపదే ప్రకటిస్తున్నారు. కాని వారి చేష్టలు వారి ప్రకటనలలోని అసత్యాన్ని చాటుతున్నవి. భారతదేశంలో మారుమూలలలో కూడా ప్రతి పట్టణంలోను, గ్రామంలోను ముస్లిముల వద్ద ఆయుధము లున్నవి. ఎందుకు? భారతయూనియన్‌కు వినయవిధేయతలతో వ్యవహరిస్తామని నేతిబీరకాయ ప్రమాణాలు చేసిన ఉద్యోగులు, పాకిస్తాన్ తరపున వ్యవహరిస్తూ, తిన్నయింటి వాసాలు లెక్కపెడుతున్నట్లు, సాక్ష్యం దొరుకుతున్నది. ఇటువంటి విశ్వాసద్రోహులను, హంతకులను సోదరులుగా భావించి రక్షించండని హిందువులను కోర లేనని సయ్యద్ అలీ జహీర్ వంటి ముస్లిం నాయకుడు ఇదివరకే చెప్పివున్నాడు.

ఇప్పుడు మార్పు రావలసినది ముస్లింల ధోరణిలోనేగాని ఇతరుల ధోరణిలో కాదు. సాయుధ సామూహికంగా ముస్లింలు ప్రవర్తిస్తూ, మేము భారత యూనియన్‌కు విధేయులమని చెప్పటం, ఎంతటివారి వివేకియని భ్రమపడటమే. మొన్న కలకత్తాలో జరిగిన సమావేశములో సుహ్రావర్ది, సాహసము, యుక్తి ప్రదర్శకేలో వైనాడు. భారతదేశ విభజనకు ముస్లింలీగ్ రెండు-జాతుల సిద్ధాంతం కారణమే కాదన్నాడే మహానుభావుడు. ఈ దేశ ప్రజలలో పాలలో నీళ్ళవలె కలిసి పోగలిగితే ముస్లింలు ఇక్కడ వుండవచ్చును. లేదా, వారిత్రోవ చూసుకొనవచ్చును. లీగ్‌ను రద్దుచేసి, ముస్లిం లందరూ కాంగ్రెస్‌లో చేరాలని మౌలానా ఆజాద్ ముస్లింలకు ఆదేశం చేశారు. కాని ఈ ఆదేశాన్ని ముస్లింలు ఎంతవరకు ఆదరిస్తారో చూడవలసి యున్నది.



ఈనాముల బిల్లు

అయ్యా,

"ఈనాములు, అధికారములేని మధ్యదళారీలవల్ల యివ్వబడినవి. తమకు లేని హక్కు దానము చేయుటకు దళారీలైన జమీందార్లకు హక్కు లేదు. గనుక అనుభవించుటకు ఈనాందార్లకు గూడా హక్కు లేదు. యీనాందార్లకు జమీందార్లతోపాటు స్వస్తిచెప్పవలసినది" అనే వాదము, ఈనాముల పుట్టుపూర్వోత్తరములు తెలిసికొనకుండా బయలు దేరినది.

జమీందా ర్లందరూ మధ్యదళారీలే ఐనప్పటికీ, యీనాములలో చాల భాగము యీ మధ్యదళారీలవల్ల దానము చేయబడినవి కావనుట స్పష్టము.

సర్వాధికారులైన పూర్వ హిందూరాజులున్నూ, వారిమంత్రులున్నూ, తర్వాత మహమ్మదీయరాజులున్నూ—అదే కాలమున పరిపాలన చేసిన, కొండవీడు, ఒరుగల్లురాజులున్నూ— సేద్యమునకు లాయికీ అయిన్నీ పోరంబోకులుగా ఉన్నగయాళు భూములనూ, జనసమ్మర్దమైన గ్రామములుగా చేయవలె నని సంకల్పించారు. విద్యలను పరీక్షించియో, లేదా, పోషించుట కుద్దేశించియో ప్రభుత్వ బొక్కసము ధనవ్యయములకాని పద్దతి నాలోచించి, ఉభయ ప్రయోజనములు కలిసివచ్చు నను తలంపుతో, దానపట్టాలు యిచ్చారు. సరిహద్దుల నిర్ణయించి ప్రభుత్వాదాయమైన భూమిశిస్తును మాత్రము వదులుకొని యుండిరి కాని ఆనాడు అంతకన్నా కూడా సులభముగా, రయితు తన యిష్టము వచ్చినచోట యిష్టము వచ్చిన భూమిని సేద్యము చేస్కునుట మామూలు రివాజు అయి ఉండినది.

అయితే ఒకప్పుడు రహితాధీనమైన గ్రామములు కారణాంతరములచే పాడుపడి బేచిరాకు అయినవి. వాటిని గూడా యీనాములుగా యిచ్చి పునః గ్రామప్రతిష్ఠలు చేయించుట కూడా ఆచార మయి ఉండెడిది. ప్రతి గ్రామం పేరు చివరకు పాడు అను పేరు వచ్చుటకు కూడా అది యొక కారణముగా కనుపించుచున్నది: అనగా బేచిరాకు గ్రామపాటిదిబ్బమీద పునః కట్టినగ్రామము కానదానిపేరు చివరను 'పాడ్డు' శబ్దము వాడుకలోనికి వచ్చినది.

దేవాలయము, లేక, సంస్థ, మఠము, మశీదు, చెరువు, సత్రము, యిత్యాదుల రక్షణ, చాకిరీనిమిత్తముకూడా యీనాముల నిచ్చియుండిరి. ఆ కాలములో యీనాములిచ్చినందున ప్రభుత్వబొక్కసములు వెలితిపడలేదు. దానములు చేసిన రాజులు ఎప్పటి కయినను తమ రాజ్యములు చేతులు మారునేమో నని అపనమ్మకముతోనే ఏ రాజయినను తమ దానశాసనముల మన్నింప వలసినదిగా విజ్ఞప్తులు చేసియుండిరి.

ఈనాములను హిందూ సంప్రదాయాను సారం తరతర ములా అన్నదమ్ములు పంపిణీ చేస్కుంటూ వచ్చారే తప్ప 'రాజకుటుంబాలలో లాగా పెద్దకుటుంబంవారే అనుభవిస్తూ రాలేదు.

తమకున్న కొద్ది యీనాము భూములలో ఏ విధముగానూ భుక్తి జరుగక - పట్టణములకు చేరి నీళ్ళు మోసి, వంటలు చేసి, కాఫీహోటళ్ళలో కప్పులు కడిగి జీవించుచూ శుభాలకో అశుభాలకో విధి లేక సేవ్యదారున కే, అతడిచ్చినవెలకే ఈనాంభూము లను వేలాదికుటుంబములు విక్రయించు కొనుచున్నారు. అనగా భూమిని సేద్యము చేయువారే బలీయులై భూమిని ఈనాందార్లవద్దనుండి కొనివేయుచున్నారు.

ఒక యకరం భూమి మాత్రమే నామతః ఈనాముగా గల్గిన కుటుంబా లనేకం ఉన్నవి. అవి వారు పొట్టకు జరిగి మిగుల్చుకొన్నవి కావు. పూర్వార్జితా లనీ, ఆపద కక్కరకు వచ్చుననీ, జీవితభీమాలవతూ మిగుల్చుకొన్నవి. ప్రతి గ్రామంలోనూ ఈనాందారులకంటే, అన్నివిధాలా రైతులే బలవంతులుగా ఉన్నారు. ఈనాందారూ రైతుల మధ్య జరిగే కౌలుకంట్రాక్టుల ప్రకారం ఏనాడూ ఈనాందారు రైతును మార్చ గలిగే పరిస్థితిలో లేడు. గ్రామాల్లో అట్టి వసతులు ఏనాడూ ఈనాందారుకు లేవు. గతసంవత్సరం పొడవుక్ష-ఏవిధిహక్కు, రైతుధర్మము, కార్మికులలో ఈనాందారుకు పలుకుబడి లేమి, నిరసత, దేహదార్ఢ్యము లేమి, హాంగు లేకుండుట—యిత్యాది ప్రబలకారణములు, ప్రభుత్వశాసనము లేకున్నాకూడా, బీద ఈనాందారు విషయంలో లెక్కకురాక అతన్ని బాధించుచునే యున్నవి.

ప్రస్తుత పరిస్థితులలో జమీందారీ పోయినా, జమీందార్లు కొంత ఎస్టాబ్లిష్ మెంటు తగ్గించుకొని ఖర్చు తగ్గించుకో నవకాశ మున్నది. యిక యీనాందారు ఖర్చు తగ్గించుకోవలెనన్న భార్యనో బిడ్డలనో వృద్ధమాతాపిత రులనో తగ్గించుకోవలెను.

కాంగ్రెసువారు మును పెప్పుడును యీనాములవిషయమున పల్లెత్తి మాటాడిన పాపాన పోలేదు. జమీందారీసమస్యను క్లిష్టపెనర్చేందుకు 1936లో జస్టిస్ ప్రభుత్వమూ, 1945 లో అప్పోయిజర్లు మాత్రమే ఈ ఈనాములను జమీందారీలతో జోడించి సమస్యగా తయారుచేసినారు. జమీందారీలవంటివే యీనాములని, కాంగ్రెస్ వారి హృదయములలో మును పెక్కడా లేదు. మొన్న జరిగిన ఎన్నికల ప్రణాళికలో సహితము లేకుండుటయు, కాంగ్రెస్ వాదులు మును పేయుపన్యాసములలోనూ యీ ఈనాములను జోడించకపోవుటయు ఈవిషయమునే స్పష్టం చేయుచున్నవి.

ఇట్టి సందర్భములో, ప్రజాభిప్రాయము తగిన వ్యవధిలో సేకరించి, విచారణకమిటీ నిర్ణయించి, సదరు నిష్పక్షపాతకమిటీనివేదకను సమగ్రముగా పరిశీలించి నిదానముగా న్యాయాన్యాయములను విచారించి వ్యవహరించుట స్వతంత్ర ప్రజాప్రభుత్వధర్మము

లేసానుపల్లి వెంకటప్పయ్య.

* * *

అద్దె యిండ్లు

ఆర్యా,

బెజవాడ పట్నంలో యుద్ధానికి పూర్వం 5రూ.లకు దొరికే భాగం యీనాడు 30రూ.దాక పెరిగింది. నిజాంనుండి వచ్చినవారు చిన్న యిళ్ళకు కూడ 100రు. నెలకు అద్దెలు యివ్వటంచేత ప్రస్తుతం అద్దెకున్నవారిని ఖాళీ చెయ్యించాలని యింటి యజమానులు అద్దెకున్నవారిని అనేక బాధలకు గురిచేస్తున్నారు. తాగడానికి నీళ్లు రానీయకుండా చేయటం, దీపాలు రానీయకపోవటం, మరుగుదొడ్లకు వెళ్లనీయకపోవటం, మొదలైన పనులు గృహయజమానులకు పరిపాటి అయినాయి. ఇటీవలనే ఎన్నికలు గూడా జరిగి స్థానిక పరిపాలనకు ప్రజాప్రతినిధులు వచ్చారుగనుక యీ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, యిండ్లు లేనివారికి ప్రత్యేక కాలనీలు కట్టించి రక్షిస్తా రని ఆశిస్తున్నాను. ఇందుకు అయ్యే ఖర్చును ప్రస్తుతం మునిసిపాలిటి పెట్టుకొని తర్వాత అద్దె రూపంగా వసూలు చేసుకోవచ్చును.

'పట్టణపౌరుడు'

ఆహార పదార్థాలపై కంట్రోలు

ఆర్యా,

ఆహార కంట్రోలు విధానము విఫలమైనప్పటికీ కంట్రోలును రద్దుచేయుటకు ప్రభుత్వం పూనుకోకపోవటం శోచనీయం. ఏ వ్యక్తికి ఎంత ఆహారం అవసరమో దానికి భిన్నంగా పొందాలనుకోవటం అసంభవం. కాబట్టి కంట్రోలుపద్ధతిని సాధ్యమైనంతత్వరలో రద్దుపరచి, ప్రజలు తమకు కావలసిన ఆహారమును పొందుటకు అవకాశ మిప్పించవలసిం దని కోరుచున్నాను.

భావరాజు సూర్యనారాయణమూర్తి

చంద్రమౌళీశ్వర దేవాలయ పోషణ

ఆర్యా,

కనిగిరితాలుకా చంద్రశేఖరపురంలో ఉన్న శ్రీ చంద్రమౌళీశ్వర దేవాలయమునకు అంబవరం గ్రామ రైతులనుండి రూపాయకు కాని చొప్పున వసూలు చేయటకు దేవాలయనిర్మాతలు నిర్ణయించారు. అంబవరం గ్రామము రాజా దామెర పెద వెంకటప్పనాయనింగారి జాగిరులో ఉన్నది. ఇటీవల యీ గ్రామమును రాజాగారు విక్రయించినట్లు తెలిసింది. దేవాలయకార్యములు ఆగునేమో అని ప్రజలు ఆందోళన చెందుచున్నారు. ప్రభుత్వమువారు దేవాలయమును పరిశీలించి, అంబవర గ్రామమునుండి వచ్చు ఆదాయముతో గాని లేక రాజాగారి కిచ్చు నష్టపరిహారంలో కొంత భాగము మినహాయించిగాని దేవాలయపోషణ జరిపించవలె నని కోరుచున్నాను.

'ఒక పౌరుడు'

పాశ్చాత్య దేశాలలో స్త్రీల అభ్యున్నతి

(10-వ పేజీ తరువాయి)

వాటిద్వారా పిల్లలకు వైజ్ఞానిక శిక్షణ ఇచ్చుచున్నారు. ఉద్యోగములనుండి విరమించిన వృద్ధుల కందరికి క్లబ్ స్థాపించి వారల మానసికోల్లాసమునకు అవకాశము కల్పించుచున్నారు. ప్రతిమాసము, చలన దృశ్యముల ప్రదర్శించి లోకజ్ఞానమును కలుగజేయుచున్నారు. గుడ్డివారిచేత పనిచేయించి జీవనోపాధి కల్పించుచున్నారు. బాలక్షేమ సంఘమువారు పిల్లల సంబధమైన విషయముల నన్నిటిని విచారించి వారి అభివృద్ధికై పాటుపడుచున్నారు.

అంత నాగరికతకు వన్నెకెక్కిన పట్టణమందును కార్మికులుండు ప్రదేశము, వారి స్థితియు దీనముగనే యున్నది. సంఘసేవాపరులు వారి మధ్యకువెళ్లి వారలకు పరిశుభ్రత మర్యాదలను గురించి బోధించియు, వారి పిల్లలకు సంగీతము, చిత్రలేఖనము కథలు మొదలగునవి చెప్పియు, చేతిపనులు నేర్పించియు పాటుపడుచున్నారు.

అచ్చట వివాహసంబంధమైన విషయములను గురించి ప్రజలకు సహాయము చేయుటకొక కేమ్ బ్రిడ్జి సెటిల్ మెంటు అను సంఘము కలదు. ఆ సంఘమువారు భార్యాభర్తలకు మధ్య తగాదాలను పరిష్కరించి సమాధాన పరచుట, విపరీతపరిస్థితులందు ఉచితముగ 'లా'సంబంధమగు సలహాల నొసంగుట—మొదలగు ప్రజోపయోగములగు పనులు చేయుచున్నారు. అంతేకాక ఈ సంఘమువారు నిరుద్యోగము వలన ప్రజలు బాధపడుచూ గవర్నమెంటువారు కూడ ఆ సమస్యా పరిష్కార నిమిత్తము ఏ ప్రణాళికను, తయారు చేయకముందు, నిరుద్యోగులకు ఏదో విధముగ ఉద్యోగములు కల్పించి సహాయము చేసిరి. కార్మికుల కష్టములను తగాదాలను విచారించి వారికి సౌకర్యములు కలుగ జేయుటకు కూడ పాటుపడుచున్నారు. మాడల్ పార్లమెంటును ఏర్పరచి కామన్సు సభలలోవలెననేక విషయములమీద చర్చలు చేసి ప్రజలకు రాజ్యాంగ విషయ పరిజ్ఞానము కలుగ జేయుచున్నారు.

లండన్ లో ఇండియాలీగు స్త్రీ సంఘము వారు, భారత దేశమునుండి వచ్చిన వారికి స్వాగత మిచ్చుట, సభలు ఏర్పాటుచేయుట, వారికి వసతులు కల్పించుట మొదలైనవి చేయుదురు.

ఆక్స్ ఫర్డు విశ్వవిద్యాలయము చాలపెద్ద విద్యాసంస్థ. దానికి చేరిన అనేక కళాశాలలు గ్రంథాలయములు కలవు. ప్రతి కళాశాలకు చెందిన నొక క్రైస్తవ దేవాలయము. విద్యార్థుల వసతి గృహములు—ఒక్కొక్క విద్యార్థి వుండుటకు ఒక పడకగది, చదువుకొనుగది, స్నానమునకు గది కలవు. విద్యార్థు లుండు గృహము చాల అందమైన పరిశుభ్రమైన సామగ్రి గలిగి చాల ప్రశాంతముగ నున్నది.

అచ్చట గ్రామములు, పరిశుభ్రత ప్రశాంతము మొదలగు గ్రామసౌకర్యములు, పట్టణములలో నుండు పోస్టు ఆఫీసులు, టెలిగ్రాము ఆఫీసులు, క్లబ్ లు, పిల్లలకు పాఠశాలలు, ప్రయాణ సౌకర్యములను కలిగియున్నవి. కొన్ని ఇండ్లల్లో విద్యుచ్ఛక్తి సదుపాయములు గూడ కలవు. ప్రతి యింటికి చెందిన ఫలవృక్షములు, పూలమొక్కలు గల విశాలమగు తోటలు గలవు. అచ్చటి పల్లెటూర్లు ఎంతయో ఆకర్షణీయముగ నున్నవి.

లండనులో భయంకర యుద్ధ సమయములందు బాంబుల వలన నేలకు కూలిన పెద్దపెద్ద కట్టడములు భీభత్స దృశ్యమును, చూపించుచున్నవి. ఆ ధ్వంసావశేషములను పెద్ద యంత్రముల సహాయమున నెత్తివేయుచున్నారు. ఆ స్థలములలో పూలతోటలను వేసి పట్టణము యొక్క ఇరుకు తనమును పోగొట్టవలెనని ప్రభుత్వమువారు తలపెట్టినారట.

పాశ్చాత్య దేశీయులు కర్తవ్యమున కెక్కువ ప్రాముఖ్యత నిచ్చెదరు. వారి పౌరధర్మము ప్రశంసనీయము. అంటువ్యాధుల విషయములలోను, పట్టణము యొక్క పరిసర ప్రాంతము యొక్క పరిశుభ్రత విషయములోను వారు తీసుకొను జాగ్రత్త ఆదర్శప్రాయము. స్త్రీలు అర్ధరాత్రియందు సహితము వీధులలో నిర్భయముగా సంచరించుట చూడ పరిపాలనా సౌష్ఠవమును, వారి నాగరికతను సూచించు చున్నది. ప్రతివారు ప్రొద్దుననే పత్రికా పఠనము చేయుచుండుట విద్యా వ్యాపనమును, విజ్ఞాన పిపాసను ప్రకటించు చున్నది. బస్సులలోను, ట్రాములలోను రేషనింగు షాపులలోను ఉద్యోగీయులుగా స్త్రీలే నియమించబడుట స్త్రీల శక్తి సామర్థ్యములను తెలుపుచున్నది. ఎంతటి విపత్తి సమయములందు సహితము, పెద్దగ విలపింపక శాంతికి భంగము కలుగజేయక భరించుట చూడ వారి ధీరత్వము శాంతి భంగ భీతిని కనబరచుచున్నది. కాని మొత్తము శాలమీద వైజ్ఞానిక విషయములందు నైపుణ్యము గలిగి వారిదైనిక జీవనము ఐహికాభ్యున్నతి విషయముననే నడచుచుండును.

గొప్పవారితో గుసగుసలు

శ్రీనాథుడు

కీ॥ శే॥ శ్రీ వారణాసి శ్రీనివాసరావు

[వెనుకటివిధానంలోనే శ్రీనాథుడు; నమస్కరిస్తూ నేనూ ప్రవేశం]

నే: రేపురా, వెళ్తా నన్నారే; ఆ యాత్రా విషయ మేమిటండీ?

శ్రీ: ఏముందోయ్? ద్రాక్షారామం మహా స్థల మని తెలుసు. భీమేశ్వరస్వామి దర్శనంచేసు కొద్దా మని వెళ్లివచ్చా.

నే: వారి దర్శనమే కాకుండా మరొకరి దర్శనంకూడా...

శ్రీ: అ చేసుకున్నా. ఆయనపేరు సాంప రాయలు. ఆయన బిరుదనామాల్లో ఎండ్రకనో త్రిలింగాధీశు డని ఒక టుంది. వెళ్లింతర్వాత ప్రభువును చూచి, సభ చేయించుకు రావడ మాచారం. అందులో సార్వభౌమ బిరుదు కూడా వచ్చె. దాన్ని నిలబెట్టుకోవద్దూ?

నే: చిత్తం. సభలో వాక్యార్థం చేసారా?

శ్రీ: చెయ్యడ మేమిటి? కోనసీమ మహాఫల వంతమైంది. గింజ ఊరికే చల్లితే పంటా తుంది బ్రాహ్మణులకు బోలెడు గ్రహారా లున్నాయ్. ధనసంపత్తితో కుదిర్న విశ్రాంతివల్ల వాండ్లంతా బాగా చదువుకుని పండితులై వుంటారు. చదువు రాని కుంక కలికానికి దొరకడా సీమలో. సభలో నన్ను దుయ్యబట్టుకున్నారు. మొత్తానికి నెగ్గొచ్చా.

నే: తమ కేం పారితోషికం సమర్పించారా ప్రభువులు?

శ్రీ: నాకూ, కూడా వచ్చినవాండ్లకూ తత్సౌ లేకాండా విలువగల వస్త్రాలు, ఆభరణాలు, కొంతరొక్కమిచ్చి మర్యాద చేసారు.

నే: కస్తూరిమాటో?

శ్రీ: అది దానకథా కావలసిందే! ఆ పూతు కు మహామంచిది. చూడ్డానికి కందంగా వుంది. వెళ్లా, చూశా, వేశ్యావాటికే వుందోయ్ స్వర్గంలాగా. మాచేటపుటి కేముందీ! ఆ ముండలకు రొక్కం, ఆభరణాలు పనికిరావు అంత మదించున్నారు. కస్తూరి కావలె నట. వట్టి బెమ్మిగాణ్ణి ఎక్కడ తెచ్చేది. కాబట్టి వెళ్లి రాజునే అడిగా, యిచ్చారు.

నే: 'త్రిలింగాధీశ, కస్తూరికా, భిక్షాదానము సేయరా—' అని యేకవచనం ప్రయోగిం చారేం?

శ్రీ: రెండు కారణాలు: ఆయనగారు మొన్న మొన్ననే రాజ్యాని కొచ్చారు. వారికి ఇరవైయైదేం డ్లుంటాయి. మన సంగతంతా వినున్నారు కాబోలు, చూడగానే "స్వామి! మాకంటే పెద్దలన్నివిధాలా. మేం వట్టిరాజులం. తమరు కవిసార్వభౌములు. మాపట్ల పుత్ర వాత్సల్యం కటాక్షించా"లన్నారు. బహు వచనం ప్రయోగిస్తే పలకకుండా మంత్రిచేత 'ఏక వచన'మని ముమ్మారనిపించారు. మరొకకారణం: మేం సార్వభౌములం; ఆయన వట్టిరాజు— అట్లాటప్పు డాయన్నే మనాలి.

నే: అవగాహనైంది. కృష్ణదేవరాయల వారికి మీరే దారి చూపారా? ఆముక్తమాల్య దలో రంగడు పాండీమా, పాండీని దివారామని పాండ్య చక్రవర్తి నంటారు!

శ్రీ: ఇట్లాటివి సహజంగా తోస్తాయ్. రాయ లొక మహాచక్రవర్తిపాయె. ఆయన కా వాక్కు సహజంగా వస్తుంది. దేశాచారం కూడాను.

నే: నిజమేనండోయ్? మా కాలంలో దత్త మండలంవాండ్లు, దక్షిణాదినున్న తెలుగువాండ్లు ఎంతవారైనా వాడువాడు అంటారు. మా కట్టమంచి రామలింగారెడ్డిగారు పరోక్షంలో నెవరైనా వాడు అంటాడు! తర్వాత (కొంచెముండి) తమరు పల్నాడెందు కెళ్లారు. అక్కడి రాజులెవరైనా చూడ్డాని కెళ్లారా?

శ్రీ: డిబ్బ! పల్నాడులో రాజు లెవ రున్నారు. దాన్లో చాలాభాగం మా ప్రభువుది. మిగతాది యెవరెవరో చిల్లరరాజుల్ది. ప్రభు దర్శనాపేక్షతో వెళ్లలా పల్నాడు. ఆ సీమలో మా చుట్టా లున్నారు. వాండ్లను, దేశాన్ని చూచినట్లౌతుందని వెళ్లా.

నే: తమ రక్కడ చెప్పిన చాటువుల్లో విషయ మంతా నిజమేనా?

శ్రీ: నిజమేనా? నెమ్మదిగా అంటావేం! నిజమా నిజమున్నరా? బాగుండ దా దేశయు లేమన్నా అనుకుంటా రని పట్టిపట్టి చెప్పాగాని అంతచెట్టదేశం మోటదేశం ఎక్కడా వుండె దను కుంటా. నా గ్రహచారంవల్ల యెండాకాల మొచ్చిందా యాత్రలో. కొన్ని వూళ్ళలో మంచి నీళ్ళుగూడ దొరకందే! ఎంత సుకుమారైనా మోటపన్లే చేస్తారే? అయితే ఒక టుంది, నేల బహుసారవంతమైంది. పకాలవృష్టి వుంటే సుభిక్షమైన దేశమే. మునుపు అంటే, పల్లవ రాజులు పాలించినప్పుడు. అట్లావుండి వుండ దనుకుంటా. కాలవిపర్యాసంవల్ల నీ వ్యత్యాస మేర్పడుండాలి.

నే: అయుండొచ్చు బహుశా, మా కాలం లో భూగోళ శాస్త్రజ్ఞులు కొన్ని కారణాల్చే త సుభిక్ష దేశాలు పరప్రస్థా యని, ప్రజలు సుభిక్షా శ్లాఘా యనంటారు. అట్లాటి ప్రదేశాల్ని కొన్నింటిని సహేతుకంగా నిరూపించారు. అయితే పల్నాటి వీరచరిత్ర తమరు చెప్పిందేనా.

శ్రీ: ఏమిటోయ్, నా వాక్కట్లాటి విషయా లకు దిగుతుం దనుకున్నారటోయ్! అంతేగాక "ద్విపద కావ్యంబు ముదిలంజ దిడ్డికంత" అనే వాణ్ణి దాన్ని వ్రాసుంటా ననుకుంటారా? ఆ కథేనా చేతబడ్తే యే కావ్యం బయల్దేరేదో యెందు కనుకోరు. నా పేరు పెడ్తే కథకు ప్రచారం వస్తుందని యెవడో చేసాడేమో. ఆ కథ విన్నానుగాని నన్నదే కదపలాక పోయింది

నే: అట్లాగాండీ—అనక—తమ కాలంలో సర్వజ్ఞ సింగమనీ డనే రాజవరు లుండేవారే; వా రెంతవారండీ!

శ్రీ: ఎంతేమిటి, గట్టివారే, గొప్ప సంస్థా నాధీశ్వరులు—పెద్ద పేరు కలవారు; చదువు కున్నవారు.

నే: చదువుకున్న వా రంటారేం—మహా పండితు లని ప్రతీతి.

శ్రీ: కాకేం పండితులే, రావువారు. వెలం వారి నీటుగోటూ అంతా వుండేది వారికి. వారి కెట్లాగైనా మమ్మల్నొకసారి తమ వద్దకు రప్పించు కోవా ల్నని వుండేది.

నే: (చిరునవ్వుతో) ఉంటే వెళ్ళొ చ్చారుగా.

శ్రీ: అఁ—మా అనవేమారెడ్డిగారికి వారికి యేమాత్రం సరిపడేదికాదు. ఒక ర్నొక రవమా నించు కోవా లని కనిపెట్టుకుండేవాళ్లు. ఒకర్ని విడా ఒకర్ని పొగిడ్తే స్తోత్రపాఠకుని పంట పండేది. ఏదో పొలిమేర తగాదా తీర్చడానికి నామీద వారికి గౌరవ మని మా దొర పంపారు! వెళ్లా. ఆయన్ను తెగపొగిడా. దాంతో పనైంది.

నే: దాంతో మీ రెళ్లిన పనేగాదు, ఆయన పనికూడా అయిందన్నారే.

శ్రీ: (ముసి ముసి నవ్వులు నవ్వుతూ) అట్లాగే. పొగి డొచ్చా ననేటప్పటికి మా ప్రభువు తారామండల మంటారు కోపంతో. ఆయన్ను శాంతి పరచడానికి దేవీకటాక్షంవల్ల ఆ స్తోత్రపద్యాని కింకో కర్థం నే ననుకోకుండా అమిరుంది.

క. "సర్వజ్ఞ నామధేయము
శర్వునకే రావుసింగ జనపాలునకే
యుర్వర జెల్లును నితరుని
సర్వజ్ఞం డనుట కుక్క సామజ మనుటే.

సింగరాజు స్తోత్రం జనపాలునకే వెనుకటి వాక్యాల్తో నన్వయిస్తే వుంది. జనపాలునకు ఏ యుర్వర జెల్లును అంటే ఆయన నిరసన అమరుతుంది. దాంతో మాదొర శాంతి చారు. మొత్తానికి మనమటుకు స్తోత్రాని కక్కడా, నిరసన కిక్కడా బహుమానాలు లభించాయి.

నే: ఆకోపం మనస్సులో పెట్టుకొనితమర్ని చివరకవమానం చేసారని, నగిరివాకిట్లో నల్లగుండు పీపుమీద మోయించా రని అంటా రేమిటండీ?

శ్రీ: హాఁహాఁ! అదంతా వట్టి మాటోయి పాపం! జరిగిందిచెప్తా విను. మా వాండ్ల పోరు బడ్లేక నే నొక భూమి సంపాదించా కృష్ణా తీరాన. ఏ యాత్రలోనో డబ్బు మిగిల్తే బొడు పల్లనేవూళ్లో నొకావులమందను పెంచడ మా రంభించా. ఆభూమి సింగమరాజుగారి సంస్థానం లోది. కృష్ణవరదొచ్చి పంటను వరసగా రెండేండ్లు పాడుచేసింది. దానిమీద సుంకం బాకీపడ్డది ఏడుమార్ల టంకాల్దాకా. పోనీ గొడ్లనమ్మి చెల్లి ద్దామనుకుంటే గాళ్లుతగిలి మందకైంఁ ర్యమైంది. డొక్క శుద్ధిగాని ఒక భ్రష్టకారి ముండాకొడు కునెక్కడినాణ్ణో అపాలకున్న వూరికధికారిగా నియమించారు. ఆ ఘండాలుడు క్రొత్తగా వచ్చాడు కాబట్టి, పని బాగా చేస్తున్నా డనుపించు కునేందుకు, -ంతా వద్దంటున్నా వినకుండా నన్ను బలవంతంగా పట్టు కెళ్లాడు. రాజధాని రాత్రి రెండు ఝాములకు జేరాం. తెల్లారే టప్పటి కల్లా నే నెంత చెప్పినా వినకుండా నా కమర్యాద చేశాడు. నేను కాలానికి కట్టుపడి ఆ పద్యం చదివా. అప్పుడే నిద్రలేచిన శ్రీవారదివిని మేడ దిగివచ్చి, సాష్టాంగపడి, నన్ను విడిపించి సుంకం రద్దుచేసి ఆ -ధికార్ని కొలతనేయించి, నా కా భూమి నగ్రహారంగా యిచ్చారు ఇదంతా మాసి పోయినా భుజమెక్కిన నల్లగుండే మిగిలింది. పాపం! మన ప్రభువు లింగిత జ్ఞులు; ఉదారుఁ. బ్రాహ్మణ్ణట్లాగవమానించరు; అందులో నావంటి వాడి కట్లాటి నీచదండన నెన్నడూ విధించరు.

నే: చిత్తం అదొర్భాగ్యుని పశుత్వమాదానికి కారణం? మాకు తెలీదు. మీ పద్యం చదివినపు డల్లా మాగుండెలవిసిపోయి వొళ్లుమండి పోతూం టుంది. ఇక తమకవిత్వ విషయం కొంచెమడుగుతా సెలవిస్తారా?

శ్రీ: ఏమిటది?

నే: ఏనుగ్గున్నకు మల్లే నడిచే ధార తమకట్లా గమిరింది?

శ్రీ: దానికి నేనేం జెప్పనుగాని నీ విప్పుడడు గుతుంటే జ్ఞాపక మొస్తూంది. నాకు భారతకవు లందర్లో నన్నయకవిత్వ మంటే విపరీతాభిమానం. సాధ్యమైనంతవరకు వారికి మల్లే వాక్కును సవ రించుకోవాలని చిన్నప్పు డనుకునేవాణ్ణి. రానురా నా మాటే మరచిపోయి కవిత్వం చెబుతున్నా. అందువల్ల అంతా కాకపోయినా కొంతైనా నా ధారాళత అమరిందేమో!

నే: చిత్తం, అవుండొచ్చు. తమ పద్యం జ్ఞాపక మొస్తూంది 'నెట్టుకొని కొలుతు నన్నయ భట్టారకు' దాన్లో చెప్తున్నా మనుకోకుండా చెప్పా రనుకుంటా. అయినాక, చాటువుల్లో చమత్కారం గ్రంథాల్లోకూడా అక్కడక్కడా చూపించా రనుకుంటా.

శ్రీ: ఆ అది నాకే గాదు, కవిత్వం చెప్పే ప్రతివాడికీ తప్పదు. ఎంత వద్దనుకున్నా మానవ కృషి కొంతవరకు శీలా న్ననుసరిస్తుంది. చమ త్కారసంభాషణలక్షణం కవిత్వంలో తప్పక కనుపిస్తుంది.

నే: అయితే, తిక్కనగారి శైలి కొంత కటు వుగా మోటగా వుంటుంది కదా, వారు విరసు లంటారా? మోటవా రంటారా?

శ్రీ: చు చు చు—విచారించకుండా అనే కావు. తిక్కనగారిశైలిలో నీ వనుకునే కటువు మోట తనం శీలలక్షణం కాదు వారు నియమిం చుకున్న భాషాలక్షణం. ఆనాడు తెలుగు లట్లా వుండేవి. సంస్కృతం వాడి వాటి కటుకుదనం, మోటదనం సవరించుకోకుండా వారు వాళ్ళేవాడి నీచేత నా మాటనుపించు కున్నారు. తెలుగు లిప్పటికీ చాలావర కట్లాగే వున్నాయ్. నేను నన్నయపంథ ననుసరించి నీ విమర్శ తప్పించుకున్నా.

నే: చిత్తం బాగుంది! అవతల తమకు వ్యాకరణశాస్త్ర మభిమానశాస్త్రమా?

శ్రీ: నేను నేర్చిన శాస్త్రాలన్నీ నా కభిమాన శాస్త్రాలే. ఎందు కట్లా గడిగావ్.

నే: తమ పద్యాల్లో నక్కడక్కడ వ్యాక రణ పదాల్నే వాడా రందుకని అడిగా.

శ్రీ: ఎన్నిచోట్ల నట్లా వాడాన్లే, ఎవరూ చేయనిపని ఆ కొన్నిచోట్లనైనా చేసానన్న మాట కాని. దాన్లో నొక సొగసుంది. అర్థం తక్కు వైనా ఆడంబరంజేసి, పాండిత్యాన్ని ప్రకటించ వచ్చు. శ్రీహర్షుడుచూడు—నా కాయనంటేఅభి మానం—"గమికర్మీకృత నైక నీవృతః" అన్నాడు. మహాను భావుడికీ మా యఁ చేయడమెంత అభిరుచో నని ఆంధ్రీకరణంలో గమికర్మీకృతనై కనీవృతుడనై య న్నా. క్రీడాభిరామరచన్లో అట్లాగే మనమూ వ్రాష్టా మనుకుని 'లేత బొమ్మంచుం గెంజిగురాకు మోవి జిశిధాత్వర్థం బనుష్ఠింతునో' లో జిశిధాత్వర్థం బని ప్రయోగించా. వాట్లో చమత్కారం వట్టి మాటలగారడీ. అదొక గొప్పవిషయంగాదు, పది మందినీ అబ్బా! అనుపించినా.

నే: ఎంత తేలిగ్గా దాటేసారండీ మాకాలం వాండ్లయితే మాకంటే ఘను ల్లేరనేవాండ్లు.

శ్రీ: నాయనా, అట్లా అనుకోవడం సహ జమే. సామాన్యశిక్షలేక లేకేదన్నా లభిస్తే పట్టపగ్గా లుండవ్.

నే: వాస్తవం. తమరు తెలుగు వ్రాస్తూ వ్రాస్తూ సంస్కృతంలోకి దూకుతారేం?

శ్రీ: నే దూకడమేమిటోయ్! సంస్కృత మే నా వాక్కు నలమికొని వస్తూంటే వద్దనడ మెట్లా! దానికి పూర్వజన్మవాసన చిన్నప్ప

ట్నుంచి ఆ భాషలో చేసిన కృషి కారణాలు. నీ జీవితాన్ని పరీక్షించుకో-నీ కెదైనా అభిమాన విషయముంటే అది నీవేం జేస్తున్నా నేనన్నా నని వస్తూంటుంది.

నే: (కొంచెముంచి) నిజమే నండోయ్! నాకు విజయనగర సామ్రాజ్యమన్నా, దాని శిథిలరాజధాని నేటి హంపీయన్నా మహా అభిమానం. నే నేజన్మైనా దాని విషయమెత్తకుండా వుండలేను.

శ్రీ: అయితే వట్టి తెలుగుల్లోమటుకు నడప లేదా? ఇట్లాటి పద్యాలెన్నో వున్నాయ్. నా గ్రంథాల్లో—

"ఎట్టు పురాణము ల్పదియు
 నెన్మిది; గూర్చితి వెట్టు వేదము
ల్పట్టిటి చెర్పరించి; నుడి
 కావము సాం పెసలార భారతం
బెట్టు రచించి తీవుఋషి;
 వెట్టయి కొక్కదినంబు మాత్రలో;
బొట్టకు లేక తిక్కెదవు
 పుత్రగుణంబులరాశి కౌశికా"

నే: జెమగు తిక్కెదవు అంటే జ్ఞాపకం వచ్చింది. తమరు తిట్టు కవిత్వం జెప్పారా యెప్పుడైనా.

శ్రీ: ఛీ! విధవపని! నే నిద్రానేమోనని అంతా ఋషిసేవాండ్లుగాని, నా నోట నది వచ్చేదికాదు. అయినా, నాకేం కర్మం ఆ భ్రష్టకవిత్వం చెప్ప డానికి, సర్వవిధాల ఆంధ్రలోకం నే నెట్లాంటి వాణ్ణైనా బ్రహ్మరథం పడ్తూంటే. అట్లా గౌర వించకుంటే చెప్పేవాణ్ణనికాదు. నాకది చాలా నీచకార్యంగా అగుపిస్తుంది. మనల్ని మెచ్చుకునే వాళ్ళుంటారు. అది వాండ్లవాండ్ల అభిరుచులను బట్టివుంటుంది. మెచ్చుకోలేదని, మెచ్చి మేకతోలు కప్పలేదని, పసదిడ్డం సత్పురుషలక్షణమా? బ్రతికున్న నాల్గురోజులు మంచివాడనిపించుకోవడం మంచిదా, బ్రతికున్నన్నాళ్లు ఎప్పుడు చస్తాడా అని, చచ్చింతర్వాత చచ్చాడ్రా,పీడ వదిలిందిరా అని పించుకోవడం మంచిదా?

నే: అంటే, తిట్టకవులంటే మీకు నిరసనన్న మాట.

శ్రీ: వారిశైలి,యిష్టమేగాని, నియమబద్ధమై వారు చెప్పిన తిట్టుకవిత్వం నాకు మంట. వారి గొప్పతనాన్ని కవిత్వవిషయంలో నే వర్ణిస్తూ ఒక సీసపద్యం చెప్పి జ్ఞాపకం కూడాను.

నే: ఔను. జ్ఞాపికి వచ్చింది. ఒక్క సందేహం: తమ గున్నంతికాలం వాక్యార్థాలు చేస్తూ, దిగ్విజయాలు చేస్తూ అనర్గళకవితాధాటనగుపరుస్తూ తమ రెదుట నెవరూ నిల్వజాల కడలిపోయేట్లు ప్రవర్తించారు. చివర కవతారసమాప్తివేళ మా శక్తిసామర్థ్యాలను స్వర్గంలో గూడా ప్రదర్శించక పోతామా అన్నట్లు 'దివిజకవివరుగుండియ దిగ్గురనగ నరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి' అన్నారూ? అంత గర్వమెందుకండీ పెద్దలకు?

శ్రీ: మీకాలం వాళ్లతో చావొచ్చిందోయ్! మీకు తోచిందే మతంగాని యితరేమనుకుంటారోనన్నైనా విచారించరుగా! ఆంధ్రంలో వాడుకలో ఒక వాక్యముంది 'నే నస్తే మనిషికో' నని. దాన్లో అర్థం గర్వమా, వాస్తవమా? వీడొస్తున్నాడ్రో బాబూ, రేపట్నుంచి మన భరతం పడ్తాడని బృహస్పతి గుండెల్లో రాయి బడేట్లు వెళ్తున్నాడంటే, దాన్లో చమత్కారమే ప్రధానలక్షణంగా పరిగణించాలి. అంతే గాని బృహస్పతంతటి మహనీయుడు తనకు ఋడుస్తాడమ టనే వెర్రివాడా యీ శ్రీనాథుడు? ఎన్నెన్ని జన్మలెత్తినా ఆ మహాత్మ్యాన్ని తెలిమాడగలనా?

నే: చిత్తం; నా కర్థం సరిగా గాకన్నా; క్షమించండి. నాకిక సెలవు పుచ్చుకుని వెళ్లిన స్తా. ఈ రోజే ప్రయాణమై వెళ్లి, త్వరలో తమ శావ గార్ని కలుసుకోవాలి.

శ్రీ: సరే, వెళ్లిరా; ఆయన్తో ఎట్లా మాట్లాడ్తావో జాగ్రత్త! ఇట్టి అమాయకుడు, పరమ భక్తుడు, నిర్లిప్తుడు.

నే: చిత్తం. నొచ్చుకోకుండా...

శ్రీ: నొచ్చుకేముంది, పాపం ఆయన చేసింది. సింగమనీ డాయనకు చేసిన మహోపకారాని కా పండితప్రభువు చక్కగా అనుభవించాడు. దివంగతుడైనాడు; వెల్లూండ విశిష్టివారి వంశం వేంకటగిరి చేరాల్సొచ్చింది. సరే వెళ్లిరా.

[నిష్క్రమణం]

"నియంతృత్వాల్లో విభేదాలు"

శ్రీ వేలూరి సహజానంద

డిక్టేటర్లు 20వ శతాబ్దానికి పూర్వమూ ఉన్నారు. ప్రభుత్వ-చరిత్ర ఆదినుంచి డిక్టేటరు షిప్ ఏదో స్వరూపంలో సింహాసనంపై అధిష్ఠిస్తూనే ఉంటోంది. దేశంలో ఓ విప్లవం చెలరేగాక, వెనవెంటనే 'పార్లమెంటరీ' వ్యవస్థ కూలి, నియంతృత్వమేర్పడటం జరుగుతోంది.

'స్వాతంత్ర్యము, సమత్వము, సౌభ్రాతృత్వము' కోసం విప్లవధ్వజం ఎగురవేసిన ఫ్రాన్సుకు నెపోలియన్ డిక్టేటరయ్యాడు. చక్రవర్తి లుఫీకి, రాణికి మరణశిక్ష విధించిన దేశం నెపోలియన్‌కు కిరీటం పెట్టింది.

పూర్తి సామీప్యం లేకపోయినా టర్కీ స్వాతంత్ర్యస్థాపకుడు కెమాల్ అట్టార్కు నియంత అయాడు.

1939 వరకు పోలండు, రుమేనియా... దేశాల్లోనూ డిక్టేటరుషిప్పే అధికారంలో ఉంది.

అయితే ఈ శతాబ్దంలో డిక్టేటరుషిప్పులు జర్మనీ, ఇటలీ, రష్యాల్లో— ఈ మూడుదేశాల్లోనే బాగా బలపడి స్థిరపడ్డాయ్.

డిక్టేటర్లు అనగానే హిట్లరు, ముసోలినీ, స్టాలిన్ గుర్తుకు వస్తారు.

1919-39 సంవత్సరాలకు మధ్య ఈ ముగ్గురిని ఒకే కూటంగా ఎంచేవారు విమర్శకులు— ముఖ్యంగా టోరీ-విమర్శకులు. వీరితోపాటు 'పాసిఫిస్టు'లు (యుద్ధవ్యతిరేకులు).

అంతేకాదు వీరిలో కొంతమంది హిట్లర్, ముసోలినీలకంటె స్టాలినే ఎక్కువ దుష్టుడని; నాగరికతకు శత్రువని; పాశ్చాత్య, 'క్రైస్తవ' సంప్రదాయానికి పూర్తి వ్యతిరేకి అనికూడా తీవ్రంగా విమర్శించేవారు. ఇంగ్లీషు ప్రభువుల్లో (లార్డు) ఒకాయన ఇలా తీవ్రంగా, అతి తీవ్రంగా విమర్శిస్తూ ఉండగానే రెండవ యుద్ధపు రణభేరి మోగింది. పాపం ఆయన వెంటనే సైన్యంలో చేరి, స్టాలిన్‌కంటె నాణెమనుకున్న హిట్లర్ సైన్యాలనే ప్రతిఘటించవలసివచ్చింది. దేశభక్తితో యుద్ధాని కురికిన ఆ ప్రభువు చివరకు యుద్ధభూమిలో చనిపోయాడు.

యుద్ధంవచ్చేదాకా హిట్లర్, ముసోలినీలే మిత్రులనుకున్నాడు. అలా అనుకుంది ఆయన ఒక్కడే కాదు. వారిలో కొంతమంది యుద్ధంలో చనిపోయారు. ఇంగ్లండులో హిట్లర్ కురిపించిన అగ్నివర్షంలో భస్మమైపోయారు. జీవించి ఉన్నవారు తమ మానసిక దృష్టి ఎంత భ్రాంతిలో చిక్కుకుపోయిందీ, రక్తపాతంలో స్పష్టంగా చూడగలిగారు.

1934 లో లాయడ్‌జార్జి ఇలా ప్రకటించాడు:

"మానేస్తంగా జర్మనీని ఆహ్వానిస్తాము"

హిట్లరు ఆ ఆహ్వానానికిచ్చిన జవాబుకు ఇంగ్లండింకా తెప్పరిల్లుకో లేకపోతోంది.

రెండు యుద్ధాలమధ్య కన్సర్వేటివ్ నాయకులు, యుద్ధవ్యతిరేకులు...వీ రవలంబించిన విధానాలవల్ల హిట్లరుకు తగిన అవకాశం, వాతావరణం లభించటమేకాక, యుద్ధసంపత్తికూడా లభించింది.

ఇంగ్లండు పెట్టుబడిదారుల్లో ఓ ప్రముఖుడు సర్ ఆర్థర్ బాల్ఫోర్ స్పష్టంగా చెప్పాడు.

"జర్మన్ దేశస్థులు మళ్లీ యుద్ధం చేస్తారా? ఆ విషయంలో సందేహం ఏమీ లేదని నా అభిప్రాయం. అంతేకాదు, ఒకనాడు వశం వారికి ఆ యుద్ధసంపత్తి చేకూర్చవలసివస్తుం దని కూడా నాకు తోస్తోంది."

ప్రభుత్వ ప్రతినిధులు ('1919-'39 మధ్య కన్సర్వేటివ్‌లే ఎక్కువగా ప్రభుత్వ బాధ్యత వహించారు), రాజకీయ పండితులు, యుద్ధవ్యతిరేకులు...వీరి ప్రచారంమూలంగా నాజిజమ్, ఫాసిజమ్‌లకు యూరపులో, ఇంగ్లండులో సత్కారం లభించింది. అంతేకాక పెట్టుబడిదార్ల సహాయంకూడా సిద్ధించింది. హిట్లర్, ముసోలినీలు తమకు అంగబలం, అర్థబలం లభించినాయని మురిశారు. కన్సర్వేటివులు, వగైరా, హిటలర్ ముసోలినీలద్వారా స్టాలిన్‌కు సంకెళ్లు బిగించవచ్చనుకున్నారు.

ఇట్టి మూర్ఖత్వంమూలంగా తర్వాత ఎంతో విపత్తుకు అవకాశం ఏర్పడ్డది.

నాజిజం, ఫాసిజం, కమ్యూనిజమ్; హిట్లర్, ముసోలినీ, స్టాలిన్...అంతా దుష్టవర్గం!

ఈ ముగ్గురికీ, ఈ మూడు సిద్ధాంతాలకు లక్ష్యాలు వేరు...పూర్వయుగాల్లోవలె, ఓ వ్యక్తి సర్వాధికారం తన పరం చేసుకొని, అధికార తృష్ణతో విజృంభించినట్లే ఈ ముగ్గురూ కూడా వ్యూహాలు పన్నుతున్నారని భ్రాంతిపడ్డారు.

నాజిజం, ఫాసిజంలకు, కమ్యూనిజానికి పోలిక ఎక్కడైనా ఉందా!

అయితే 'నాజిజం ఫాసిజంలతో చేరమడవచ్చు. కమ్యూనిజంతో రాజీలేదు' (జె. డి. చాంబర్సు) ఈ ప్రవృత్తితోనే కన్సర్వేటివ్ మేధావులు, నాయకులు ప్రవర్తించి ఉంటారు.

మొదటి యుద్ధంమూలాన, తర్వాత ఒడంబడికలమూలంగానూ బాగా దెబ్బతిన్నదని, జర్మనీకి సానుభూతి చూపించినవారు హిట్లర్ విజృంభణ చూసి విస్తుపోలేదు. సామ్రాజ్యవాదులైన తమ జోలికి రాకుండా వుంటే చాలు. జర్మనీ తన పూర్వ ప్రతిభతో మళ్లీ సామ్రాజ్యాన్ని నిర్మించుకోవద్దూ? అలాగే ముసోలినీ.

కాని ఇక్కడే ఈ ఈస్ట్-ఇండియా-కంపెనీ-సామ్రాజ్యవాదులు పూర్తిగా పొరబడ్డారు. ఏదో ఒక్క పోలండు, ఆస్ట్రియాను ఆక్రమించి, అక్కడితో హిట్లరు టాంకులు ఆగిపోతాయనుకున్నారు. ఓ అబీసీనియా అమాయక ప్రజలపై బాంబులు కురిపించిన ముసోలినీ విమానాలిక ముందుకు ఎగరక, రోముకు మళ్లుతయనుకున్నారు. హిట్లర్, ముసోలినీలకు భూదాహం హద్దులతో ఆగదు. ఊరికే ఇతర దేశాలను తమ అధీనం చేసుకోటమే కాదు వారి లక్ష్యం.

ఇంతవరకూ మానవకోటికి అభ్యుదయ మార్గాన్ని సూచిస్తున్న సిద్ధాంతాల నరికట్టి వాటి స్థానే తమ స్వజాత్యహంకార సిద్ధాంతాన్ని స్థాపించి, యావత్ ప్రపంచ ప్రజలనూ ఈ ఉత్తమ జాతులకు 'జోహుకుం' చేయించటమే వీరి లక్ష్యం.

జర్మన్లు ఆర్యను. ప్రపంచంలో ఆర్యులు ఉత్తములు. ఇతర జాతులవారంతా క్షుద్రులు. ముఖ్యంగా 'జ్యూ'లు. ఈ యూదులను నిర్మూలిస్తేగాని జర్మనులకు శాంతి భద్రతలు లేవు. ప్రేమతో కంటె ద్వేషంతో ప్రజలందర్నీ ఏకం చెయ్యొచ్చు. యూదులపై ద్వేషంతో జర్మనులందర్నీ ఏకం చేసి, తన దారుణ, అమానుష సిద్ధాంతాల స్థాపనకు పూనుకోవచ్చు. ఇదీ హిట్లరిజం.

కొద్ది గొప్ప తేడాతో ఇటలీ ధోరణి ఇదే. ఇటువంటి సిద్ధాంతం ఇదివరలో ఏ రాజకీయ నాయకుడూ అవలంబించలేదు. జాతే (మతంతో ప్రసక్తిలేదు) ఆధిపత్యానికి ఆధారమని; తమ జాతే ఉత్తమమని; కాబట్టి మానవసమాజంపై అధికారం తామే చెలాయించాలని సిద్ధాంతం చేసే ఈ నాజీజం, ఫాసిజం... వీటికి సమానమైనదేనా కమ్యూనిజం?

కమ్యూనిజంకూడా ఒక సిద్ధాంతమే. దానికి జాతి, మతాలతో సంబంధం లేదు. రష్యాలో అనేక జాతులవారున్నారు. యూదులున్నారు. జాతిభేదంవల్ల ఏ వ్యక్తికి అపకారం లేదు. తమదే ఉత్తమజాతి అనే సిద్ధాంతం ఎప్పుడూ బోల్షివిక్కులు చెయ్యలేదు. అలాంటి అహంకార సిద్ధాంతానికి కమ్యూనిజం పూర్తిగా వ్యతిరేకం. మరొక్కన్న కమ్యూనిజానికి నేత, జ్యూ. వివిధమైన, జాతి, మత, సాంఘిక, ఆర్థిక, స్త్రీ పురుష అసమానత్వాలకు కమ్యూనిజం చోటివ్వదు. కమ్యూనిజం ఈ వ్యత్యాసాలను నిర్మూలించి, సర్వ సమానత్వం స్థాపిస్తుంది.

అంటే, పరదేశీ ఆక్రమణ, పరప్రజ పీడన కమ్యూనిజానికి లక్ష్యాలు కావు. ఏదో ఒక్క దేశంలోనే కాదు. ప్రపంచ మెల్లెడలాకూడా మానవకోటిని కుంగదీసే అన్యాయాలను తొలగిస్తుంది.

ప్రపంచంలో అన్ని దేశాలూ ఒక దానితో ఒకటి సమానం. ప్రజలందరూ ఒకటే.

నాజీజం ఇందుకు విరోధి.

ఈ మూడు సిద్ధాంతాల్లో స్త్రీ కెట్టి స్థాన ముంది?

భర్తను సుఖపెట్టటం; ఆరోగ్యవంతులైన బిడ్డలని కనటం....పత్నీత్వం....మాతృత్వం... ఇవే స్త్రీకి లక్ష్యం. 'రాజకీయాల్లో స్త్రీకి చోటులేదు' అన్నాడు ముసోలినీ, అదే ధోరణి హిట్లరుది. తర్వాత పరిస్థితుల ప్రాబల్యంవల్ల పరిశ్రమల్లో, యుద్ధంలో కూడా జర్మను స్త్రీలు పాల్గొనవలసివచ్చింది. కాని సిద్ధాంతరీత్యా, స్త్రీ ఇలువాటి రాకూడదు. స్త్రీలు రాజకీయాల్లో పాల్గొనటమంటే ఆ విషయం ముసోలినీకి హాస్యాస్పదం.

కాని కమ్యూనిజం ఇందుకు పూర్తిగా వ్యతిరేకం. స్త్రీకి పురుషునితోపాటు సమానత్వాన్ని స్వాతంత్ర్యాన్ని స్థాపించింది, సాంఘికంగానే కాక, ఆర్థికంగా కూడా. స్త్రీని పూర్వయుగాల్లో మాదిరిగా నాజీజం, ఫాసిజం అణచిపెట్టితే కమ్యూనిజం స్త్రీని చిరకాల కారాగృహం నుంచి విడుదల చేసింది. ఇక్కడ ఇంకో విషయంకూడా చెప్పవచ్చును. 'ప్రజాస్వామిక రాజ్యాల్లో' (అంటే సరిగా చెప్పాలంటే, బూర్జువాడిక్టేటరుషిప్ రాజ్యాల్లో) వ్యభిచారం హెచ్చు. కాని రష్యాలో పోనుపోను క్షీణిస్తోంది.

సాంఘిక, ఆర్థిక స్వాతంత్ర్యం స్త్రీకి లభిస్తే ఇక ప్రళయమే నని వాపోయేవారు, ఈ సంగతి గుర్తుంచుకోవాలి.

ఈమూడు సిద్ధాంతాలకు ఇంకో ముఖ్య వ్యత్యాసం ఉంది.

నాజీజం, ఫాసిజంకు డిక్టేటరు షిప్పే లక్ష్యం. జర్మను, ఇటలీ దేశస్థులకు ప్రభుత్వం ఆరాధ్య దైవం. కాని రష్యనుకు కాదు.

కమ్యూనిజానికి డిక్టేటరుషిప్పు లక్ష్యంకాదు. ఒక సాధనం మాత్రమే. లక్ష్యం ఏమిటి మరి? ప్రభుత్వ అధికారం ఏమాత్రం లేని సంపూర్ణ, స్వతంత్ర ప్రజాస్వామిక వ్యవస్థ. అప్పుడు కారయుతమైన నాయకత్వం ఉండదు. నియంతృత్వం ఉండదు. ఆ వ్యవస్థను, అట్టి సంపూర్ణ స్వతంత్ర ప్రజాస్వామ్యాన్ని స్థాపించటానికి డిక్టేటరుషిప్ తాత్కాలికంగా తప్పని సరైన సాధనం. నాజీజం, ఫాసిజం ఇందుకు వ్యతిరేకం. ప్రజాస్వామ్యానికవి ఆజన్మశత్రువులు.

గతసంవత్సరాలలో సోవియటు డిక్టేటరుషిప్ బిగువు కొంచెం కొంచెం సడలుతూ, క్రమేపీ రాజ్యాంగంలో ప్రజాప్రమేయం అభివృద్ధి చెందుతోంది. జర్మని. ఇటలీల్లో ఇది కన్పించదు.

తర్వాత నాజిజం, ఫాసిజమ్ యుద్ధం పవిత్రమైన కార్యక్రమం. పరహింసలోగాని మనుష్యుని ఔన్నత్యం వికసించదని ఆ సిద్ధాంతాల భావ్యం యుద్ధం అవసరమేకాక, కోరవలసింది. ఇందుకు కమ్యూనిజం వ్యతిరేకం. యుద్ధాలు లేని శాంతి సమాజాన్ని స్థాపిస్తుంది. యుద్ధాన్ని కోరదు. పూజించదు.

కాబట్టి ఏ విధంగా చూసినా నాజిజం, ఫాసిజంలకు కమ్యూనిజానికి సిద్ధాంతాల్లోగాని, లక్ష్యాల్లోగాని ఐక్యత లేదు.

రెండవ సంగ్రామంలోగాని ఈ విషయం కన్సర్వేటివ్ రాజకీయజ్ఞులకు బోధపడలేదు. 1919-39 మధ్య రష్యమీద చేసిన దుష్ప్రచారం, యుద్ధంలో రష్యాతో చేసిన నేస్తం ఈ దృష్టిదోషాన్ని రుజువు చేసినయ్.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

మద్రాసు, యు. పి, బీహార్ రాష్ట్రములలో జమీందారీలను రద్దుచేస్తూ శాసనములు తయారుచేయబడుతున్న విషయమూ, యు. పి. శాసనంలోని కొన్ని ముఖ్యాంశములు గత సంచికలో వివరింపబడినవి. మద్రాసు జమీందారీరద్దు బిల్లునుగూర్చి పాఠకులకు ఇంతకుముందే ముఖ్య వివరములన్నియు తెలిసియుండును. బీహార్‌లో జమీందారీలరద్దుకు తయారుచేయబడిన బిల్లు ముఖ్యాంశములను కూడ కొంతవరకు గమనించిన, ఈ మూడింటిని పోల్చి చూచుకొనుటకు వీలుగా నుండును.

బీహార్‌లో జమీందారీ ప్రాంతం వైశాల్యం 397 లక్షల ఎకరాలు. ఈ భూమి అంతా సాగుబడిలో లేకపోయినా, చాల ఉపయోగకరములే. ఈ ప్రాంతాలలోనే చాల గనులున్నాయి. అందువలన మొత్తం భూమి అంతా కూడా అటు వ్యవసాయానికిగాని, ఇటు పరిశ్రమలకుగాని బాగా ఉపయోగపడుతుంది. మనరాష్ట్రంలో జమీందారీప్రాంతం వైశాల్యం 288 లక్షల ఎకరాలు. కాని ఇందులో 137 లక్షల ఎకరాలు మాత్రమే సాగుబడికి పనికివస్తున్నది. మిగతా భూమి ఏవిధంగానైనా ఉపయోగకర మౌతుందేమో పరిశోధించి చూచినవారులేరు.

జమీందారులకు నష్టపరిహారం యివ్వాలని అన్ని రాష్ట్రప్రభుత్వాలూ ఆమోదించాయి. కాని, ఆ పరిహారం మొత్తం ఏపద్ధతిపై నిర్ణయించాలనే విషయంలో మాత్రం రాష్ట్రాలకు ఏకాభిప్రాయం కుదరలేదు. జమీందారుల ప్రస్తుత ఆదాయమునే ఆధారంగా తీసుకోనవలెనని బీహార్ ప్రభుత్వం నిర్ణయించింది. కాని ఈనాటి ఆదాయంగాక 180 వ సం. నాటి ఆదాయమే ఆధారంగా తీసుకోనవలెనని మరొక వాదన లేకపోలేదు. ఈనాటి ఆదాయమునే ఆధారంగా తీసుకుని, నష్టపరిహారం మొత్తం నిర్ణయిస్తే, 1802 వ సం. నుండి పన్నులు ఎంత ఎక్కువచేసి రైతులను అంత ఎక్కువగా పీడించిన జమీందారుకు అంత ఎక్కువ పరిహారం ముట్టుతుంది! కాబట్టి ఈ విధానం సమంజసమని రైతులెవ్వరూ ఒప్పుకోరు. బీహార్ రాష్ట్రంలో జమీందార్లు పన్ను లెక్కువచేసి, రైతులను పీడించనే లేదని బీహార్ ప్రభుత్వమే అభిప్రాయపడుతున్నది. జమీందారులు అక్రమముగా పన్నులెక్కువ చేసిన మద్రాసు రాష్ట్రంలో, ముందుగా పన్నును 1802 వ సం. రేట్లకు తగ్గించవలెనేమో గాని, పన్నులేమంత ఎక్కువ చేయబడని మా రాష్ట్రంలో అక్కర లేదని వారి వాదన. అందువలన జమీందారు ప్రస్తుతాదాయమునే ఆధారముగా తీసుకుని నష్టపరిహారం మొత్తం నిర్ణయిస్తారు. జమీందారు రైతులవద్ద వసూలు చేసే పన్నులమొత్తమును తీసుకుని దానిలోనుండి కొన్ని తగ్గింపులుచేసి, అతని నికరాదాయము నిర్ణయిస్తారు. మొత్తము ఆదాయము నిర్ణయించటంలో, జమీందారు వసూలుచేసిన పన్నుల మొత్తమునకు, సెస్సులవలన, చెరువులు వగైరాలలో చేపల వేలంవలన, నివేశనస్థలముల అద్దెలవలన, అడవులవలన, గనులవలన అతనికి లభించిన ఆదాయమును కూడా కలుపుతారు. గనుల విషయంలోమాత్రం గత 20 సం. ల ఆదాయమును కనుక్కొని సగటుచేసి, ఆ మొత్తము గత సంవత్సరం గనినుండి వచ్చిన ఆదాయంగా పరిగణిస్తారు. ఎందువలన ననంటే, గనులనుండి ఉత్పత్తి ప్రతిసంవత్సరములో ఎక్కువగా మారిపోవటానికి అవకాశం వున్నది. అందువలన 1 సం. ఆదాయమే ప్రమాణంగా తీసుకుంటే జమీందారుగాని ప్రభుత్వంగాని నష్టపడవచ్చును. ఈవిధంగా నిర్ణయింపబడిన మొత్తం ఆదాయంలోనుంచి కొన్ని తగ్గింపులు జరుపుతారు. పన్ను వసూలు చేయటం, జమీందారీ పరిపాలనఖర్చు, ఆదాయంలో నూటికి 15 నుండి 20 వంతులవరకు వుండవచ్చునని అంచనావేశారు. జమీందారీను ఏర్పాటుచేయటంలో ముఖ్యోద్దేశ్యం రైతులకు ఇతోధిక సౌకర్యాలను కల్పిస్తారని అప్పటి ప్రభుత్వం ఆశించటమే. కాబట్టి జమీందారు ఆదాయం మొత్తంలో నూటికి $12\frac{1}{2}$ వంతులు రైతులకొరకై ఉపయోగించవలసి వుంటుం దని అంచనావేశారు. ఇదిగాక జమీందారు చెల్లించవలసిన వ్యవసాయాదాయపుపన్ను, తదితర ఆదాయపుపన్ను, చౌకిదారీపన్ను మొదలగు పన్నులన్నీ కూడా లెక్కవేస్తారు. పైన జెప్పిన ఈమూడు మొత్తాలను ($20\% + 12\frac{1}{2}\% +$ పన్నులు) జమీందారు మొత్తం ఆదాయంలో నుండి తగ్గించి, అతని నికరాదాయం అంచనా వేస్తారు. ఈ నికరాదాయమును ఆధారంగా తీసుకుని జమీందారుకు యివ్వవలసిన నష్టపరిహారం నిర్ణయిస్తారు. చిన్న చిన్న జమీందార్లకు ఎక్కువరెట్లు, పెద్ద జమీందార్లకు తక్కువరెట్లు ఆ నికరాదాయం నష్టపరిహారంగా యివ్వాలన్న సూత్రం బీహార్ ప్రభుత్వంకూడా అంగీకరించింది. నికరాదాయం సంవత్సరానికి రూ. 2500 ల కన్న తక్కువ వచ్చే జమీందార్లకు సంవత్సరాదాయంపై 12 రెట్లు మొత్తం నష్టపరిహారంగా యిస్తారు. ఆపైన ఆదాయం పెరిగినకొద్దీ, రెట్లు తగ్గుతూ ఆ సంవత్సరమునకు నికరాదాయం రూ. 50 వేలకు మించినచో ఆ ఆదాయమునకు 5 రెట్లుమాత్రమే నష్టపరిహారం యిస్తారు. జమీందారుకు రైతులు బకాయివున్న కిస్తులో సగభాగము మాత్రం నష్టపరిహారంగా యిచ్చి, మొత్తం బకాయినంతమూ రైతువద్దనుంచి ప్రభుత్వం వసూలుచేస్తుంది. ఈ విధంగా జమీందారులకు యివ్వవలసివచ్చే నష్టపరిహారం మొత్తం రూ. 60-80 కోట్లు వుండవచ్చునని అంచనావేశారు. జమీందారీ ప్రాంతాలలో ఎక్కువగనులు వగైరావుండటంవలన ఇంత పెద్ద మొత్తము నష్టపరిహారం యివ్వవలసివస్తున్నది. అయితే, జమీందారులు వైదొలగినతరువాత వానినుండి ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయమే వస్తుంది. అందువలన పరిహారం ఇంత పెద్ద మొత్త మిచ్చినా, ప్రభుత్వానికి కష్టం కలుగదని తెలుస్తున్నది. నష్టపరిహారంఅంతా ధనరూపంగా గాని, ఒక్కమారుగా గాని యివ్వరు. కొంత మొత్తమునగదుగా యిస్తారు. మిగతాది ప్రభుత్వ ఋణపత్రాలరూపంలో యిస్తారు. చిన్న చిన్న జమీందార్లకు ఎక్కువమొత్తం నగదుగా యిస్తారు. పెద్ద జమీందార్లకు తక్కువ భాగం పరిహారంనగదుగా యిస్తారు. అందువలన ప్రభుత్వం ఒక్కమారుగా డబ్బుకొరకై వెతుకుకొనవలసిన అక్కరలేదు. ఋణపత్రాలమీద సాలుకు నూటికి $2\frac{1}{2}$ చొ. వడ్డీ యిస్తారు. ఈ ఋణపత్రాలు ఎప్పుడు తీర్చివేసేది చెప్పలేదుకాని, 80 ఏండ్లవరకు తీర్చబడకపోవచ్చును.

దేవాలయాలు, విద్యాలయాలు మొదలగు ధర్మాదాయ సంస్థలకువున్న భూములుకూడా—మన దేవాలయాల ఈనాములవంటివి—ప్రభుత్వం వశపరచుకుంటుంది. కాని వీటికి యివ్వవలసిన నష్టపరిహారం వేరొకవిధంగా నిర్ణయిస్తారు. ఇప్పుడు ఆ సంస్థలకు ఏటేటా ఎంత నికరాదాయం వస్తున్నదో నిర్ణయించి, అంతమొత్తము నికరాదాయమును ప్రతిసంవత్సరము వాటికి ప్రభుత్వమే చెల్లిస్తుంది. కాబట్టి వాటి భూములను ప్రభుత్వం వశపరచుకోవటం వలన ఈ ధార్మిక సంస్థలకు ఏ నష్టమూ వుండబోదు. దేవాలయాలు మొదలగు సంస్థల ఈనాములను కూడా రద్దుచేయటానికి నిర్ణయించిన మద్రాసుప్రభుత్వం ఈపద్ధతిని అనుసరిస్తే అన్ని వర్గాలకు సంతృప్తికరంగా వుంటుంది.

జమీందారీలు రద్దయిపోయినతరువాత రైతులందరు మనరాష్ట్రంలోవలెనే రైత్వారీ విధానంలోనికి తీసుకు రాబడతారు. అయితే, జమీందారీల రద్దువలన రైతులకు ఇంకే లాభమూ వుండదు. రైతుల సౌకర్యముల కొరకని జమీందారు మొత్తం ఆదాయమునుండి తగ్గించిన $12\frac{1}{2}$ వంతులు, ఇకముందైనా రైతుల సౌకర్యాలకొరకై వినియోగింపబడుతుందని హామీ ఏమీలేదు. అసలు మన ప్రభుత్వాలు కావాలనుకుంటున్నది రైతుకూలీ ప్రజారాజ్యమేగా!

బీహార్ జమీందారులలో కెల్ల పెద్ద జమీందారు దర్భాంగ మహారాజా. ఆయనకు ఇప్పుడు సాలుకు మొత్తం ఆదాయం రూ. 60 లక్షలు వస్తున్నది. పైవిధంగా నష్టపరిహారం యిచ్చి జమీందారీలను వశపరచుకొనటంవలన ఆయనకు ఈ విధంగా నష్టపరిహారం ముట్టుతున్నది: నెలకు రూ. 35 వేల చొప్పున 30 ఏండ్లవరకు ప్రతినెలా ప్రభుత్వం చెల్లించి, ఆ 30 ఏండ్ల ఆఖరున నగదుగా రూ. 150 లక్షలు ఒకేమారు యిస్తారు. జమీందారీల రద్దువలన జమీందార్లకు ఏమైనా నష్టం కలుగుతుందని భావించేవారు ఈ సంగతి గమనిస్తే మంచిది.

*   *

రిహాండ్ ప్రాజెక్టు

స్వతంత్ర భారతదేశం సత్వరార్థికాభివృద్ధి జెంది, ఆర్థికంగాను, రాజకీయంగాను ప్రపంచ రాజ్యాలలో అగ్రస్థానం ఆక్రమించుకోవాలనే మన మందరం కోరుతున్నాం. సత్వరార్థికాభివృద్ధి జరపటానికి వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి కూడా అవసరమే. నీటి పారుదల వసతులను వీలైనంత వృద్ధిచేసి తద్వారా వ్యవసాయాభివృద్ధికి దోహదం చేస్తూ, వేరొకవంక, పరిశ్రమలను నడపటానికి తగిన జలపాతవిద్యుచ్ఛక్తిని తయారుచేసి, తద్వారా పరిశ్రమల అభివృద్ధికి కూడా దోహదం చేయగల, బహుళ ప్రయోజనయుతములగు ప్రాజెక్టులను, అన్నిటి కన్న అగ్రవిషయంగా భావించి, వీలైనంత త్వరలో నిర్మించాలని భారతప్రభుత్వం ఉద్దేశించుచున్నది. మనరాష్ట్రంలో తలపెట్టబడిన రామపాదసాగర, తుంగభద్రా ప్రాజెక్టులు యిటువంటివే. ఇటువంటిప్రాజెక్టులు దాదాపు అన్ని రాష్ట్రాలలోను తలపెట్టబడి వున్నవి. వానిలో కొన్నింటినిగూర్చి యిదివరకు ఈ పేజీలలో సంగ్రహంగా తెలుసుకొనివున్నాము. యు. పి. రాష్ట్రంలో మిర్జపూర్ జిల్లాలో మిర్జపూర్ పట్టణ సమీపంలో నిర్మింపవలెనని తలపెట్టబడిన రిహాండ్ ప్రాజెక్టు ఇటువంటి ప్రాజెక్టులలో ఒకటి.

ఈ ప్రాజెక్టు యు. పి. లో మిర్జాపూర్ దగ్గర, రిహాండ్ నదిపై నిర్మించబడుతుంది. దీనికి ఖర్చు మొత్తం రూ. 16 కోట్లు అవుతుందని అంచనావేశారు. ఇక్కడ కట్టబడే ఆనకట్ట ఎత్తు సుమారు 293 అడుగులు ఎత్తు వుంటుంది. నీరు ఎల్లప్పుడు నిలువ వుండే 'చెరువు' విస్తీర్ణం సుమారు 180 చదరపు మైళ్ళు వుంటుంది. ఈ ప్రాజెక్టు వలన ఉత్పత్తి అయ్యే విద్యుచ్ఛక్తి లక్నో - కాన్పూర్ మధ్య ప్రాంతాన్నంతనూ విద్యుచ్ఛక్తి మయం చేసివేస్తుంది. అందువలన ఆప్రాంతంలో ఇప్పుడున్న పరిశ్రమలను మరింత చౌకగా నడపటానికీ, ఇప్పుడు స్థాపించితే గిట్టుబాటుగాని పరిశ్రమలను స్థాపించటానికే మంచి అవకాశం లభిస్తుంది, ఈ విద్యుచ్ఛక్తి పరిశ్రమలకే గాక గ్రామాలకు కూడా విరివిగా సరఫరా చేయుటానికి వీలుంటుంది. ఈ ప్రాజెక్టువలన మరొక 40 లక్షల ఎకరాల పొలం సాగుబడి చేయడానికి వీలుంటుంది. పైన జెప్పినటు, ఎల్లప్పుడూ 180 చ. మైళ్ళ వైశాల్యంగల 'చెరువు'లో నీరు నిలవ వుండటం వల్ల చేపల పరిశ్రమ అత్యద్భుతంగా అభివృద్ధి జెందటానికి కూడా మంచి వీలున్నది.

యు. పి. రాష్ట్రం పారిశ్రామికంగా కొంతవరకు వెనుకబడివున్న రాష్ట్రం. కాన్పూర్ లక్నో పట్టణాలలో తప్ప, వేరే ఎక్కడా చెప్పదగిన పరిశ్రమలు ఏవి లేవు. అయితే, పంచదార మిల్లులుమాత్రం చాల వున్నవి. ఇప్పుడు ఈ ప్రాజెక్టు నిర్మాణంవలన చాలా కొత్త పరిశ్రమలు స్థాపించటానికి వీలవుతున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాగానే మరి 4 పంచదార మిల్లులు, 6 బట్టల మిల్లులు, 4 సిమెంటు ఫ్యాక్టరీలు వెంటనే నిర్మాణం చేస్తారు. సిమెంటు తయారు చేయుటానికి కావలసిన ముడిపదార్థము-కంకరలాంటి రాయి—ఈ ప్రాంతంలో 4 చోట్ల కొత్తగా దొరికినది. బారాబంకీ ప్రాంతంలో రామనగర్‌వద్దనూ, లక్నోప్రాంతంలో గోమతీ గంజ్ వద్దనూ, రాయిబెరెల్లీ ప్రాంతంలో దాలమూ వద్దనూ, యునావో ప్రాంతంలో అజ్‌గావ్ వద్దనూ ఈ ముడిపదార్థము పరిపడినంతగా దొరుకుతుందని నిర్ణయించారు. ఈ ముడిపదార్థాన్ని 'మారల్' అంటారు. ఇదిగాక డేరాడూన్‌లో సిల్కుకకూనులను ఎక్కువగా పెంచి, సిల్కు ఫ్యాక్టరీ స్థాపించటానికి, బండెల్ ఖండంలోని రేవాప్రాంతంలో వున్న లోహసంపత్తిని చౌకగా త్రవ్వటానికీ, మిర్జాపూర్‌లో ప్లాస్టిక్ కాగితం పరిశ్రమను స్థాపించటానికీ కూడా ఏర్పాట్లు జరుగుతున్నవి. ఈ పరిశ్రమలకు కావలసిన బొగ్గును సరఫరా చేయటానికి మిర్జపూర్ ప్రాంతంలో దూధీవద్ద ఫింగర్నలీ బొగ్గుగని ఒకటి వున్నది. ఇంకా పరిశ్రమలు, ఈ ప్రాజెక్టు ప్రాంతంలో ఏవేవి స్థాపించటానికి వీలవుతుందో పరిశోధనలు జరుపుతున్నారు.

యు. పి. లో కాలవలపై రవాణా సౌకర్యాలు ఏర్పాటుచేయటానికి కూడా ఈ ప్రాజెక్టు వలన వీలవుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎక్కువగా కాందిశీకులను ఉపయోగించి ఆ విధంగా వారికి జీవనానికి కొంత ఆధారం కల్పిస్తారు. వెంటనే 5 మంది కాందిశీకులను ఈ ప్రాజెక్టుకొరకు పనిలో జేర్చుకుంటున్నారు. యు. పి. పబ్లిక్ వర్క్సు శాఖవారు కూడా కాందిశీకులను చాలమందిని పనివాళ్ళుగా జేర్చుకుంటున్నారు. ఇటువంటి బహుళ ప్రయోజనయుతములగు ప్రాజెక్టుల నిర్మాణానికి కావలసిన డబ్బు కొంతవరకు యిచ్చి కేంద్ర ప్రభుత్వం కూడా తోడ్పడుతుంది.

నారాయణ భట్టు

(6 వ పేజీ తరువాయి)

"నేను కుంతవ్యుడను. రాజకుమారులు ఆజ్ఞాపించినను నేను రాలేక పోతిని. ద్వీపాంతరములతో వ్యాపార మింకను తెగిపోలేదు. ఆ తొందరవలన ఊపిరి సలుపుటలేదు. అయ్యో, మీకే శ్రమ యిచ్చితినే!" అని గురునాథుడు ప్రారంభించెను.

ఆ నా డా మాటలు అతివినయముగా తోచుచున్నను శ్రేష్ఠి స్వభావసిద్ధముగనే యట్లు మాట్లాడువాడు. రాజమార్తాండుని లోపల పొంగుచున్న రోషము నిగ్రహింపగొనెను.

రాజ: "మేము వచ్చిన పని నీవు తెలిసియుందువు గదా!"

గురు: "ఏకమంతయు దెచ్చితిరా, రాజపుత్రా! మీకు శ్రమ ఇచ్చినందుకు విచార పడుచున్నాను. అత్యవసరముగా, మెడమీద కత్తివలె పనిపడి వ్రాయవలసి వచ్చినది. మీరు అడిగినదే వ్యవధానముగా ఈ స్వల్ప ధనము ఇచ్చివేయ గలరని ధైర్యముతో మీకే వ్రాయించితిని, మహారాజులు!"

రాజమార్తాండుడు మాట్లాడుట కవకాశము కోరకుటలేదు. ఏమి మాట్లాడుటయును పాలుపోక అతడు మౌనము వహించెను.

"రాజపుత్రా, సందేహించుచున్నారేమి?" గురునాథుడు ప్రశ్నించెను.

రాజ: "శ్రేష్ఠీ, మీకును మాకును మైత్రి వంశపారంపర్యముగా వచ్చినదిగాని యీనాటిదా?"

గురు: "ప్రభూ, దాని కిప్పు డేమి భంగము వాటిలినది?"

"భంగముకాక మరి యిది యేమిటి?" అనుచు రాజపుత్రుడు శ్రేష్ఠి పంపిన పత్రములు చూపెను.

గురు: "అందులో నేమున్నది? నాకు యవద్వీపములో చెల్లించవలసిన అవసరము కలిగి మీకు ఉత్తరములు పంపినాను. ఆ నౌక మోసల పట్టణములో వారము దినములలో బయలుదేర నున్నది."

రాజ: "గురునాథా! రాజపుత్రులమగు మాకు వక్రవాక్యములు రావు. మేము లోకుల కియ్యవలసిన ఋణము లన్నియు నొక్కపర్యాయము నీవు ఋణదాతలవద్దనుండి వ్రాయించుకొని మమ్ము గడియలమీద నా ధనమంతయు కట్టమనుట స్నేహధర్మమేనా?"

గురు: "అయ్యో, మహారాజా, అట్లనెదరేమి? మీరు సర్వసమర్థులు! నాకు ధన మవసరమై ఈ యూరి వర్తకులను వారు నా కీయవలసిన ధన మడుగగా, తమవొద్ద సిద్ధముగా లేనందున కావలెనన్న మీ సోదరుల ఋణపత్రము లిచ్చెద మని యిచ్చిరి. మీ సామర్థ్య మెరిగినవాడనుగనుక మీ పత్రములు చేతనున్నంత ధనమును చేతిలో నున్నట్లె భావించి నా యవసరమునుబట్టి వాని నంగీకరించితిని. ఇంతే నిజము; ఇందులో స్నేహవిరుద్ధమైన దేమియు లేదు, నమ్ముడు!"

రాజ: "అంత ధనము సిద్ధముగా గడియలమీద తీసికొని రాగలిగినవారము మీబోంట్లవద్ద ఋణము పుచ్చుకొందుమా?"

చప్పున శ్రేష్ఠి గూనూట కడ్డు వచ్చి "అంత మాటా, ప్రభూ!" అనెను.

రాజ: "శ్రేష్ఠీ! మేము కోరగన దొక్కటే. పూర్వమైత్రి పాటించి నీవు మా ప్రతిష్ఠ కాపాడవలె!"

శ్రేష్ఠి వినయముతో నమస్కరించుచు మధ్య మధ్య నాగుచు. "పూర్వమైత్రి...మరచిపోయినది...ముందు...మీరు కాని...నేను కాదుకదా, రాజపుత్రా!" అనెను.

రాజ: "ఆ విషయము మనము మరచి పోదము. అయిపోయిన దానికి పశ్చాత్తాపము జరిగినది చాలును. మీ తాతలు నేట విజయాదిత్యుల కెంత యంతెగా నున్నదియు వినలేదా? ఇప్పుడునూ ఆ మీకును మాకును మైత్రి ఉభయులకు శ్రేయస్కరము!"

గురునాథశ్రేష్ఠి మాటాడలేదు. అతనివైఖరిలో ననుక్షణము కలుగుచున్న మర్పును సూక్ష్మముగా రాజమార్తాండుడు గమనించుచుండెను. శ్రేష్ఠి యాలోచించుచునే యుండెను. రాజమార్తాండుడు గమనించుచునే యుండెను. తుదకు శ్రేష్ఠి ప్రసన్న భావము నొందెను

"రాజపుత్రా! క్షత్రియులు దీర్ఘక్రోధు లని ప్రతీతి నా అవినయము మీరు మన్నించినట్లు క్షత్రియోచిత విధముగా చెప్పినగాని వీనికి ధైర్యము కలుగదు."

శ్రేష్ఠిమాటలు విని, వెంటనే రాజమార్తాండుడు తన కుడిచేయి రొరలో నున్న ఖడ్గము పిడిపై నుంచి ఎడమచేయి పైకెత్తి గంభీరముగా నిట్లు వచించెను:

"గురునాథశ్రేష్ఠీ! నీవును మేమును మన తాతల కాలమునుండి యున్నట్లే మరల నీకు ణమునుండి యుమిత్రులము!"

శ్రేష్ఠికి దేహము జలదరించెను. గ్రీష్మాంతరమున వర్షాగమనమున కాలపురుషునికివలె నాతని మనస్సును ఒక్కసారి ద్రవించెను. రాజనీతి శ్రేష్ఠినీతిని జయించినది!

"పూర్వస్మృతులతో నాకు నోటమాటలు రాకున్నందుకు క్షంతవ్యుడను, రాజపుత్రా!" అని గద్గదికతో గురునాథుడు పల్కెను.

రాజమార్తాండుడు దీనికుచిత మగు సమయము వచ్చినదని అంతవరకు కనుపడకుండ కంఠమున వ్రేలుచున్న వజ్రకంఠిక పైకిదీసి గురునాథశ్రేష్ఠి చేతికిచ్చెను. కులక్రమాగతమైన వేడుకతో శ్రేష్ఠి యాకంఠికలో నివజ్రములు పరీక్షింపసాగెను.

"కంఠికలోనున్న వజ్ర మొక్కొక్కటియు నొక్కొక్క రాజ్యమువిలువచేయు నని గురునాథుడు గ్రహించెను. ఇట్టివజ్రము లున్న రాజపుత్రుల దైశ్వర్యము ముందు కోటీశ్వరుని సంపత్తు ఎందుకు పనికివచ్చును. వానిని పరీక్షించుచున్న కొలదియు శ్రేష్ఠి బుద్ధి వానియందు గాఢముగా లగ్నమయ్యెను. ఆత్మానుసంధానము చేయు యోగివలె నిశ్చలుడై యాతడక్కడనున్న రాజమార్తాండునే ముహూర్తకాలము మరచిపోయెను.

"మా పితామహులకు కుంతలేశ్వరులు వేంగీ మహామండలేశ్వరపదవి యనుగ్రహించుచు వారు స్వహస్తములతో మా తాతల నలంకరించిన వజ్రహార మిది. వేంగీప్రభువుల కులక్రమాగతమైన కంఠిక యిదియే!"

రాజమార్తాండు డీవిధముగా మాటాడుచుండ నా ధ్వనికి కలలోనుండి ఉలిక్కిపడి లేచువానివిధముగా తల యెత్తి గురునాథశ్రేష్ఠి "చిత్తము" అనుచు నా కంఠిక రాజపుత్రుని కందింపబోయెను.

రాజమార్తాండు డది తీసికొనక యిట్లనెను:

"మేము నీ కింత ఋణ మీయవలసి యున్నాము. రాజపుత్రులము మేము. మా దేహములు ప్రతిక్షణము నపాయములో నుండును. మా వృద్ధిక్షయముల వలనే మా మిత్రులకు నష్టము కలిగింపరాదు. ఈ కంఠిక నీ యొద్దనే ఉంచుకొని, మాకు కావలసిన ధన సహాయము చేయవలెనని మా సోదరుల అభీష్టము!"

శ్రేష్ఠి యా మాటలకు భయకంపితు డయ్యెను. ఈ సంభాషణ ప్రారంభింపక మున్నె తమ మాట లెవ్వరు వినువారు లేకుండ కట్టుదిట్టములు చేసి యేకాంతమున నున్నను చకితుడై తల యెత్తి దశదిశలు విలోకించెను.

"రాజపుత్రా! నాపై నింతభారము వేయవద్దు. ఈ కంఠిక మా బోంట్ల గృహములలో నుండ దగదు. మీ యొద్దనే యుంచుకొనుడు" అనుచు శ్రేష్ఠి కంఠిక యీయబోయెను.

కాని రాజమార్తాండుడు తీసికొన నిరాకరించెను. "మా ఋణ విమోచన మైనప్పుడే యిది మరల తీసికొందము. మరి మమ్మిపుడు తీసికొమ్మనుట స్నేహలోపముగా గణింతుము." అనెను.

గురునాథశ్రేష్ఠి మరి మాటాడలేక పోయెను. బలవంతులతో వైరము మంచిదికాదు, అందరతో మంచిగా నుండుట వ్యాపార ధర్మము!

"రాజపుత్రా! అట్లైన మాట్లాడను. మీరు చేసిన ఈ ఋణముల సంగతి నాకు తప్ప యితరులకు తెలియదు. ఇక ముందుకూడ నట్లే యుండును. మీ రింకను ఇతరుల కీయవలసిన ఋణము లున్నవా?"

రాజపుత్రుని ముఖము ఆనందముతో నొక్కసారి వికసించెను. "ప్రస్తుతము ఐదులక్షల వరహాలు చాలును" అనెను.

"రేపు మీ కవి చేరునట్లు చేయుదును."

ఉభయులు నంతట సాదర వచనము లాడుకొనిరి. రాజమార్తాండుడు కృతార్థుడై వెడలి పోయెను.

ఆ యపరాహ్ణమున మాండలికుల లోకిగనే కుమార సప్తకము ఋణము తీరిపోయినట్లు గురునాథశ్రేష్ఠి లెక్కలలో కరణములచే వ్రాయించెను. ఆ ఋణ మంతయు నతని ధర్మపత్ని లెక్కకు మార్చబడినట్లు అతని కరణములకు తెలియవలసిన యావసరము లేదు. ఆ లెక్కనుండియే మరునాడు రాజమార్తాండుని మందిరమునకు స్వయముగా నేగి గురునాథశ్రేష్ఠి ఐదులక్షల వరహాలను యిచ్చెను.

బ్రిటిష్ చక్రవర్తినులు




విక్టోరియా మహారాణి



ఎలిజబత్ రాకుమారి



ఎలిజబత్ మహారాణి



రాజకుటుంబము దంపతులు



పెడ్లికొడుకు పెండ్లికూతురు

Regd No. M. 4479.

Edited Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., G. T. Madras.